" ఆంధ్రభూమి "



గాంధీ మహాత్ముడు

"మహాత్మా! మీరు మా దేశంబునకు విచ్చేయుటంజేసి జన్మాష్టమియు మహానవమియు ననంతచతుర్దశియు దక్షిణాయనపుణ్యకాలంబు నుత్తరాయణసంక్రాంతియు తులామేషసంక్రాంతియు దశమియు నేకాదశియు ద్వాదశియు నమావాస్యయు లోనగాఁగల పుణ్యదివసంబులు మాకు సమకూరె."

# సంక్రాంతి : ఆంధ్రభూమి

✠

౧

ఇది యపూర్వశుంభచ్ఛోభ పొదలు కొనెడు
ఘటితవైభవామోదసంక్రాంతిదినము ;
హేయజీవితభిక్షుకహృదయలతయు
నగణితసుమాళిసుమరాజి సొగయు దినము.

౨

ప్రకటితోత్సవవైభవోల్లాసములకు
గొనబు కాణాచియైన మా తెనుఁగుసీమఁ
గ్రొత్తఁదనపుమవ్వమ్ములు ప్రోదిసేయు
నిర్వపణశుభసంక్రాంతిపర్వవేళ.

౩

భాసురవిలాససంక్రాంతివాసరమున
సహజదరహాససూనస్రజమ్ము తోడ
ప్రకృతిబాలిక భక్తిభావమ్ము లొలుక
నర్చనావిధిఁ గైసేసె నాంధ్రభూమి.

౪

మానితపరస్పరానుషంగానుభూతి
శాలదంపతులకుఁ బూఁప వలపుఁబొలుపు
స్వాంతసీమ వెలార్చి సంక్రాంతి తెలుపు
నాంధ్రసన్నుతాచారమర్యాదవృత్తి.

✠

—ఓలేటి సీతారామమూర్తి.



# పుస్తకాలు వ్రాసేతీరు

## ఉపోద్ఘాతము

ఈమధ్య వుద్యోగపు బాదరబందీవల్ల యేమి వ్రాయడానికి తీరిక లేకుండా వుంది. ఈదినం యేదైనా వ్రాయాలనికూర్చుంటినిగదా యెంత సేపటికీ కలంసాగదు. నాకాశ్చర్యం వేసింది. పత్రికాధిపతులు అంగీకరించేలా వున్నా, అంగీకరింపకపోయేలా వున్నా, వ్రాయాలని కూర్చుండేసరికి యిదివరకు వ్రాయగలిగేవాడిని. ఈ జడత్వం నన్నాలోచనలోకి దింపింది. ఇన్నిపత్రికలలో వ్యాసాలు వస్తున్నాయి, యిన్నిపుస్తకాలు అచ్చుపడుతున్నాయి, వారందరు ఏలావ్రాస్తున్నారు, దీని కేదైన కిటుకు వుందా, అది నొక్కేసరికి వ్యాసరచనాని కుపక్రమింపజేసేయంత్రం నడవడమునకు అనేయోచనలో పడ్డాను.

## ఉన్నవ లక్ష్మీనారాయణపంతులు

చూడగా చూడగా నాకట్టిత్రోవా తెన్నూ యేమీ గోచరింపలేదు. ఈరచనావిధానం వ్యక్తులనుబట్టి మారుతూవుండేలాగున్నది. త్వరజీవనము గ్రంథరచనకనను కూలమని కొందరిమతము. పాశ్చాత్యదేశాల్లో రచయితలాకారణంచేతనే ఉద్యోగస్వీకరణం చేయకుండా స్వతంత్రజీవనము కోరుతారు. అయినా అనేకవ్యవహారాల్లో జోక్యంకలుగజేసుకుంటూ నిరంతరకార్యలోలులైన వారిలోగూడా కవులు, వ్యాసకర్తలు, నవలారచయితలు వున్నారు. డబ్ల్యు. బి. యీట్సు, సర్ హాల్కేను, బర్కిన్‌హెడ్డు ప్రభువు, రవీంద్రనాథ ఠాకూరు, కజిన్సు మొదలైనవారట్టివారు. ఉన్నవ లక్ష్మీనారాయణపంతులుగారు రిటువంటివారు. ఖయిదులోవున్న సమయంలో, తెలుగుభాషలోని నవలలకెల్లా మకుటమనదగిన మాలపల్లెను వారు రచించడము నల్లరాతిమీద పువ్వులతను పెంచుటవంటిది. జాన్ బనియను అను సుప్రసిద్ధఆంగ్లేయరచయిత 'పిలిగ్రిమ్సు ప్రోగ్రెసు' అనే గ్రంథమును చెరసాలలోనే వ్రాశాడు. లోకమాన్య తిలకుమహాశయుడు గీతాభాష్యాన్ని నిర్బంధకాలంలోనే రచించాడు. డిప్యూటీకలెక్టరుగా వుండి బంకించంద్రుడు, జిల్లాకలెక్టరుగావుండి రమేశచంద్రుడు అనేక వుద్గ్రంథాలను రచించారు. కనుక దేశకాలాలకు రచనకు సంబంధంవున్నట్టు తోచదు.

## కందుకూరి వీరేశలింగముపంతులు

వీరేశలింగంగారి గ్రంథరచనావిధానం కూడా చిత్రమైనదే. పగలల్లా సంస్కరణవిషయాలతో వెళ్ళబుచ్చేవారు. పీనసరోగపీడితులవడంచేత రాత్రులు వీరికి సరిగా నిద్రవుండేదికాదు. అపుడు ఆముదపుదీపందరిని గూర్చుండి కత్తివంటి పదునుగల తమ కలాన్ని సాగనిచ్చేవారు.

## చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులు

కొందరు తమంతతాము వ్రాయజాలకపోవడముచేత వ్రాయడానికితరులపై ఆధారపడ్డవారున్నారు. మిల్టను ఉత్తరజీవితములో అట్టివాడు. అత డంధుడు, వ్రాయజాలడు. ఆతరుణంలోనే అతడు 'ప్యారడైజు లాస్టు' అను తనమహాకావ్యాన్ని రచించినది. వొంటరిగా వున్న సమయాల్లో పద్యాలుకూర్చుకుని, కంఠస్థముచేసికొని వ్రాసేవారెవరైనావస్తే యేకధారగా చదివి వ్రాయించేవాడు. మన చిలకమర్తి లక్ష్మీనృసింహంపంతులుగారు కూడా యిట్టివారే. వీరికి వుత్సాహంకలిగిందా ఒకేదమ్మున పదిపదిహేను పేజీలవరకు చెప్పేవారు. లేదా ఆరోజున అరపేజీకూడా జరగేదికాదు. వీరినవలల

ఈవిధంగానే వ్రాసేవారు. నాటకాలలోని పద్యాలను ముందుగా అల్లుకుని వ్రాయసగాడు వచ్చినపుడు వానిని సంభాషణలో కలిపి చెప్పేవారు. వీరి నరకాసురవిజయాన్ని యీవిధంగా నెల కొకఅంకముచొప్పున రచించి మనోరమ పత్రికలో ప్రకటించారు. కర్పూర మంజరి రెండవభాగాన్ని రచించుటకు చాలా కాలయాపన చేశారు. పంతులుగారు వృద్ధులైనారు ప్రథమభాగముతో తులతూగునట్లు రెండవభాగమును పూర్తిచేయలేరని పలువురు తలచారు. కాని వీరి కూర్చున్న తరువాత దానిని అచిరకాలంలోనే పూర్తిచేసి కథాసంవిధానంలోను, శైలిలోను యౌవనబింకాన్ని మళ్ళీ చూపగలిగారు.

## శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి

మరికొందరి ముఖతః కవిత్వం గ్రామఫోనులోనుంచి వచ్చినట్లుగా ఆశుధారగా వస్తుంది. చికిలింతవలె ఇది చాలవరకు రుచిహీనం, సారహీనం. కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రులుగారు ఆశుకవిత్వవ్యామోహం లేని వారు. కాని వ్రాస్తూ, కొట్టివేస్తూ గుడ్డిబండి రీతిగా సాగదు వీరిరచన. వ్రాసింది కొట్టివేయరు. వ్రాయాలని యే వేళ కూర్చున్నా, వారిలేఖిని నిరాఘాటంగా సాగుతుంది.

## వడ్డాది సుబ్బారాయుడు

వడ్డాది సుబ్బారాయుడుగారుకూడా ఆశుకవిత్వమను బెబ్బులిని నిరసించినవారే. వీరు వ్రాసినదానికి చికిలిపనిచేస్తారు. ఓపిక చాలావుంది. ఉపమానాలు ఉచితంగాను, మనోహరంగాను వుంటవి. ఉచితోపమానాన్వేషణమున ఒక్కొకప్పుడు రాత్రి తొమ్మిది మొదలు తెల్లవారుఝామున మూడుగంటలవరకూ కూడ కూర్కులేకుండా కూచుని యోచించు ఓపిక, దానిని సేకరించగల ప్రజ్ఞ వీరికి లెస్సగా వుంది.

## వేదుల సత్యనారాయణశాస్త్రి

కష్టాలెంతయెక్కువగా వొత్తితే అంత రసవంతమైన కవిత్వం కలుగుతుంది వేదుల సత్యనారాయణశాస్త్రివద్ద—చెఱకు కత్తి నెంత బలముగ నొక్కితే అంత యెక్కువరసము వచ్చినట్లు. 'నిరుపహతిస్థలంబు, రమణీప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడెము, ఆత్మకింపయిన భోజనము, ఉయ్యేల మంచము' మొదలైనవి కావాలనే షరతులు ఈతనివద్ద మాయమైనవి. డొక్క మాడుతూంటే కటికచీకటిలో రత్నముల వంటి పద్యసంచయాన్ని వెలయించే యోగ్యత యితని సొమ్ము.

## రాయప్రోలు సుబ్బారావు

ఆదివరకు కోకిలపాటవలె హాయినించిన రాయప్రోలు సుబ్బారాయుని కవిత వుద్యోగంలో జేరిన తర్వాత మూకీభావం వహించింది.

## ప్రాచీనకవులు

ఈవిషయాల్లో ప్రాచీనకవులేలావుండేవారో సరిగా తెలియదు. నన్నయభట్టు భారతము నేతీరుగా రచించాడో యింకెన్నటికి తెలియదుగదా! తిక్కన భోజనానంతరం దీక్షావిధిగా కూర్చుని ఆశుధారగా పద్యాలు చెపుతూవుంటే గురవయ్య వ్రాసుకునేవాడట. ఆయనకు వ్రాయడం కొట్టివేయడంలేదు. ప్రమిదల్లో చమురంతా అయేవరకూ వ్రాసి 'యావత్తైలం తావద్వ్యాఖ్యా' అనడానికికూడా వీలులేదేమో. పిల్లలమఱ్ఱి పినవీరన్న తన జైమినిభారతమునంతా ఒక రాత్రిలో ముగించి 'వాణి నారాణి' అన్నాడని జనశ్రుతి. రామరాజభూషణుడు వసుచరిత్ర రచనాసమయమున భోజనాదికములనుకూడా మరచిపోయాడట. ఆకాలంలో కవుల లేఖినులు కృత్యాద్యంతమూ విశ్రాంతి యెఱిగివున్నట్టు కన్పింపదు. ఈనాటి శిరోభారాలు, వేళావేళలు (టైమ్సు) మనోవికారాలు (మూడ్సు) ఆనాటివారి కున్నట్లు గోచరింపదు. ఇంకా ముందువారి విషయం యేలా వుండబోతుందో!

# గుసగుసలు.

సమయము :

వెన్నెలరాత్రి.

స్థలము :

మైలాపూరునం దొక చక్కని భవనమునకు ముందరనున్న సుందరమగు వనములో, మధ్యభాగమున గుబురుగానున్న గులాబిచెట్టుయొక్క చిట్టచిటారుకొమ్మ్నయం దార బూసిన పుష్పమునందలి రేకుల మఱుగున.

ప్రవేశము :

రెండు తేనెటీగలు.

ఎల్లెడ నిశ్శబ్దము.—అప్పుడప్పుడు మాత్రము మందసమీరుని చక్కలిగింతల కులికి పడుచున్నవి, చిగురుటాకులు.

* * * *

కలువతేని ధవళకిరణములనుండి జాలువారుచున్న మంచుతుంపరలకు సహింప నేరక వెలుపలనుండి కుసుమములోని కొంకింత జరిగినది తేనెటీగ—అచ్చట వేరొకనిగాంచి ఆశ్చర్యముతో, 'ఎవరువారు ?' అని ప్రశ్నించినది.

రెండవ తేనెటీగ

నే నొకయభాగ్యుడను.

మొదటి తేనెటీగ

సకలపుష్పముల కాస్పదమగు పెక్కు వనములతో విరాజిల్లుచున్న చెన్నపురియం దు నివసించుచున్న నీవేల యభాగ్యుడవైతివి?

రెండవ తేనెటీగ

కాలవశమున నే నీపట్టణమునకు రావలసి వచ్చెను.

మొదటి తేనెటీగ

నీ వొకపల్లెటూరివాడవా యేమి! ఇచ్చట కెట్లు వచ్చితివి?

రెండవ తేనెటీగ

విద్యుద్దీపముల కాంతికిభ్రమసి, గృహమనితలచి రైలుపెట్టెలోదూరి, గడచిన రాత్రియంతయు ఆదీపముకడ ప్రదక్షిణములు చేసి, తెల్లవారుసరికి నా కెఱుక లేకయే నేనీ పట్టణము జేరితిని.

మొదటి తేనెటీగ

నీవు ధన్యుడవు.

రెండవ తేనెటీగ

ముమ్మాటికినిగాదు. ఇది నాపూర్వపాప ఫలమనక తప్పదు.

మొదటి తేనెటీగ

ఎందువలన?

రెండవ తేనెటీగ

ఓయి! నీకేమి తెలియగలదు? సర్వసౌభాగ్యముల కాకరమగు ప్రకృతిమాతయొడిలో కాలముగడపుట కిది తావుగాదు.

మొదటి తేనెటీగ

ఇచ్చట వనములు, కొలనులు గలవు.— తక్కువేమి?

రెండవ తేనెటీగ

ఇదియా నీ సుఖము? ఇచ్చట ప్రశాంతముగానున్న స్థలము లేనే లేదు. పైకెగురుచున్న తీగెలు. క్రింద విహరించెడమున్న, మోటారుల వికృతమగు కూతలు, ట్రాము కారుల దడదడలు.—

మొదటి తేనెటీగ

ఇదియు నొక కష్టమా!

రెండవ తేనెటీగ

కాకేమి? దురదృష్టవశమున నేనిచ్చటకు వచ్చిపడితిని; లేనిచో సర్వసౌఖ్యముల ననుభవించుచు మాపల్లెటూరిలో హాయిగానుండెడివాడను. ఇవి సంక్రాంతిపండుగదినములు.... తెల్లని కొత్తిమిరిచేలతో; పచ్చని చామంతి, బంతి, పూలతో పల్లెటూరు లిపుడు కనుల పండువుగనుండును............ చెట్లబోదెల నొరసికొని ప్రవహించుచున్న సెలయేటియలల కొనలయందుబడుచున్న చంద్రుని ధవళమయూఖముల చక్కదనము; చెట్లకొమ్మలనుండిగాలి, నీటబడుచున్న కుసుమముల చల్లని, చక్కని ధ్వని; మంచుముత్యముల హారములధరించి, పచ్చనిచీరదాల్చి మోదుగుపూవుల చెంగావి రెవికదొడగి కులుకు వసుంధరాదేవియొక్క సహజలావణ్యము; తలనిండ బంతిపూవులదురిమి, కనుల గజ్జలముదీర్చి, గళ్లకంచుకముదొడగి, కర్నాటకపుచీరదాల్చి, మిరపపొలముల కలుపుదీయుచున్న కాపుపడతుల బెడంగు; తేగపండ్లకై బడివదలినంతనె, పొలమునకేగి, గట్లకెగబ్రాకు పిల్లలకోలాహలము; ఎచ్చటనో ఆకులమఱుగునదాగియుండి, సువాసనల నీనుచున్న అడవిమల్లెగుత్తులను; చూడవలయును, వినవలయును, మూర్కొనవలయును. అప్పుడుగదా నా ప్రాణము నిలచునది. సఖుడా! పట్టణమునంతయు ఈరోజు పగటివేళగలయజూచితిని. నా యానందముతో, నీకెట్టి యనుభవము లేదని గ్రహించితిని ... ...ఆ పొదలమాటున ప్రశాంతమైన స్థలమునందు వికసించి, బోసినవ్వుల జిమ్ము కుసుమముపై నధివసించి, ఎచ్చటనో గానమొనరించుచున్న, కోకిలమధురగానసుధాస్రవంతిలో మునిగిపోవుచు, నిర్భయముగ బాడుకొనుచు పశువుల దోలుకొని పోవుచున్న బాలుని కోమలకంఠరవమునందుయ్యాలలూగుచు, చిదుకుల నేరికొనుచున్న కాపుకన్నెయొక్క అవ్యక్తగానఝురులయందుద్భవించు తరంగములనీడలయందు దోబూచులాడుచు, సర్వమునుమరచి, నిలచియున్న కుసుమమునందే రెక్కలు ముడుచుకొని గంటలకొలది నిద్రించుభాగ్యము నీకు లేదుగదా! ... ... .... ...బ్రతికి యున్నన్నిదినములు మకరందమును సమకూర్పవలసినదేనా? ఈ పరితాప మాజన్మాంతము మనకుండవలయునా? నారుబోసిన దేవుడు నీరుబోయడా? బ్రతుకంతయు స్వార్థమునకై వినియోగింపకతప్పదా?- - - - - మనమాట యటులుండనిమ్ము--విజ్ఞానులగు మానవులమాట మదిని విచారింపుము—నేడీపట్టణమునంతయు తిరుగుచున్నకాలమున నాకాశ్చర్యము కలిగినది- ఏమి యీ పరితాపము, ఒకరికడనున్న ధనమును వేరొకరు అపహరించుటకెన్నెన్ని వేషములు వేయుచున్నారు. నిద్ర లేచినది మొదలు, మరల రాత్రినిద్రబోవువరకు వీరికిదియే ఆలోచన గాబోలును! ఆహా! పైకి కనుపించురీతి వేరు, లోపల ఆలోచించువిధము వేరు! ఒక్కొక్క మానవునిలో ఇటు

వురుమానవుంబు గన్పట్టుచున్నారు! కష్టపడి, లోకమునకు, ఉచితమగురీతి సేవయొనర్ప నడుముగట్టినవారిని ప్రోత్సాహించువారెవరి? ఉన్నతోద్యోగమునకై ప్రబలప్రయత్నములు జేయుచున్న యొక మానవుడు నాకంటబడెను. ఆత డధికారుల నాశ్రయించుచున్నట్లొకత్రుటికాల మాపరాత్పరుని ఆశ్రయించినచో సద్గతిపొందుననుటలో నాశ్చర్యము లేదు....లోకోపకారమునకని యొక పత్రికను స్థాపించి, దానిలో తన పేటెంటు మందుల నన్నిటిని ప్రకటించి, లోకులచే వానినిగొనిపించి ధనము సంపాదింప నూహించుచున్నా డొకపత్రికాసంపాదకుడు. పత్రికలో మొదటి పది కాగితములు, తనమందుల ప్రకటనలె! ఇదియా వాఙ్మయాభివృద్ధికి, దేశకల్యాణమునకు, మానవాభ్యుదయమునకు తోడ్పడువిధము? కేటలాగుమూలమున లాభము కనుపించలేదా? తనమందులకొనుడని ప్రబోధించుటకా యీపత్రిక! ఎంతమోసము!... సఖుడా! వెరొకని గాంచితిని: రాబోవు శాసనసభకు తానొక సభ్యుడుగా నిలువగోరి, ప్రజలకెంతయో సహాయముజేయు వానివలె, ఒక వెఱ్ఱికలవరమును వారిలో గల్గించి, తానొక నాయకునిరీతి ముందడుగు వేయుచున్నాడు. నిలుకడలేని యాదర్శములతో, ఆతడు సాధించినదేది? పత్రికలలో పెద్ద యక్షరములతో తనపేరు ప్రకటించుకొనుటయేనా? లోని యాలోచన నెరిగి, వాని యడ్డుగులవిడచి సంచరించునంతటి ధీశక్తి పరాత్పరు డేల జనసామాన్యమునకు గల్గింపడు? వాఙ్మయముపై ఆదరము గన్పట్టుటలేదు; గుఱ్ఱపుపందెములతో, లండను ప్రయాణములతో, బొజ్జలు పెంచుకొని కాలముగడుపుచున్నారు స్వదేశసంస్థానాధిపతులు. ఏ, విశ్వదాతవంటి మహనీయు లొకింత వాఙ్మయాభివృద్ధికి తోడ్పడుచున్నను, తగులాభము, వెంటనే గలుగుట కష్టముగాదా? ఇట్టివారల నెందరనో దేశము ప్రసవింపవలసియున్నది. అప్పుడు, సర్వతోముఖమగు అభివృద్ధి మానవజాతికి కలుగగలదు. తాలూకాబోర్డు (నెంబరు) పదవి వచ్చినంతనె, వైస్రాయిగారి ఎగ్జిక్యూటివుసభ్యునికన్న మిన్నయని విఱ్ఱవీగు వెఱ్ఱివారెందరో నాకంటబడిరి. దేశకల్యాణమునకు తృణకణమంతయేని వీరు సాయపడుచున్నారా? విశ్వాసరాహిత్యతీర్మానముల ప్రతిపాదించుటయందున్న తెలివి వీరికి విశ్వమానవసౌభ్రాతృత్వముపట్ల కానరాదు. మీటింగులో చేతులెత్తి, తమవలన నెగ్గిన తీర్మానము అమలులోనికి వచ్చినపుడు గ్రుడ్లుమిటకరించు మేటి వీరు లెందరోగలరు. నాయనా! నే నిచ్చట నిలువలేను. ఈర్ష్య, ఆశ, దురభిమానము, అశక్తదుర్జనత్వము అనువానికి ఆకర మీప్రదేశము. ఆనందము వెల్లివిరయ, ఆకులమఱుగున సంచరించుటకు నన్ను వెడలిపోనిమ్ము, నాపల్లెకు దారిజూపింపుము ...నీకు నమస్కారములు.

మొదటి తేనెటీగ

నీవు నన్నాలోచనాసంద్రమున ముంచివైచితివి. మీప్రాంతములందలి ప్రజ లింతటి స్వార్థమునకు బాల్పడరా?

రెండవ తేనెటీగ

నాయనా! నాకు దుఃఖముకలుగుచున్నది. పొగమంచువలె, అధికారమునందలి యాపేక్ష ప్రశాంతమగు స్థలములనుగూడ ఆక్రమించుచున్నది. తాలూకాబోర్డులు తీసివేయబడి, ప్రతిగ్రామమున నొకపంచాయతీ బోర్డు ఏర్పరుపబడునట. ప్రతిపల్లెయందిప్పటినుండి 'ఎన్నికలు', 'ఓట్లు', 'కాన్వాసు', అను శబ్దములు మారుమ్రోగునట. ప్రతి గ్రామమున కక్షలేర్పడకపోవు, తలలు బ్రద్ద

లుకాకపోవు; ఐకమత్యముతో హాయిగా గడుపుకొనుచున్న దినములు నశించును. అధికారమునకై ద్రవ్యము వెచ్చింపబడును, కుట్రలు ప్రారంభింపబడును, ఆలోచనలు హెచ్చుపెరుగును, మధ్య తిరుగువారు బాగు పడుటకు మంచి రోజులు. ధనికులగునట్టియు, గుట్టుగా కాపురము కడుపుకొనుచున్న రైతులు అధికారవ్యామోహమున, అంతులేని చింతలకు బాలుగానున్నారు. ఆహా! కాల వైపరీత్యము.

మొదటి తేనెటీగ

ఎందులకంతభయము? అధికారమునకై పెనుగులాడువారే కష్టముల పాలగుదురు. తగ్గినవారు కడిగిన ముత్యములవలెనే యుందురు. ఈ పట్టణమునందు మాత్రము, ప్రశాంతముగ జీవితము గడుపుకొనుచున్న వారు లేరా!

రెండవ తేనెటీగ

ఆలోచించినకొలది మనకు దుఃఖమే గాని, శాంతి కలుగదు ...పుష్పోడిదుమారములందు విహరించుచు, రాత్రులందు చిగురుటాకు మడతలయందు మేనువాల్చి, కాలమునుగడుపుకొను మన కీయాలోచనలెందుకు? ఆర్తరక్షణపరాయణుడగు పరాత్పరునియందు దాకింత నమ్మకముంచి, కలియో గంజియో త్రాగుచు, పరుల పలుకుల కులికపడక, హాయిగా కాలముగడుపుకొనవచ్చును. నాతో మాప్రాంతముల కరుదెమ్ము, ఇవి సంక్రాంతిదినములు. అల్లుని గొనిపోవుటకు వచ్చిన మామవలెనే నిచ్చటకు వచ్చితినను కొనుము.—తియ్యని తేనె నొసగు పుష్పములెన్నియో గలవు, అవి యిప్పుడు వికసించియుండును. పట్టణమునందున్న నీకచ్చటయానందమును గూర్చు దృశ్యములు లేవని భయపడవలదు ...విద్యుద్దీపముల కాంతిని, బల్లలపై సరిగా కడుగని, ఎంగిలి పళ్ళెములలో నేదియోతిని, తుదిని బిల్లుగాంచి, హృదయము ఝల్లుమనగ, బిక్కమొగము వైచి డబ్బు చెల్లించిపోవు సగము మీసముల చక్కనయ్యల కన్న, చెట్టునీడలో, చిదుగులుపేర్చి, మంటజేసి లేత మొక్కజొన్న కంకులనుగాల్చి భక్షించి యానందించు అమాయకపుకాపుజనులు నీకానందమును గూర్తురు. పండ్లు పోసుకొనుటకు సింగారించుకొనిన బాల బాలికలు- గుమ్మముకడ వింత ముగ్గుల పచరించుచున్న యువతులు- చలిమంటలకడ కథలనువినుచు, చేతులను మెల్లగా మంటపైకి జాపి, వెంటనే దీసి కనులకద్దుకొని, చలిపోయినదని సంతసించు బాలురను- క్రొత్తబట్టలయంచులకు బసుపుబూసి పళ్ళెములో బెట్టి అల్లుండ్ర కర్పించు మామల మందహాసములు నీకానందమును జేకూర్చును. నాకు దారి జూపింపుము, వెడలిపోవుదము.

మొదటి తేనెటీగ

అట్లే చేయుదుము. డబులు సెకండు క్లాసు బేటావచ్చినను, మూడవక్లాసుబండిలో ప్రయాణముచేయుచు, తెలిసినవారెవరైన చూచెదరని, మనుష్యులను చాటుజేసికొను, ఎం. ఎల్. సీ, ల వలెగాక, మనము నిర్భయముగ స్టేషనుకేగి ఒక చక్కనిరైలు పెట్టెలో దూరి, ప్రయాణముచేయుదము. బయలువెడలుదము రమ్ము.

రెండవ తేనెటీగ

అదిగో తెల్లవారినది, అట్లేకానిమ్ము.

(నిష్క్రమించును.)

—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు, బి. ఏ.

# గళ్ళ చీర

‘ మాంచి చీరలంటే పాపం పిల్లకు ఉబలాటమే. ’

‘ చీరకొంగు రెండు చేతులా పట్టుకుని తలవంచి.’

‘ ఆమెకట్టుకున్న చీరమీదిగళ్లు పెద్దపులి మచ్చల్లాగా.’

‘ గళ్ళచీరలు సింగారించుకోటంతోనే కాలచక్రం తిరిగిపోతున్నది.’

‘ అందులో మాలీలకు సామాన్యపు చీరలు పనికిరావు.’

‘ అదేమిటి చీరమీదకూడా పోసుకున్నావు కాఫీ.’

‘ వాటికయ్యే ఖర్చు చీరలకు పెట్టుదువుగాని.’

‘ నీవే గెలిస్తే నేనేమన్నా చీరముడుపు చెల్లించుకోవాలా ?’

‘ బయటకువచ్చిచూస్తే అత నొక చీరల వర్తకుడు.’

‘ కట్టుకున్నచీర చూచుకుంటూ ‘ఇదే చీర’ అన్నది ’

‘ ఇకనుంచి నాకు నేనెన్నడూ చీరలు కొనను.’

నాకు సిగరెట్టు అలవాటైన వేళావిశేషమేమో కాని అది నన్ను వదలకుండా వచ్చింది. వదలేద్దామన్న అభిప్రాయం నాకేకోశానా లేదులెండి. పూర్తిగా దమ్ముపీల్చి షోకుగా పెదవులచివరనుంచి పొగ వదలి వేయడమంటే నాకు చాలాసరదా. కాని నాభార్యకు మాత్రం కొద్దిగా కొఱ్ఱుగా వున్నాది. “మీరు సిగరెట్టు కాలవకపోతే మనకు మామూలు ఆఫీసు గుమాస్తా కిచ్చే జీత మాదాకాగలదు; నాకు నెలకొకటి మంచి చీర అమరుతుంది” అంటూంటుంది అప్పుడప్పుడు. మాంచిచీరలంటే పాపం పిల్లకు ఉబలాటమే. దీనికి తోడు సొమ్ములమీదకూడా అపేక్షవుంటే చచ్చిపోయేవాణ్ణి. అదిలేదు. ఒడలునిండా బంగారం దిగవేసుకుని ఒక కోమటిపిల్లలాగా తయారగుదామన్న ఉద్దేశమామెకు లేదు. పచ్చినాగరీకం. అయితేఅయింది. అందుకోసం నేను సిగరెట్టుకాల్చడం మానేయాలట !

ఆనాడు పొద్దున్నే స్నానం, గీనం చేసుకుని మేజా ముందున్న కుర్చీలో వ్రాలి షేక్స్పియర్ మహాకవి వ్రాసిన నాటకం హేంలెట్ చదువుకుంటున్నాను. ఊరికే కులాసాగా కాలంగడిపేటందుకు కాదు; పరీక్షలు నడ్డిమీద తంతున్నాయి వెనకనుంచి. సరిగ్గా నెలరోజులున్నాయో, లేదో. ఈవరకు మూడుసార్లు తప్పివున్నాను. అయితేఏం ? తప్పిన తప్పుమాత్రం నా మీద లేకుండాపోయింది. “పెళ్ళైంది. తప్పుతున్నాడు పాప” మనేవారంతా. అపరాధమంతా ఇంతవరకూ నా భార్యే మోస్తున్నది. ఈతఫాఅన్నా ప్యాసై బి. ఏ. డిగ్రీ తెచ్చుకోకపోతే ఆమెకు బరువెక్కువయ్యేలాగున్నది.

ఐదునిమిషాలు బుర్రవంచి జాగ్రత్తగా చదివేను చూపుడు, బొటనవ్రేళ్ళతో పట్టుకున్న పెనసలుకొసతో క్రాపింగు పాపట తీసికుంటూ. ఇంతలో అకస్మాత్తుగా సిగరెట్టు జ్ఞాపకంవచ్చింది. ఈరోజు పక్కమీదనుంచి లేచిన లగాయతు అగ్నిహోత్రం వెలిగించలేదు. అలమారలోవున్న సిగరెట్ పేకట్టు తెచ్చుకుందామని కుర్చీలోనుంచి లేచాను. కుర్చీవెనుక ఎంతసేపటినుంచీ అలా నిల్చివున్నదో లీల చిరునవ్వునవ్వుతున్నది. నేనలాగే చూస్తూ నిలబడిపోయాను “ఏమిటి? అలాచూస్తారు? భయపడ్డారుకాబోలు వీపు చరవనా ?”

“నిజంగాచూస్తే భయంగొలిపేవేషంమీదే వచ్చావుకాని, నేను దడుచుకోలేదు. నవ్వుకుంటున్నాను.”

ఒక్కసారి లీల తన్నుతాను సింహావలోకనం చేసి

కొన్నది. చీరకొంగు రెండుచేతులా పట్టుకుని తలవంచి చూచుకుంటున్నది.

ఆమె కట్టుకున్న చీరమీద గళ్లు పెద్దపులి పచ్చళ్లాగా వున్నవి. అందుచేతే మొదలు నేను కొంచెము భయపడవలసి వచ్చింది. చీరలు వర్ణించడం నాకు చేత గాదుగాని నాకాచీర బాగుండలేదనిమాత్రం చెప్ప గలను. 'ఛీ, బాగులేదు చీర' అని ముఖాన అనేసి లీలను వుడికిద్దామనుకున్నానుగాని ఆమాట చదువుకునే ప్రాప్తి వుండదు. ఆమె చేసిన పని ఏదైనా—కూరలలో ఉప్పు చాల్లేదనిగాని, అన్నం మెత్తపడిందనిగానీ, అంటే ఆమెకు ఎక్కడలేని కోపంవస్తుంది. ఆమీద ఉపన్యాస మనే జడివాన ఒకటి నేను ఎదుర్కోవాలిసివుంటుంది. జంతువులవలె మూగచేష్టలతోనే భావప్రకటనచేసికో వలసిన దశపోయి మానవుడు భాష కల్పించినప్పుడు నాగరికప్రపంచమున చాలదూరము నడచినాడు. అందు వివేచనాజ్ఞానము తెచ్చినప్పుడు పై మెట్టెక్కి నాడు. ఈ ద్వితీయదశకుమాత్ర మింకను స్త్రీ రాలే కున్నది.

మేజామీద ఓరగా కూర్చోటానికి ప్రయత్నిస్తూ అన్నాను: "నేను పరధ్యానంలో వున్నప్పుడల్లా వెనుక నుంచివచ్చి కళ్ళుమూసేదానివి ఇదేమి టిప్పుడు కిక్కురు మనకుండా వెనుకనిల్చున్నావు దొంగలాగా."

"ఔను. దొంగను గనుకనే" అని ఒక కరుకు జవాబు.

"నా కోటు జేబులో అయిదురూపాయిల నోటు మాయమయిందావేం?" లీల నవ్వుతున్నది.

"అది చీరలుకొంటానికి కాదు ఉంచాను"

"మరి సిగరెట్ కొట్టువాడికివ్వాలనా ?"

"అన్నట్లు జ్ఞాపకంచేశావు. అలమారులో సిగ రెట్ పాకెట్టువున్నాది తెచ్చిపెట్టు."

"మీ రివ్వాళ కాఫీమానేటే అనుకోలేదే ఇంత ప్రొద్దెక్కినాను ?"

"నీవుచేసిన శిక్షకదూ ! కళ్ళచీరలు సింగారించుకో టంతోనే కాలచక్రం తిరిగిపోతున్నది."

"కాచే వుంచాను. మీరేమీ మాట్లాడకపోతే ఈ రోజునుంచి కాఫీమానేస్తారేమో అనుకున్నాను."

"ఓహో. ఇన్నాళ్ళూ సిగరెట్ మానమనీ, ఇప్పుడు కాఫీమానమనీనా. బాగుంది ! నీకేం, రేపు అన్నంకూడా మానేయమంటావు. తనముడ్డికాక పోతే కాశీదాకా దేకేయమన్నాట్ట ఒక ప్రజ్ఞావంతుడు."

నవ్వుకుంటూ కాఫీపట్టుకరాబోయింది లీల. నేను అలమారవైపు నడచేను. అక్కడ తగిలించివున్న కోటు జేబులు వెతికేను ముందర అయిదురూపాయల నోటు వున్నదో మాయమైందో అని. పాపం దాని ఆయుష్యం బాగున్నది కాబోలు: ఇంకా దాని కళ్ళుపడ లేదు. పడితే ఏచీరలమ్మేవాడి దగ్గరకో పోయేదే. నే నేనున్నా, అంటూనేమోనన్న భయం లేకపోతే లేక పోయింది, వెనుకాముందు ఆలోచనకూడాలేదు లీలకు. పైసా కనుపిస్తే బ్రతుకనీదు. పూర్వార్జితం పూర్తిగా వున్నందున బ్రతికిపోతున్నానుకాని, మామూలుపాటి వాడినే అయితే, మూడోనాటికల్లా చిప్పా కర్రా చేతికివచ్చేవే. సాయిబయ్యా సంపాదనంతా బూబు చెవి పోగులకన్నట్లు, వచ్చే ఆదాయమంతా భార్య చీరలకు ఖర్చుచేస్తుంటే, మరేమిటి ? అందులో మాలీలకు సామాన్యపు చీరలు పనికిరావు. విలువగల పట్టువి పెట్టెలో చాలా వున్నవే అనిలేదు. అధికస్య అధికంఫలం.

సరే, నాభార్యను గురించి చెప్పదలస్తే చాలా వున్నది. ఆమెకు కోపంవస్తుందేమో మానేస్తాను. ఈ రోజుల్లో భార్యకు కోపంవస్తే మగవాడికి చలిపుట్టు తుంది; గజగజ వణకిపోతాడు.

అలమార తెరచిచూస్తే సిగరెట్ పెట్టె లేదక్కడ. ఇంకేం, దాచేసిందన్నమాట. "ఔను దొంగను గనుకనే" అన్నమాట కిదేఅర్థం. పొడుముకాయ తీసి దాస్తే తాతకు కోపంవచ్చినట్లు నేను మండి పడతాననుకున్నది కాబోలు. నిన్న తన ఊలు తీసికొని గంటసేపు ఏడిపించినందు కిది ప్రతీకారం. తానంటే అల్లుకున్న జడకొస పట్టుకుని ఊలు కోసరం నన్నే ప్రార్థించవలసి వచ్చింది. నాకేం ! బజారువెళ్ళి కొనుక్కుంటాను ; పీల్చేస్తాను.

ఏ మెరుగనట్లుగా కుర్చీలో వచ్చి కూర్చున్నాను మళ్ళీ. కుర్చీ చేయిమీద ఓరగా కూర్చొని, నా సాసర్‌లో కాఫీపోస్తున్నది లీల. నాకు చిలిపిచేష్టలంటే కాస్త సరదా చెప్పద్దూ; సాసర్ కొంచె మొకప్రక్కకు వంచి, కొంతకాఫీ ఆమె చీరమీద పడేలాగా చేశాను. చీరమీద ఆస్ట్రేలియా పటములాగా మరకపడింది. నేనే పాపమూ తెలియని వాడనువలె అవతలవైపు కిటికీలోనుంచి చూస్తూ "మన జామచెట్టు ఈ సంవత్సరం కాయలు బాగా కాసినవి సుమా!" అన్నాను.

"ఔను కళ్ళకూ కాసినవి కాయలు. ఏమీ కనుపించదు" అన్నది లీల కోపంలో. ఎఱ్ఱనెండ కాస్తున్న దామె కటాక్షవీక్షణాల్లో. కండనిప్పులుచిమ్మే పడమటికొండగాలి వీస్తున్న దామె నిట్టూర్పులో.



లీలకు కోపంవచ్చినప్పుడు నాకదో ముద్దుగావుంటుంది. ఆమె సౌందర్యమంతా నేనప్పుడే గ్రహింపగలుగుతాను. ఆ భ్రూకుటినటనా, అధరచలనమూ, ఆ కంటిచూపూ నన్ను ముగ్ధుణ్ణి చేసివేయగలవు. ఆమె నన్ను తదేకదృష్టితో చూస్తున్నది. నేనామెను చూచీ చూడకుండా తత్సౌందర్యమంతా త్రావేస్తున్నాను ఇవతల గుమ్మమువద్దకువచ్చి నిల్చొని.

చివరకు పెరటిలో ఏవో మొక్కలు నాటుతూన్న మానౌకరువెధవను పిల్చి, 'సిగరెట్టుపెట్టె ఓటి తీసికొనిరారా' అని చిల్లరడబ్బులిచ్చి పంపించాను. లీల కుర్చీచేయిమీదనుంచి లేచి ఏమో అస్పష్టముగా గొణుగుకుంటూ చీరమీద కాఫీతుడిచేసికుంటున్నది. నేనన్నాను "అదేమిటి చీరమీదకూడా పోసేసుకున్నావు కాఫీ. అయినా, అదుగక చంద్రుడికి కళంకం

బాగా చీరకు వన్నె తెస్తున్నాదిటే."

'చాల్లెండి కవిత్వం' అని చురచురా లోనికి పోయింది—వంటచెయ్యాలిగా.

*        *        *

భోజనంచేసి కూర్చున్నాను మాగదిలో క్రింద చాప మీద పరచివున్న పరుపుమీద. ప్రొద్దునవగా సిగరెట్లు కొనితెమ్మని నేనుపంపిన కుఱ్ఱవాడింతవరకూ రాలేదు. ఇక నేనన్నాపోయి కొనితెచ్చుకోవాలి. ఆరోజున ఎండ అతితీవ్రంగాకాస్తున్నదిబైట. ఎలాగాఅని ఆలోచిస్తున్నా. భోజనాంతరం సిగరెట్ పీల్చకపోతే హాయిగా వుండదు.

"ఇంతవరకూ ఎందుకు రాలేదబ్బావాడు. నేనిచ్చిన చిల్లరడబ్బులు నాలుగూ తన స్వంతఖర్చుల కుపయోగ పరుచుకోలేదుగదా! ఇంట్లోభార్యకు మల్లేనే నౌకరు కుంకకూడా అల్లాంటివాడేఐతే ఇకచెప్పాలి! కాని వా డల్లాంటివాడుకాడు. ఇన్నాళ్ళనుంచీ చాలా నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఆనక వచ్చినప్పుడు నాలుగు చీవాట్లు తగిలిస్తాను. ప్రస్తుతం మా ఆవిడదగ్గరనుంచే లాగాలి ఎలాగైనా తాను దాచినపేకట్టు"—ఇదీ నాలో రేగిన ఆలోచనాపరంపర.

కిటికీలోనుంచి వస్తున్న వెచ్చనిగాలికి గోడకు తగిలించివున్న 'క్యాలెండరు' కాగితాలు అల్లరిచేస్తున్నవి. ఏవో రెండుసాలీళ్ళు అక్కడ 'ఫొటో' చాటుకు పోయినై. అంతా నిశ్శబ్దంగా వున్నది; కాని లీల భోజనంకూడా అయిందికాబోలు, అన్నీ సర్దుతున్నదేమో, చెంబూ తప్పేలల చప్పుడుమాత్రం వినబడుతున్నది.

చేతులు తుడుచుకుంటూ వచ్చి కూర్చున్నది నా దగ్గిరే. ప్రొద్దుటికోపమంతా ఈలోపుగానే పోయిందిగా! భార్యాభర్తలకోపం ఎంతసేపుంటుంది!

ఆమె తమలపాకులు మడుపులు చుట్టిఇస్తుంటే నములుతున్నాను చాలనకుండా. నేను నములుతున్న కొద్దీ ఆమె ఇస్తూనేవున్నది. చివరకు విసుగెత్తి అన్నది "ఈ కట్టాకులూ మీరే నమలేలాగున్నారే!" అని.

"పోనీ, మానేయమంటే తమలపాకులు వేసుకొనడం మానేస్తానులే. వాటికయ్యే ఖర్చు చీరలకు పెట్టుదువుగాని"

"అబ్బ! చమత్కారం! ఏం మానక్కరలేదులెండి!"

"ఏమి, ఎందుకని? అవిలేకుంటే నీకు సాగదు కనుకనా? అల్లాగే అనుకోరాదూ ఇతరుల సంగతి కూడా. పో, తీసుకొనిరా నీవు దాచిన సిగరెట్ ప్యాకెట్."

"ఔనుకానండీ! నిన్న మీరుతెచ్చిన సైకిలెక్కడిది?"

"ఒక స్నేహితుడిది. ఎందుకు నీకు?"

"మరేమీలేదు. మీరు తొక్కడం వచ్చికూడా సైకిల్ లేకపోవడము"—

"మర్యాదహీనంగా వున్నదా? నీవు చీరలుకొనడం మానేస్తే, ఎప్పుడో వీలుచూచుకుని ఒకటి కొనుక్కుంటాను మరి!"

"అదికాదు. వచ్చే సంక్రాంతిపండక్కు మా నాన్నతో చెప్పి మీకు సైకిలిప్పిస్తాను. లేకపోతే దానికిమ్మత్తైనాసరే. అది మీరీఆటలో గెలిస్తేనే" అంటూ అక్కడ ముక్కాలిపీటమీదవున్న చతురంగపుబల్లా, కాయలభరిణా అందుకున్నది.

"నీవే గెలిస్తే నే నేమన్నా చీరముడుపు చెల్లించుకోవాలా?"

"పందేనికి పందెం లేకపోతే ఎలా?"

నాకు చతురంగపాట అంటే సరదా. ఆ ఆట ఆడుతున్నప్పుడు నాకు బాహ్యస్మృతి వుండదు. నిజంగా తన్మయుణ్ణైపోతాను. కాని మాలీలతో ఆడుతున్నప్పుడల్లా ఓడిపోతునే వుంటాను. ఆమె అద్భుతమైన తెలివితేటలు చూపిస్తుంది ఎత్తులువేయడంలో. 'పూర్వం రణరంగంలో చతురంగబలాలు నడిపిన వీరవనితల రక్తం నీలోకూడా కొంత ప్రవహిస్తున్నది, లీలా!" అని నవ్వుతూ అంటుంటాను అప్పుడప్పుడు. "ఆ తేజస్సు తగ్గిపోవడానికి మగవాళ్ళు మీరేకదా కారణం" అంటూంటుంది తాను.

అలాగా పందెం చరచి ఆటమొదలెట్టేము. ఎలాగైనా సైకిల్ కొట్టాలని తీవ్రంగా బుద్ధివంచి ఆడుతున్నాను. సిగరెట్టు మరచిపోయాను చెప్పద్దూ. మూడుగంటలాడే మావిధంగా. సిగరెట్ మీద మాత్రం ధ్యాసపోలేదంటే నమ్మండి. అబద్ధం చెప్పటానికి నాకు మించిపోయిందేమీలేదు.

ఆట మొదలెట్టినప్పుడు ఆమె పొడుగాటిజడ కుడి భుజముమీదుగాజారి బల్లమీదపడింది. నారాజు అదరి బోర్లపడ్డాడు. "మొదలే అపశకునము. మీరు ఓడిపోవడమే నిజ"మన్నది లీల. చివరకామె అన్నట్లే అయింది. నేనే ఓడిపోయానని చెప్పుకోవడం సిగ్గుగానేవున్నది. లీలతో ఆడి ఓడటమిది ప్రథమంకాదు గనుక అభిమానపడలేదు. ఎప్పటిమాదిరి నవ్వుతూనే ఉన్నాను.

"ఇంకనూ మీకు సైకిల్ప్రాప్తి లేనట్లున్నది" అన్నది లీల నాచూపుల్లో ఆమె చూపులు మిళితంచేస్తూ.

"అయితే, సంక్రాంతికి పుట్టింటికిపోయే ప్రాప్తి నీకు లేదన్నమాట" అన్నాను పెదవులమీద ఒక గమత్తు నవ్వు వెలిగిస్తూ.

ఇంతట్లో బైట 'అయ్యా' అని ఎవరిదో పిలుపు. బయటకువచ్చిచూస్తే అత నొకచీరలవర్తకుడు.

"సరిగ్గా సమయానికి వచ్చాడులెండి" అంటున్నది లీల నావెనకాల నిల్చుని. వర్తకుడు "అయ్యా! నిన్న సాయంకాలం, అమ్మగారొకచీర తీసికొన్నారు; అప్పుడు మీరింట్లో లేనందున మళ్ళీరమ్మన్నారు. ఇప్పుడు వచ్చా" నన్నాడు.

వెనక్కుతిరిగి మా ఆవిడవైపు చూచాను. కొంటెతనమంతా వ్యక్తీభూతమౌతున్న దామె ముఖంలో. నన్ను తృణీకరిస్తున్నట్లు నవ్వుతూన్న తన పెదవుల మీద చీరకొంగు అడ్డంపెట్టుకుని నాముఖంచూడలేకనో ఏమో చూపులు త్రిప్పుకుని, ముఖంవంచి కట్టుకున్న చీర చూచుకుంటూ "ఇదే చీర" అన్నది.

అదేనేను ప్రొద్దున కాఫీపోసిన గళ్ళది. నిన్న తాను కొని ఇవ్వాళ నాచేత డబ్బులిప్పిస్తున్నది. ఇదొక క్రొత్త యెత్తు. ఇదివరకల్లా ఎక్కడన్నా పైకముంటే తానే తీసికొని నాకు చెప్పకుండా చీరలు కొనుక్కొనేది. అలాకాకుండా ఇదొకవిధంగా నాచేతనే కొనిపించడం. నాకు మండిపోయింది ఒళ్ళు. ఆమెదృష్టిలో నేనొక విలువలేనిపొడనైనానుగదా అనే భావమొకటి నన్ను కలవరపెట్టింది. అప్పటి నావుద్రేకమంతా చెప్పలేనుగాని నాముఖఫలకంలో ప్రతిఫలించింది. అది గ్రహించలేకపోలేదు లీల.

నేనేమీ మాట్లాడలేదు. వర్తకుడికి డబ్బిచ్చి పంపక తప్పదు. వాడడిగినంతా ఇచ్చాను. ఒకసారి కట్టుకున్నది, కాఫీమరక పడ్డది, మళ్ళీ వాడికి వాపసుచేయడమెలాగా? అలాచేస్తానసేకాబోలు మొదలే జాగ్రత్తపడింది లీల.

వర్తకుడు వెళ్ళిపోయినతరువాత నాస్నేహితుడొకడువస్తే వాడితో కొన్ని అవసరకార్యాలనుగూర్చి మాట్లాడుతూ డాబామీద కూర్చున్నాం. చివరకతను వెళ్ళిపోయేటప్పటికి తాలూకాకచ్చేరిలో కొట్టినగంటలు అయిదు వినుపించినవి.

డాబామీదనుంచి తిన్నగా మెట్లుదిగివస్తూ ఆనాడు చదువేమీ సాగలేదుకదా అని ఆలోచించుకున్నాను. ఒక్కసారినాటిచర్య అంతా మనస్సులో పరువెత్తింది. చతురంగపాట మూలాన్న, నాస్నేహితుడు వచ్చినందున, అంతవరకూ అణగివున్న సిగరెట్ మీది కాంక్ష — కుతి అంటే బాగుంటుందేమో — తలెత్తింది.

మెట్లుదిగి దక్షిణపువైపుగది గుమ్మందాకా వచ్చాను — అది మనోహరసంవర్ధనము, సౌందర్యదేవతా ప్రత్యక్షము. హాలులో పెరటివైపు కిటికీముందు అద్దం చూసుకుంటూ జడలో పూవులుపెట్టుకుంటున్నది లీల.

నన్ను చూడగానే నావైపునడచివస్తూ, "ఇందాక మీకు కోపంవచ్చినట్లున్నది. మీ మనస్సు నొప్పించిన దానైతే క్షమించండి. ఇకనుంచి నాకు నేకొన్నడూ చీరలుకొనను. మీరుకొన్నవే పుచ్చుకుంటాను. క్షమించారా" అన్నది నాముఖభావాలు పరీక్షిస్తూ. నేను ప్రసన్నత్వమే కనబరచేను.

ఇక్కడ నాభార్యలోవున్న ఉత్తమగుణం ఓటి చూపిస్తాను. నాకు కోపంవచ్చినప్పుడెప్పుడూ ఆమె కూడా కోపంతెచ్చుకుని రసాభాసంచేయదు. తానే కొంచెంతగ్గి అనునయవాక్యాలుపల్కటం ఆమెకు అభిమానకరముకాదు. అందుకనే నాజీవిత మొక నందనవనం. అందులో నాలీల సౌందర్యకుసుమం.

నిమిషమాత్రం మేమిద్దరమూ మాట్లాడలేదు. అప్పుడే మాయిద్దరి ఆత్మలూ, ఒకటినొకటి మన్నించుకున్నవి.

చివరకు లీల తనవ్రేళ్ళతో నాగుండీలు త్రిప్పుతూ, 'ఇవ్వాళ సినిమాకు తీసికొనివెళ్ళరూ!'' అంది.

''నన్నుమాత్రం ఈరోజల్లా సిగరెట్టు త్రాగనిచ్చేవు కావుకదా లీలా'' అన్నా ఆమెబుగ్గ మెల్లిగాతట్టుతూ. ''ఐతే ఉండండి.'' అంటూ లోనికిపోయి రెండు సిగరెట్ ప్యాకెట్లతో ప్రత్యక్షమైంది. నే నాశ్చర్యపోయాను. ''అలా చూస్తారేం. రెండోదెక్కడిదనా? నౌకరువాడిని తెమ్మన్నారుకదూ ఒకటి. అదే ఇది. ఇది ప్రొద్దున నేను దాచింది.''

''నువ్వేలాగు తీసికున్నావు వాడిదగ్గరనుంచి?''

''వాడు ప్యాకెట్ తీసికొని వీధిగుమ్మందాకా రాగానే. నేనందుకుని ఇవ్వాళల్లా మనింటిచాయలకే రావద్దని చెప్పిపంపేను.''

''నీ కిల్లాంటి తెలివితేటలున్నందుచేతనే లీలా నే నానందమయుణ్ణి—మరి వంటచేశావా; సినీమాకు మొదటిఆటకే పోదాం పోతే.''

''వంటెంతసేపు నిముషం. మీరుకూడా రండి కూర్చుందురుగ్గాని'' అంటూ కుర్చీతీసికెళ్ళి వంటింట్లో వేసింది.

కుర్చీలోకూర్చొని సిగరెట్లు పీల్చడం మొదలెట్టేను, మా ఆవిడ కుంపటిరాజేస్తుంటే. ప్రొద్దుటి నుంచీ లేనందున సిగరెట్లు చాల రుచిగావున్నాయి. ఒకదానికోసం మొదటకొంత ఆర్తి అనుభవిస్తేనేగాని తరువాత తదనుభవ మానందమయంగా వుండదు.

ఆరాత్రి సినిమాకు వెళ్ళేము. అందుమూలాన్న రాత్రి కూడా చదువులేదు. తక్కిన విద్యార్థులంతా అన్నం నీళ్ళు మానేసి రాత్రింబవళ్ళు ఒకటే చదువు చదువుతూంటే నేను నాలీలతో కులాసాగా కాలక్షేపం చేస్తున్నాను. పాఠకుడా! విన్నావుగా నా ఆరోజు చర్య అంతా. అదేవిధం అనుకో ప్రతిరోజూను. ఇకనే నెలా ప్యాసౌతానో ఊహించుకుంటూ నువ్వే.

—పురాణం కుమారరాఘవశాస్త్రి, బి. ఏ.

# తెలుఁగుసీమ

తెలుగుజనాళి శౌర్యమును తేజము భేజములందె నెప్డు? మా
తెలుగులకత్తిరాపిడి పదే నశియించి రరాతు లెందరో
తెలుగుల భాగ్యరేఖ లవి దిద్దిరి ముత్తెపుటచ్చరాల; మా
తెలుగుపతాక మెప్పుడొకొ దీధితి వెల్గిన దంబరస్థలిన్?

తెలుగుల పల్కుతల్లి చిఱుతేనియ బిందుల చిందెనెప్డు? మా
తెలుగుపురంధ్రి తానెపుడు తీరిచికట్టె పసిండికోకలన్?
తెలుగుపొలాల సస్యసుదతీమణి తాండవమాడె నెన్నడీ
తెలుగులు ఆలమందలిడు తీయనిక్షీరము గ్రోలినారలో?

తెలుగువనేందిరారమణి తీవలు పూలు నలంకరించి, తా
మెలకువ సంచరించె వనమే యొకస్వర్గముగాగ నెన్నడో

క్కొ లలితసౌరభంబు గనుగొండని వీచెను తెల్గుగాలి ; మా
తెలుగుకుమారికామణులు తీరిక నాడిరి బొమ్మపెండిళుల్ ?

శిల్పకళావిలాసములు, చిత్రకలాకలనంబు ; వైభవా
నల్పదరాప్రతాపములు, నాట్యకళల్ రమణీయకావ్య సం
కల్పన ముల్లసన్మధురగానవిధానము లిన్ని కట్ట! ఏ
కల్పమొ నాటిమాట లటు కన్పడవిప్పుడు తెన్గుసీమలో.

రకరకమ్మై వినూత్నమయి రాణవెలింగిన తెన్గువైభవం
బొకక్షణకాలమందిటుల నొప్పుతొలంగి యిదేమి యీగతిన్
సకలము మారిపోయెను ; దిశల్ వణకించిన తెల్గుదోఃప్రతా
పకలితలక్ష్మియేది ? హానుపడ్డవిహా విజయాంకభావముల్ !

ఆంధ్రవాణీదేవి నతిభక్తి సేవించు రాజరాడ్చంద్రుని తేజమేది ?
అరివీరహృదయాలు చిరిగిపోవగజూచు కృష్ణరాణ్ణృపమౌళి యెందుజనియె ?
దేశసంరక్షకై తెగువప్రాణములిచ్చు వెలమశూరత్వంబు వెడలెనెందు ?
పౌరషజ్ఞానంబు వరియించి చరియించు పల్నాటివీరుల పటిమయేది ?

అఖిలదిక్సీమ చరియించు నాంధ్రకీర్తి,
దేశదేశాలప్రాకిన తెలుగు ప్రతిభ ;
రాణ చెన్నారు తెలుగుల రాజ్యలక్ష్మి
నేడు నెందుల పన్నుండి నిదురజెందు ?

ఆంధ్రాంగనామధురాననంబునయందు దరహాసకౌముది విరిసె నెపుడు ?
ఆంధ్రాంగనాశ్రీముఖాంభోరుహమునందు చిఱుపల్కు దేనియల్ చిందె నెపుడు ?
ఆంధ్రాంగనాపల్లవాంగుళీధూతతంత్రీస్వనంబులును రాణించె నెపుడు ?
ఆంధ్రాంగనానిపుణాభినయసుకళాశ్రీల దివ్యులు ప్రశంసించిరెపుడు ?

తెలుగు కన్నియ వలపులు మొలకలెత్తి
శీతలేక్షణాంబుపరిపోషితములగుచు
చిఱుత తెలినవ్వు పువ్వుల విరిసి విరిసి
స్నిగ్ధసౌరభలక్ష్మి వాసించె నెపుడు ?

తిమ్మరుసయ్యయేడి ? రణతిక్కడు నెందులబోయినాడు ? మా
బమ్మెరపోతడేడి ? కవిబ్రహ్మయు పల్కడిదేమి ? రాజు రా
జ్యమ్మున నుండడేల ? ఇది సర్వము చిత్తరువాయె ; నేడు వీ
రిమ్మెయి నెందు మాటువడి రీ తెనుఁగుంప్రజ చెప్పదేలొకో ?

—అ. నా. గోపాలరావు.

# గ్రామఫోను

గ్రామంలో దేవాలయం ఉండడంలేక పోవడాలను బట్టి ఆగ్రామం ఉచ్చనీచలను నిర్ణయిస్తారు పెద్దలు. ఇది ఆనుపూర్వికంగా వస్తున్న ఆచారం. దేవాలయంలేని గ్రామం కుగ్రామం. క్రమేణ దేశాచారాలూ, అభిప్రాయాలూ మారుతూన్నకొద్దీ గ్రామం ఉచ్ఛనీచలను నిర్ణయించడానికి మరొక కొలత బయలుదేరింది.

ఇప్పుడు గ్రామంలో గ్రామఫోను ఉండడం లేక పోవడాలనుబట్టి గ్రామంయొక్క ఉచ్చనీచలు తేలుతున్నవి. పదిండ్లు కలిగిన గ్రామమైనా ఆమహావస్తువు లేని గ్రామం కుగ్రామం అయింది.

గ్రామఫోను కొనే ఆసాములు ఈ మహాజంతువును వేరువేరు కారణాలచేత కొంటూఉంటారు. కొందరు గ్రామంలో తనలాంటివాడికి గ్రామఫోను లేకపోతే పరువేమిటి అని, కొందరు సంగీతంమీద మితంలేని ప్రేమవల్ల, కొందరు తమ విరోధులకే ఉన్నప్పుడు తమకు లేకపోవడంనామర్దాఅని, విష్ణ్వార్చకులు కొందరు శివార్చకులు కొని శివస్వామికి వినిపిస్తూంటే విష్ణుమాత్రం తీసిపోయినాడాఅని, కొందరు గ్రామఫోను ఏజంటు మొహమాటం తీసివేయలేకా, కొందరు సంగీతంమీద ఎక్కువప్రేమ ఉన్నదని ఇతరులు అనుకోవలెననీ, కొందరు నలుగురూవచ్చి గ్రామఫోను వినిపించమని అడుగుతారు దర్జాగా ఉంటుందనీ, కొందరు అన్నయ్యకున్నది తనకుమాత్రంవద్దా అని ఇత్యాది ఘనాకారణాలవల్లనే తప్ప అంతకు తక్కువ కారణాలవల్ల ఎవరూ గ్రామఫోను కొనరు.

గ్రామఫోనుజీవితంమాత్రం నిత్యకల్యాణం పచ్చతోరణంగా జరుగుతూఉంటుంది. అది త్యాగానికీ, ఓర్పుకూ, మంచికీ, నిత్యసంతోషానికీ తావైనందువల్ల దాన్ని కొన్నవాళ్లెవళ్ళూ వృథాఖర్చు చేశారని అనడానికి ఎవరికీ ఏవిధమైన హక్కులేదని తెలుసుకునేది.

గ్రామఫోనుకొని దానిత్యాగం, ఓర్పు, మంచీ, నిత్యసంతోషం వగైరా మంచిగుణాలను మనకు ఒరవడిపెట్టడానికి పూనుకున్న మహానుభావులకు తీరిక చేసుకొని అందరూ ప్రణామములు చెయ్యవలెను.

ఎంతపాడినా విసుగులేదు. ఓర్పుకు దాన్ని చెప్పి మరోదాన్ని చెప్పాలి. జీవంలేనివస్తువు ఇంత ఘనమైన గుణాన్ని కలిగిఉందంటే జీవంగల జీవులు ఆత్మపరీక్ష చేసుకోవాలె.

గ్రామఫోను ప్రప్రథమంలో ప్రపంచకములో అవతరించినప్పుడు దీనిని ఒక్కజంతువుగానే చూచారు కొందరు. ఆపెట్టెలోనో, గొట్టంలోనో మనిషి తప్పక ఉండితీరవలసిందేనన్నారు కొందరు. దాని దగ్గరకెందుకులెండి ఇక్కడ కూర్చొని విందాంలే అని అన్నారు చాలామంది.

క్రమేపి భయంతీరిపోయింది. దానివల్ల ప్రమాదం లేదని గ్రహించారు. అడ్డమైనవాళ్ళు గ్రామఫోను కొనడం ఆరంభించారు.

మొదట మొదట గ్రామఫోను ప్లేట్లిచ్చినవారిని గురించి చాలా గొప్ప అభిప్రాయాలుండేవి. ఆయన ఎంతో పాటగాడయిఉండకపోతే గ్రామఫోను ప్లేట్లివ్వడానికి ధైర్యంచేస్తాడా అనే అభిప్రాయం ప్రబలంగా ఉండేది. అప్పుడు పాటా ఆలాగే ఉండేది.

రానురాను అన్నిరకాలవాళ్ళూ ప్లేట్లివ్వడం ఆరంభించారు—ఎవరుబడితేవారు నటకులు గావడానికి తయారయినట్లు. కొద్దిగా ఒకటిరెండు రాగాల కళలు సంపూర్తిగానో అసంపూర్తిగానో తెలుసుకొని ప్లేట్లివ్వడానికి హాజరయ్యే గాయకులు వెలిశారు. భావకవులూ, కథకులూ, గాయకులూ, నటకులూ ఈవిధంగా భూమి ఈనినట్లుగా వెలవడం ఆంధ్రమాత అదృష్టంగాక మరేమిటి ?

క్రొత్తరోజుల్లో గ్రామఫోను ప్లేట్లు తీసుకున్నప్పుడు గ్రామఫోనురికార్డుకంపెనీవారు పుష్కలంగానే డబ్బిచ్చారు. ఇప్పుడు రైలుచార్జిపెట్టుకుంటే వచ్చి ప్లే

ట్లిచ్చిపోయే గాయకులు వెలిసింతర్వాత డబ్బు యిదివరలాగా వాళ్ళివ్వడంలేదంటే ఏమిలాభం?

గ్రామఫోనులో పాడినవారు లెక్కకు మిగిలి ఉన్నారు. వారినిగురించి విమర్శించేవారూ అంతే.

పుర్రెకోకబుద్ధి. నాలికకోకరుచి. గ్రామఫోను ప్లేట్లిచ్చిన గాయకులెందరో, ఒక్కొక్క గాయకుణ్ణి గురించిన అభిప్రాయాలు కనీసం అన్నైనా ఉంటవి. రాచప్ప నిద్రబోయినవార్ని లేవగొట్టుతాడని ఆయనంటే గౌరవంకొందరికి. సదరు బుద్ధిమంతులకే ఇందుబాల, బాలగంధర్వాదులు వినబడీ వినబడకుండా పాడుతారని కోపం. ఎవరైనా కపిలవారబ్బాయి తరువాతనే అని కొందరిమతం. కపిలవాయివారి పాట పాతచింతకాయపచ్చడి అని కొందరి అభిప్రాయం. జొన్నవిత్తులాయన అరేరే! ఏమిత్రిప్పుతాడురా గొంతు. అకారం ఏంపలుకుతుందిరా సంగీతంఅంటే అదీఅని కొందరు. అరిచి అరిచి మా గాడిద ఈలాగే చచ్చిందన్నట్టుగా ఉంటుం దాసంగీతం అని మరికొందరు. 'రాఘవా' అని అద్దంకివారి పిల్లవాడు అనాలె వినాలెనని కొందరి ఆలోచన. ఎన్నైనా చెప్పండి ఆయనపాటలు ఏమాత్రం బాగుండవు, పాడుంపిల్చినవాడుగొంతూ ఆయనానూ అని కొందరివిచారణ. స్థానంఆయనపాట అసలే ఏడ్చినట్టుగా ఉంటుంది, దానికితోడు ఆయన గ్రామఫోనులో ఏడ్చాడెందుకురా అని కొందరి ఆక్షేపణ. ఏమన్నా, స్థానంవారిపాటలో మాధుర్యంఉంది, ఆయన పెద్దపాటకుడు కాకపోయినా ఆయనపొందిక, నేర్పు, భావస్ఫురణ ఇత్యాది గుణాలు ఎవరికీరావు, ఆయన ప్రతి పద్యమూ, పాటా, ఆయననాటకంలో వేసిన పాత్రలను జ్ఞప్తికితెస్తవి, ఆయన ఏడ్పుగూడా గొప్పగానే ఉందని స్థానంపార్టీవారి సమర్థన. ఈ విధంగా గ్రామఫోను గాయకులమీద అభిప్రాయాలూ, ఆక్షేపణలూ, ఖండనలూ, సమర్థనలూ వింటూంటే వేళ ప్రొద్దుగడవదనే భయం ఉండదు.

గ్రామఫోనుస్థితిమాత్రం నిత్యకల్యాణంగా వెలిగిపోతున్నదన్నాము. గ్రామఫోనుగల ఆసామిస్థితి మరీని. అతగాడికున్న పలుకుబడి కరణం మునసబులకైనా, పెద్ద అధికార్లకన్నా, లక్షాధికార్లకన్నా లేదు. ప్రతివాడూ ఓమారు గ్రామఫోను వినిపిస్దురూ అనేవాడే. అంటే విని లోలోపల సంతోషించే గ్రామఫోను యజమానులుగూడా ఉన్నారు.

గ్రామఫోను కొందరికి ఎంతో టెక్కుసరికూడా నేర్పుతుంది. కొంచెంసేపు గ్రామఫోను వినిపిస్తారా? అంటే కొందరు గ్రామఫోను ఆసామీలు 'ఇప్పుడు కాదులెండి, మరోసారి ఎప్పుడన్నా......?' అనీ, మరి కొందరు ప్లేటులు మంచివిలేవండీ అనీ, గ్రామఫోను ఇప్పుడు ఆర్డరులో లేదండీ అనీ ఏవేవో కారణాలు చెప్పుతారు. అసలుకారణంమాత్రం అడగంగానే వినిపిస్తే అందులో మజాపోతుందనే. కొందరు కొందరికి గ్రామఫోను పాడయిపోతుంది, ప్లేటులు అరిగిపోతవనే అభిప్రాయంకూడా ఉంటే ఉండవచ్చు.

కొందరు గ్రామఫోను యజమానులకు తమ గ్రామఫోను పతివ్రతఅని, అది పరహస్తస్పర్శమాత్రంఓర్చదని, అభిప్రాయం. ఎవరినీ తాకనివ్వరు. కొందరికి తమ గ్రామఫోను పువ్వులాంటిది మరెవ్వరు మోటుగా తాకినా వాడిపోతుందనీ, మరికొందరికి తన గ్రామఫోను మంచిగయ్యాలి, తానుతప్ప దాన్ని ఇతరులెవరూ స్వాధీనపరుచుకోలేరు, సముదాయించుకోలేరనీ. ఇత్యాది కారణాలచేత కొందరు, కొందరు వేరు కారణాలచేత ఇతరులకు గ్రామఫోను ఇవ్వవలసివస్తే వెంటవెంటనే వస్తూఉంటారు.

ఇందులో కొందరి అభిప్రాయం గ్రామఫోను పెట్టడం ఇతరులకెవ్వరికి చేతగాదని, తమకుమాత్రమే చేతనవునని. తాము పెద్దపెద్ద పరీక్షలిచ్చినందువల్లే ఈలాంటి గొప్పవిషయాలు తమకు తెలిసినవనీ. అలాంటి ఆసామీలే తమ గ్రామఫోను ఉండడంవల్లనే సూర్యచంద్రాదులు గతులుతప్పకుండా నడుస్తున్నారని తలచేవారుగూడా ఉన్నారు.

గ్రామఫోను ఉండి అప్పుడప్పుడు పెట్టుకొని వినే ఆసామీ—అంటే పెట్టి వినకుండా మూలబెట్టి బూజెక్కించేవారున్నారు. ప్లేటులు పచ్చళ్ళమీదికి మూతలకు పనికివస్తున్నవి.—వినే ఆసామీ అయితే ఆయ

నకు దొంగలభయం ఏమాత్రమూ ఉండదు. ఆయన ఇంటిచుట్టూ జనం హమేషా పడి ఉంటారు. కిటకిటలాడుతూ జనం పెళ్ళింట్లో ఉన్నట్లే ఉంటారు. పల్లెటూరయితే చెప్పనక్కర్లేదు. అలాంటప్పుడు ఆ ఆసామి గొప్పవాడు కాడని ఎవరనగలరు.

ఒకాయనఇంట్లో గ్రామఫోను ఒకటిఉన్నది ఉన్నదనిమాత్రం ఎవ్వరికీ తెలియదు. ఎప్పుడైనా గ్రామఫోనుపెట్టి వింటూంటేగా ప్రక్కవాళ్ళకైనా తెలిసేది? దగ్గరబంధువులలో ఎవరైనా గ్రామఫోను ఉన్నదని తెలిసినవారువస్తే వారికి బుద్ధిపుడుతుంది గ్రామఫోనువిందామని. వారుశ్రమపడి ప్లేట్లమీది బూజు, గ్రామఫోనుమీదిబూజు ఒక గంటన్నరసేపు తుడిచిన తర్వాత సౌండుబాక్సుకోసం వెతకడం ఆరంభం చేస్తారు. ఆసమయానికి ఆసౌండుబాక్సుఉన్న ఇనప్పెట్టెతాళంచెవులు ఎవరికీ కనబడవు. భార్యవైపువారు వస్తే భర్త తాళంచెవులు కనపడకుండా చేస్తాడనీ, భర్తవైపువారువస్తే ఆపని భార్య చేస్తుందనీ ఒక అనుమానంఉన్నది కాని నిజానిజాలు తెలియవు. ఇంతకంటె ఆసౌండుబాక్సు పనిచెయ్యని స్థితిలో ఉంచితే వారి గ్రామఫోను ఆచంద్రతారార్కంగా అలాగే ఉంటుందని, ఎవరికి దానినిచ్చినా భరవాలేదనితోస్తుంది.

గ్రామఫోనుప్లేటులు ఇవ్వడమనీ, గ్రామఫోను పెట్టడమనీ పరిపాటిగా అంటున్నాము. అసలు పెట్టు అను ధాతువుకు శబ్దార్థచంద్రిక, శబ్దరత్నాకరము వగైరా నిఘంటువులలో ఉన్నఅర్థము ఉండదు అని. "గ్రామఫోనుపెట్టు" అంటే మూలఉన్న గ్రామఫోను నడిమధ్య పెట్టడంగాదు. గ్రామఫోను నలుగురిమధ్యపెట్టి కీయిచ్చి ప్లేటుపెట్టి పాడించడం. అలాగే ప్లేటివ్వడం అంటే ప్లేటు మరొకరికివ్వడమనేకాదు. ప్లేటులో ఎక్కించడానికి పాట పాడడం. ఒకాయన మరొకాయనతో "మీరు రెండు ప్లేట్లివ్వండీ" అంటే ఆరెండో ఆయన వల్లమాలినకోపం తెచ్చుకుని "నాకు సంగీతం రాదని మీకు తెలియదా. అలా వేళాకోళం ఏంబాగు లేదు సుమండీ!" అన్నాడట. కనుక ఇందు మూలంగా పెట్టడానికి పాడించడమనీ, ఇవ్వడానికి పాడడం అనీ నూతనార్థాలు కల్పించి, కోశకారులకు పనికల్పించినా. ఆంధ్రభాషను వృద్ధిపరచినందుకు పదహారణాల ఆంధ్రులందరూ సభలుజేసి గ్రామఫోను కనిపెట్టిన ఆయనకూ, వారు ప్రస్తుతం ప్రపంచకంలో గయారుహాజరయితే (అయితేనే సుమండీ) వారి వారసులకూ (వారసులకిస్తే పితృదేవతలకు చేరుస్తారుగనుక), గ్రామఫోనుకంపెనీలవారికీ, గ్రామఫోను పిచ్చను ప్రపంచకంలో వ్యాపింపజేసినవారికీ, ఆంధ్రదేశంలో అతివ్యాప్తికితెచ్చినవారికీ కృతజ్ఞత తెలుపవలసి ఉంటుంది. మాటలకు నూతనార్థాలనూ, నూతనప్రయోగాలనూ ఆంధ్రసాహిత్యపరిషత్తువారూ ఏమాత్రం ఒప్పుకోరు గనుక ఈ విషయంలో అభినవాంధ్రకవిమండలివారన్నా కొంచెం శ్రమ తీసుకోవలసి ఉంటుంది.

ఏతావతం చెప్పదల్చుకున్నది గ్రామఫోను పెట్టిన చోట చేరేజనాన్నిచూడడం ఒక ఆనందమేనని. పిలవ లేదనుకోకుండా, ఇంతమందిచేరితే ఏమనుకుంటారోనని ఆలోచించకుండా, పాటసంగతి తెలిసినా తెలియకపోయినా జనం పుష్కలంగా మూగి కనులపండువ చేస్తారు.

ఇదివరలోనే జనాకర్షణకోసమున్నూ, మొహమాటము ఏర్పఱచుకొని పలుకుబడి సంపాదించుకోవడానికిన్నీ కొన్ని వృత్తులు ఏర్పరచబడ్డవి. శివార్చకులూ, విష్ణ్వర్చకులూ తమ పనులకుతోడు కొంచెం వైద్యం నేర్చుకుని తమతో ఇతరులకు పని కల్పించుకుంటూ వచ్చారు. ధనం రాలినా రాలకపోయినా వైద్యపు మొహమాటాన ఏదైన పనైనా చేయించుకోవచ్చునని. మఱికొందఱు జ్యోతిషం ఉపవృత్తిగా చేసుకోవడం చూస్తున్నాము. చాలామంది పొడుంకాయ హమేషా దగ్గర ఉంచుకొని తాము పీల్చినా పీల్చకపోయినా శూద్రాదులకు దానంజేసి పలుకుబడి సంపాదించుకుంటున్నారు. అలాంటిదే గ్రామఫోనున్నూ. నలుగురిలో పలుకుబడి కలుగజేస్తుంది. ఆ వస్తువుగల ఆసామి తాను పాడించుకొని వింటున్నప్పుడు ఇతరులువచ్చి వింటేనే కొంచెం మొహమోటం ఏర్పడుతుందే ఇహ ఇతరులు వారికై వారువచ్చి అడిగి పాడించి, విని, ఆనందించి,

వెళ్ళితే మొహమాటంసంగతి చెప్పవలెనా? పలుకుబడి, నలుగురిలో ఎఱుక కోరే అర్చకులు, హోటలు యజమానులు, సానులు, వకీళ్ళు, డాక్టర్లుగూడా హమేషా వారి వాకిట గ్రామఫోను పాడించడంవల్ల ఉండే గుణాగుణాలను వారేనిర్ణయించుకుని కార్యరంగంలోనికి దిగుతారని ఎంచుతాను. హోటలుయజమానులు కార్యశూరులు అనిపించుకున్నారు. ఇతర సోదరులుమాత్రం వారిని అనుకరించలేని భీరులా? అన్నలారా! మేల్కొనుడు!!

అనేకముగు గ్రామఫోను సభల నలంకరించి, అపరిమితముగు అనుభవము గడించిన ఒక శాస్త్రజ్ఞుడు ఈ క్రింది విధముగా ప్రకటన చేస్తున్నాడు. "గ్రామఫోను వినడానికి తయారయ్యే జంతువులకందరికీ (శాస్త్రపరిభాష జీవంగలవాటిని జంతువులు అంటుంది) ఒకవిధమైన జబ్బుఒకటి సర్వసామాన్యముగా కనిపిస్తున్నది. ఆ జబ్బు గ్రామఫోను వినడానికి వచ్చింతర్వాత గ్రామఫోనునుంచి శ్రోతలకు వ్యాపించే అంటువ్యాధా? అని ప్రశ్నలు కలిగినవి. ఆ జబ్బు అమితంగా మాట్లాడడం. ఏ మంచిపాటకుడో పాట వినిపిస్తూంటే వినేవాళ్ళు ఊరుకోలేక మాటలు సాగిస్తారు. కొందఱు పాటకుణ్ణి గురించో, గ్రామఫోను ప్లేట్లు తీయడాన్ని గురించో మాట్లాడినా హెచ్చుగుంది సందర్భంలేని స్వంతవిషయాలను గురించో, లోకాభిరామాయణమో చెప్పుకుంటారు.

కొందఱు మానవులలో ఈ జబ్బు స్వతస్సిద్ధంగా ఉంటుందా అనే ప్రశ్నకు ఆ జబ్బుగలవాళ్ళుమాత్రమే గ్రామఫోను వినడానికిరావడ మెలా సంభవిస్తుందనే ప్రశ్న రూపకమైన సమాధానంవచ్చింది. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పి పర్యవసానము తేల్చగలందులకు మానసికశాస్త్రజ్ఞులతో కూడుకొన్న ఒక ఉపసంఘము వారు అహర్నిశాలు పరిశ్రమచేస్తున్నారు.

ఒకరింట్లో గ్రామఫోను తఱుచుగా పెట్టుతూ ఉంటారు. ఎప్పుడైనా మాటవరసకు "సాయంత్రం మా యింట్లో గ్రామఫోను పెట్టుతాము ఒకసారి రండి" అని అంటాడేమో ఆ గృహయజమాని అని పది పదిహేను రోజులు చూచాను. పోనీ నెళ్ళుదామా ఈ మాత్రానికి పిలిచేదేమిటి అని నాకు తెలియకుండానే వెళ్ళేవరకు వచ్చేదేగాని వెంటనే వారి ఆడంగులుంటారని జ్ఞాపకమొచ్చి మానివేశేవాణ్ణి.

చివరకు నేనే ఓడిపోయినాను గ్రామఫోనుగల గృహస్థుయింటికి నాకాళ్లు నడచివెళ్ళినవి. వెళ్ళేవి ఊరుకోక బలవంతంగా శరీరాన్ని, మనస్సున్న పెట్టెనూ లాక్కొనివెళ్ళినవి. అనుకున్నట్టే వారి ఆడంగులు నన్ను చూచి తలుపుచాటుకు వెళ్ళారు.

నేనువెళ్లినతర్వాతనే మరి నలుగురు పెద్దలుగూడా దయచేశారు. ఆ వచ్చినవార్ని ఆహ్వానించడం, చాప చాలకపోతే మరొకచాప వేయించడం ఈ హడావుడిలో జరుగుతున్నప్లేటు అయిపోయింది. తిరిగి మరో ప్లేటుపెట్టారు. ఆ వచ్చినవారిలో ఒకాయన (సంగీతజ్ఞానం తనకున్నదని యితరులు అనుకోగలందులకు ఆయన మాట్లాడినా, మాట్లాడడం పూర్తి అయ్యేలోగా ఆయన సంగీతజ్ఞానం పూజ్యమనితేలింది) తన సంగీతజ్ఞానం ప్రకటిస్తూ "సుబ్బయ్యభాగవతారా! ఆయనది ఈ ప్లేటు కాదురా. ఆ రోజు మనం విన్నాంచూడూ అది వెయ్యి" అన్నాడు. "అదే ఇది" అనేవరకు "అదేమిటిరా సంబంధం లేనట్టుతోచింది" అని తప్పుకున్నాడు. ఆయన తల ఊపుడూ, తాళపు వేపుడూ చూచి "ఇదేంరాగం అండీ" అన్నాను. ఆ పెద్దమనిషి "కన్నడ" అన్నాడు. ప్లేటు అయింతర్వాత చూస్తే దానిమీద "కమాచి" అని ఉంది. "దానికీ దీనికీ కొంచెందగ్గరే లెండి. ఒక్క కళేవార" అని దబాయించాడు. మిగిలినవారంతా వాళ్ళవాడి జ్ఞానానికి ఆనందిస్తున్నారు. నేనూ ఆయన తెలివితక్కువకు చిరునవ్వు నవ్వాను. మొత్తం అందరము ఆయన సంగీతజ్ఞానానికి సంతోషించామన్నమాటే.

ఒక ప్లేటు తర్వాత మరొకటి నడుస్తూనే ఉంది. ప్లేట్లు వేశే ఆయనకూడా శ్రోతల సంభాషణలో పాల్గొన్నట్లయితే ఏ ఏమరుపాటులోనే ప్లేటు పగలవలసిందే. బుద్ధిమంతుడు కావడంచేత తన గ్రామఫోనునుగురించిన శ్రద్ధవల్ల ఆయన విరివిగా వీరి సంభాష

ణంలో పాల్గొనలేదు. ఆపైన మాట్లాడిన పెద్దమనిషి (స్థూలకాయంలోనన్నా) ప్రక్కవారికి సంగీతాన్ని గురించీ, దాని మెరుగులనుగురించీ, పాటకులనుగురించీ, గ్రామఫోన్నుగురించీ, విడవకుండా ఉపన్యాసం ఆరంభించాడు. మిగిలినవారు తమకుతోచిన సంగతులు పులగంలో పచ్చడిలాగా తగిలిస్తున్నారు.

మూడు నాలుగు ప్లేట్లు ఈవిధంగా నడచినవి. ఒక ప్లేటుకు ఒకప్లేటుకు మధ్య టైములో మాట్లాడవద్దని వారికి చెపుదామనుకుంటే సరిగా అప్పుడే వారు మాట్లాడడం మానివేశేవారు.

కొంతసేపయిన తర్వాత ఒకప్లేటు జరుగుతుండగానే ఆపుకోలేక "బాబూ! వినుదురూ!!" అన్నాను. "నామొహం ఏమిటీ వినేది? అవి ఆపరా. ఈసంగీతం ఎవరికి తెలియదు? ఆవి పప్పుబ్రాహ్మడుపెట్టి ఆలాంటివి తగిలించవోయి" అన్నాడు ఆయన. అది పెట్టింతర్వాత ప్లేటులోది వినకుండానే ఒకశేనవ్వు, నవ్వంతా అందుకోసమే నిల్వచేసుకున్నట్లు.

కొసమాట ఆనాడు గ్రామఫోనుప్లేటు ఒకటీ నేను సరిగా వినలేదు. ఆనాడేమిటి? ఏనాడూ, ఎవ్వరూ గ్రామఫోను సరిగా వినడానికి వీలులేని పరిస్థితులు ఏర్పడినవి. గ్రామఫోను వినడానికి కూర్చున్నతర్వాత మాట్లాడకూడదని 144-వ శెక్షను ఉపయోగించడానికి వీలవుతుందేమో, అయితే దీనిని ఎవరు అమలుపరచాలనో అనుభవశాలులైన లాయర్ల సలహాలైనా, లేక అసలు 144-వ సెక్షను బూజుదులిపి పైకితెచ్చిన ఘరానామనిషి సలహాలైనాపొంది గ్రామఫోను ప్రియులు పనిచెయ్యవలసినస్థితి దేశానికిపట్టింది. ఎంత శ్రమకైనా ఓర్చుకుని వారు ఈ పనికి పూనుకుంటారని తలుస్తాను.

—మొదలి వేంకటసుబ్రహ్మణ్యశర్మ, బి. ఏ.

---

# వి రా గి

ప్రథమ శకలము : సృష్టికర్త.

అమితతీక్ష్ణాతపంబున నలసి సొలసి
శ్వాసములు పుచ్చు నీబాటసారి యెవఁడొ?
పాపము! వ్యథాపరిక్లిష్టభావమూర్తి
యై, కనుంగవ నశ్రువు లవిగొ తొఱఁగు.

ఎండమావుల నీరము లిచ్చమెయిని
గ్రోల నెంచిన యట్టి మూర్ఖుండితండు;
అమితతృష్ణాప్రకృష్టాత్ముఁ డల్లనల్లఁ
బాదములు వెట్టుచుం దొట్రుపడుచు వచ్చు.

*   *   *

రమ్ము పాంథ! నావచ్చు పథమ్మునంటి
పోయెదవు నీకు సంతసంబు ఘటియిల్ల,
మగిడి నీసౌధగేహాళీమధురకాంతి
పూరముల సూర్యదీప్తులు తేరిచూతు.

*   *   *

అటులు కవిచెప్పు పలుకుల నాలకించి
పథము గమనించి పోయె నా బాటసారి;
జ్ఞానగీతము పాడించు సర్వమయుని
కవివరేణ్యుని హృదయంబు గాంచలేఁడు!

కష్టసుఖముల నోరువఁగల జనుండె
నిశ్చయము ముక్తివీథికి నేతయగును
బోడి బైరాగి వేసములో పూనినంతఁ
గలుగునా యేమి? మోక్షరంగమున సిద్ధి.

—పెనుమర్తి వేంకటరత్నశర్మ.

# ఈ సంక్రాంతికి

ఈ సంక్రాంతికి నోముపండినది తల్లీ! పాలచెక్కిళ్ళలో
మోసుల్ దేరిన బోసినవ్వునువుబువ్వుల్ గ్రుచ్చి నిశ్శబ్దపుం
బ్రాసాదమ్ము నలంకరించి కళసంపాదించి యుయ్యాలలో
నూసుల్ జెప్పెడి చిన్నిబొమ్మ కొలువై యుల్లమ్ము బెల్లమ్ముగా.

సెలవుల్ వారెడి పిచ్చినవ్వులను విచ్చీవిచ్చకున్నట్టి చూ
పులకున్ జిత్తము గుత్తగొంచు తరితీపుల్ రేపి తీపారు ప
ల్కుల గ్రొందేనియ సోనలందడిపి కోర్కెల్ నించు బంగారు ము
ద్దులపాపాయి కతమ్మునన్ మనకు ప్రొద్దుంబ్రొద్దు సంక్రాంతియే!

ఇదిగో నమ్మరో పౌష్యలక్ష్మి! తొలి నీవే తెంచు పబ్బమ్ము నం
దెదురుల్ సూచుచు డెందముల్ గదుర ముందే గాజురా బొమ్మలం
గుదురుంగొల్వు కొటారుదీర్చి వరముం గొన్నాము; నేడింక మా
మదులన్ నిక్కపుబొమ్మ కొల్వగొనె సుమ్మా! చూచిపోవచ్చులే!

ఉయ్యాలం బవళించి దోయిలికి నుద్యోగించు గేల్దమ్మితో
నాయ్యుందియ్యని క్రొత్తబాస నిదె నీ కుప్వాంగి సుస్వాగతం
బియ్యన్ మాజినదేవు డెంచుకొనెలే! యీవింటికిన్ వచ్చి 'మా
యయ్యా! మేలగుగాత!' మంచు నొడియుం దాడించి దీవింపుమా!

ఇరువదిరుమేండ్ల నేస్తమ్ము లెసగు కతన
పాలపాపకి తొలియేడు పరిచయమ్ము
నెరుగ గూర్చితి నిదిమొద లేదు నేడు
చూచిపోవమ్మ చుట్టపు చూపుగాను.

—బొడ్డు బాపిరాజు.



# తల్లిచాటు పిల్లవాడు

౧

లోకం ఒక పెద్దకొలిమి. అనేకథక్కా ముక్కీలు తిని రాటుతేలిన వాళ్ళు దానివేడికి తట్టుకోవలిసిందే కాని, ప్రసాదరావులాంటి సుకుమారులు ఆగలేరు. అటువంటివాడు కొన్ని కారణాలవల్ల లోకంవాత పడ్డప్పుడు—

పత్నీసమేతుడయ్యేవరకూ ప్రసాదరావు తల్లిచాటున పెరిగాడు. లోకాన్నిగురించి అతనికి గ్రంథపరిచయం వల్ల కలిగిన జ్ఞానమేకాని ప్రత్యక్షానుభవం సున్నా. సుకుమారి. మనసుకూడా అటువంటిదే. ఎక్కువకాలం తనభావప్రపంచంలోనే ఉంటూండేవాడు. ఆదర్శాలు గొప్పవి.

ఒక కొమ్మనువదిలి మరోకొమ్మను పట్టుకోవాలనే తెలివితేటలు కోతులకే కాక మనుష్యులకూ ఉంటుంది. భార్య తనదయేరోజు సమీపిస్తున్నకొద్దీ అతను తన భావప్రపంచంలోనించి క్రమక్రమంగా తల్లిని తీసేసి ఆస్థానం భార్యకివ్వటం మొదలుపెట్టాడు. అందులో తప్పేమీలేదు—తల్లి అసూయాగ్రస్తురాలు కాకుండా ఉంటే. వెంకాయమ్మగారు సంతోషించింది.

ప్రసాదరావెంతో ఉత్సాహంతో ఎదురుచూస్తున్న రోజు వచ్చేసింది. గృహస్థాశ్రమంలో ప్రవేశించబోయ్యేవాడు తనభార్య ఈవిధంగా మాట్లాడుతుంది, ఈ విధంగా ప్రవర్తిస్తుంది అని నూరురకాలుగా ఊహించుకొనివుండి కాక, తీరాదగ్గిరికొచ్చేటప్పటికి నూట ఒకటోరకంగా ఉంటుంది. ప్రసాదరావుసంగతి పెంపుడు పిల్లికి తిండి పెట్టుతూండగా అది కాస్తా చెయ్యిపీకిన వాడి సామెతయింది! మర్నాడతనిమొహాన కత్తివాటు వేస్తే నెత్తురుచుక్క లేదు. అత నదివరకు రకరకాల ప్రణయకథలు చదివాడు. అనేకమంది స్త్రీలనుగురించి విన్నాడు. ఇ దేరకమూకాదు. మీదుమిక్కిలి ఆపిల్లకు సుశీలఅని ఎందుకు పేరుపెట్టారో అతనికి అర్థంకాలేదు. గండుపిల్లనికాని కొండముచ్చునికాని నామకరణంచేస్తే ఎంతో సార్థకంగా ఉండేది.

ప్రసాదరావుకు జరిగిన మరోఅపకారమేమిటంటే ఆకిందటిరోజునకూడా అతను భావప్రపంచంలో భార్యతో అద్భుతంగా సుఖపడుతూ చక్కనికలలుకంటు న్నాడు. ఇప్పుడామురిపెం తీరిపోయింది. భావప్రపంచం పటాపంచలయింది, కలలు వికలమైపోయినై.

రాయటానికీ-చదవటానికీ సుశీల విపరీతమైన వ్యక్తి అనిపించవచ్చును కాని ప్రపంచంలో అటువంటి పిల్లలు లెక్కలేనంతమంది ఉన్నారు. పెడకట్టె, మొండిది, మూర్ఖురాలు, ముక్కోపి, నాజూకులేనిది, కట్టెవిరిచినట్టు మాట్లాడేది, మర్యాదతెలీనిది. ఏదైనా లెజిస్లేచరుపెట్టి అటువంటి పిల్లలకు పెళ్ళికాకుండా ఏర్పాటు చేస్తే సంఘం కొంతవరకు తరిస్తుంది.

వెంకాయమ్మగారు కొడుకుదురవస్థ చెప్పినట్టు గ్రహించింది. (తల్లీ పిల్లల మధ్య భాష అవసరంలేదు.) లోపల చింతించి ఊరుకుంది. ఒక్క నెలరోజుల్లో ప్రసాదరావు దేవత్వంనించి దాదాపు రాక్షసత్వాని కొచ్చాడు. ఆవిడ అర్థంచేసుకుని ఊరుకుంది.

వెంకాయమ్మగారికి వంట్లో అస్వస్థతగా ఉండి సుశీల వంటచేసుకోవలిసొచ్చింది. ఆపిల్ల మొహం మటమటలాడుకుంటూ వంటింట్లో చెంబులూ తప్పాలాలు పగలగొడుతుండగా, ప్రసాదరావు గడ్డంచేసుకోటానికి కాసిని నీళ్ళకోసం లోపలికొచ్చాడు చెంబుపట్టుకుని. అత నింకా అయిదడుగులదూరంలో ఉండగానే సుశీ అతనిపని కనుక్కుని పంపించక "అయ్యో! అట్లా మీదికొస్తారేం?" అంది. అతనికి ఒళ్ళుమండి చేతులో ఉన్నచెంబుతో పెళ్ళాం నెత్తిన లాగి ఒకటికొట్టాడు. దాంతో సుశీల కణతలకు పసుపుకొమ్ము అరగదీసి రాచుకుని ఎవరితోనూ చెప్పకుండా గదిలో ముసుగు పెట్టుకుని పడుకుంది. (ఎవరన్నా మాడుమీద ఒక్కటి పెట్టినప్పుడు కణతలకు పసుపు గంధం వెయ్యమని ఏ వైద్యగ్రంథరాజంలోనైనా చెప్పబడుందేమో నాకు తెలీదు. సుశీల ఒక నేటివుడాక్టరుగారి మేనకోడలు కనక ఆమెకే తెలియాలి.) ఒక పొయ్యిమీద అన్నం మాడిపోయింది. రొండోపొయ్యిమీది గిన్నె ఒరిగి పడిపోయింది. అప్పుడు వెంకాయమ్మగారు మడికట్టుకుంటే పదింటికి కావలసినవంట పన్నెండింటికి తేలింది.

అనాహ్లాదకరమైన ఈ విషయంమీద ఇంతకన్న ఎక్కువ రాయటం తగనిపని. నాలుగునెలలు కాపరం సుశీల ఇదిగిట్టుపాటుకాని వ్యవహారం అని గ్రహించిందో ఏమో ఎవరితోనూ చెప్పకుండా పుట్టింటికి లేచిపోయింది.

## ౨

సుశీల క్షేమంకోరి ఆమెను పుట్టింటినించి తిరిగి అత్తవారింటికి తీసుకొచ్చి రాయబారంచేసే పెద్దలు లేక పోయినారు. కాని మనోవర్తికోసం నోటీసు లిప్పించటానికి కావలసినంతమంది దొరికారు. ఆ విషయమై తగిన ఏర్పాటుచెయ్యటానికి ప్రసాదరావు ఏలూరు వెళ్ళాడు. అత నేవిధమైన పేచీలుపెట్టదలచలేదు. వెళ్ళినపని వెంటనే అయిపోయింది. తిరిగి రాత్రి బండి అందుకోగలిగాడు. అతను స్టేషనుకు వచ్చేసరికి బండి కింకా చాలావ్యవధిఉంది. అతను స్టేషనులోనే భోజనంచేసి తాంబూలంవేసుకుని పచారుచెయ్యటానికి ప్లాటుఫారంమీది కొచ్చాడు. అక్కడెవరూలేరు. దూరంగా ఒకస్త్రీ కూర్చునిఉంది. ప్రసాదరావు ఒక్కసారి ముక్కులోనించి చాలాగాలివదిలాడు. కొంతకాలంనించీ తెల్లబట్ట కట్టుకుని ఆడదికనిపిస్తే అసహ్యం జాస్తయింది. అతను మెల్లిగాప్లాటుఫారం రొండోచివరకుపోయి అక్కడే తారట్లాడటం మొదలుపెట్టాడు. ఆలోచన ఎటోపోయింది. భావప్రపంచంలోపడిబాహ్యప్రపంచాన్ని మరిచాడు.

"ఏమండోయి!"

ప్రసాదరావు కొట్టినట్టు ఉలికిపడి తలఎత్తి చూశాడు. పలకరించినగొంతు కటువుగా ఉండకపోవటమే కాకుండా చాలా శ్రావ్యంగా కూడా ఉండటంవల్ల అతనికి ఉలికిపడవలసిన అగత్యంలేదుకాని ప్రస్తుతం అతని కీఆడగొంతుల మాటగంసు బాగాలేదు. ఆమాట కొస్తే సుశీలదీ కొంతవరకు శ్రావ్యమైనగొంతే.

అతను తన్నుపలకరించిన మనిషివంక చూసి ప్లాటుఫారం మరోచివరకు చూపు పరిపాడు. అక్కడ మనిషి లేదు. ఆమనిషే ఈమనిషి. మనిషికూడా ఎక్కడ! పిల్ల. పదహారేళ్ళు దాటని పిల్ల. బోగంది! రూలు ప్రకారం అతనుమళ్ళీ ముక్కులతో బుసకొట్టాడు. తరవాత ఆపిల్లవంక తీవ్రంగా చూశాడు మెస్మరైజు చేస్తున్నవాడల్లే. కాని అతనివెనక దీపంఉండటంచేత ఆపిల్ల కదంతా సరిగా కనిపించి ఉండదు.

"నాకు బెజవాడ కొకటిక్కట్టు కొనిపెడతారూ?" అన్నదాపిల్ల. ఆపిల్లమూతి ఎంతఅందంగా ఉంది!

"అట్లాగే! డబ్బులు తే!"

ముక్కు? ఏంముక్కు!

"నాదగ్గిరలేవు," అం దాపిల్ల.

"నన్ను పెట్టుకోమంటావా?" కళ్ళు?

ఆ పిల్లకు కొద్దిగా కోపంవచ్చినట్టు కనపడ్డది.

"ఉచితంగా ఇవ్వక్కర్లేదు. బదులివ్వండి."

"అవును! తరవాత మనంమనం లెక్కచూసుకునేటప్పుడు—"

ఆ పిల్ల కీసారి బాగా కోపంవచ్చింది.

"అందాకా ఈ ఉంగరం అట్టే పెట్టుకోండి!" అని ఆపిల్ల వేలిఉంగరం తీసిచ్చింది.

గడ్డం? కనిబొమలు? జుట్టు? వేళ్ళు? అనుకుంటూనే అతను నిర్మొహమాటంగా చెయ్యిచాచి ఉంగరం తీసుకున్నాడు.

"ఈ ఉంగరం ఖరీదెంతఉంటుంది?" అన్నాడతను ఉంగరం అటూ ఇటూ తిప్పిచూసి.

"డబ్భై అయిదు."

"బాష్! ఇదేదో ఇమిటేషన్ రాయి."

"మీరిచ్చేటికట్టు డబ్బులకు సరిపోతుంది లెండి" అన్నదాపిల్ల.

ఆత నామాట వినిపించుకోకుండా, "ఇదయితే నీకెట్లా దొరికింది?" అన్నాడు.

ఆపిల్ల చర్రుమన్నది. "మీకు మర్యాద తెలీదు. ఉంగరం ఇటు తెండి," అన్నది.

ప్రసాదరావు ఇచ్చేశాడు. ఆపిల్ల తీసుకుని వెళ్ళబోతున్నది.

"ఉండు. నీకిచ్చే రైలు చార్జీకి తాకట్టవసరంలేదు. టికెట్టు కొనిపెడతాను."

అత నీమాట అంటూండగానే పోర్టరు గంటకొట్టి వెళ్ళాడు.

"ఇక్కడే ఉండు. టిక్కెట్టు తెస్తాను."

ఆపిల్ల అక్కడే ఉంది.

ప్రసాదరావు ఆమెచేతికి టిక్కెట్టిచ్చి మళ్ళీ సంభాషణ మొదలు పెట్టాడు.




"నేనిందాక అన్నమాటలు నీకు రుచించినట్టు కనబడదు! మూడు సంగతులు జ్ఞాపకం పెట్టుకో, నేను ఆంటీనాచి, ఆంటీఫెమినైన్. నీ చర్యంతా ఫిఫ్టీగాఉంది."

"అంటే?"

"ఫౌల్."

ఆపిల్ల చిరునవ్వునవ్వి "నాకంతవరకూ అర్థమా తుంది."

"నీ కింగ్లీషుకూడా వచ్చునా ఏమిటి?"

"నేను స్కూలు ఫైనల్ పాసయినాను."

"వెరీ గుడ్! నీ సంగతంతా ఫిష్టీగా ఉందని నిరూపిస్తాను చూడు. మీ దేవూరు? నువ్వు బెజవాడ డబ్బు లేకుండా ఎందుకు పోతున్నావు? నేను బెజవాడ పోతున్నానని నీకెట్లా తెలిసింది?—"

"నాకు తెలీదు"

"నేను నమ్మను' ఒంటరిగా ఎందుకుపోతున్నావు?"

"నన్నడంతా అడగకండి! గాయం కెలికినట్టవుతుంది."

ప్రసాదరావు అకస్మాత్తుగా మాట్లాడటం మానేశాడు.

త్వరలోనే రైలొచ్చింది. దాదాపు పెట్టెలన్నీ ఖాళీగానే ఉన్నై. ప్రసాదరావు చిన్నపెట్టెగాచూచి ఎక్కాడు. బోగంపిల్లకూడా అతని వెనకనే ఎక్కి, "మీకభ్యంతరం లేకపోతే ఇందులోనే కూర్చుంటాను. చాలామంది మధ్య కూర్చోటానికి నాకు చాలా అసహ్యంగా ఉందిప్పుడు మనస్సు సరిగాలేదు," అన్నది.

"నాకభ్యంతరంలేదు. ఇందులోకూడా చాలామంది ఎక్క వచ్చునన్నది మరిచిపోకు."

ఆపిల్ల నవ్వి "ఎక్కరు" అంది.

ఆమాట అతనికి దబ్బున అర్థంకాలేదుకాని కాగానే శరీరమంతా ఒక్కసారి ఝల్లుమన్నది. తన బతుక్కటువంటి పెళ్ళాంకూడానా!

అత నాపిల్లవంక తీక్ష్ణంగా చూశాడు. కాని ఆచూపు వ్యర్థమయింది. ఆ అమ్మాయి రొండోబల్లమీద కంపార్టుమెంటు అవతలివైపు కిటికీదగ్గిర కూర్చుని బయటికి చూస్తున్నది.

ఆపిల్ల అన్నట్టే అయింది. ఒకరిద్దరు ఆపెట్టెలో ఎక్కాలని ప్రయత్నంచేసి ఇద్దర్నీ చూచి పక్కకుపోయినారు. రైలు కదిలింది. ఆపిల్ల బయటికిచూడటం మానేసి అతనివంక చాలాసేపు చూసింది. అత నటువైపు చూడలేదు. చివర కామె లేచి అతనికి దగ్గిరలో కూర్చుని "మీఅనుమానాలకు సమాధానం చెబుతాను," అన్నది.

అతను పరధ్యానంగా "ఎందుకు? నాకవసరంలేదు," అన్నాడు.

'నన్నుగురించి మీరు దురభిప్రాయం పడుతున్నారు. అది నాకిష్టంలేదు."

ప్రసాదరావు కనిబొమలు ముడేశాడు.

"దురభిప్రాయానికి అవకాశంలేదు. నీ అభిప్రాయమేదో స్పష్టంగానే తెలుస్తున్నది."

ఒక్కసారి ఆపిల్లమొహం బాధపడుతున్న లక్షణాలు కనబరిచింది.

'మీరు నిజంగా క్రూరమైన మనిషికారనుకుంటాను! ఎందుకంత హింసించినట్టు మాట్లాడుతారు?'

'క్రూరమైనమనిషి నెందుక్కాను? కావాలంటే నాపెళ్లాన్ని అడుగు," అన్నాడతను వికటంగా నవ్వి.

ఆపిల్ల దీనంగాచూడటం మొదలుపెట్టింది.

'నీ అభిప్రాయాన్నిగురించి నాకేటువంటి అనుమానంలేదు. చూశావు. కుర్రవాడుగా ఉన్నాడు, అమాయకుడేమో బుట్టలో వేద్దామనుకున్నావు. లేకపోతే స్టేషనులో అంతమంది ఉండగా నన్నే ఎందుకు టిక్కట్టు అడిగినావు? బెజవాడకే ఎందుకు కావాలిసొచ్చింది? నే ఎక్కినపెట్టెలోనే ఎందుకెక్కావు? నువ్వు చెప్పిన సమాధానమేమిటి ఈపెట్టెలో ఇంకా ఎవరైనా ఎక్కుతారంటే? ఇంకేమైనా నామీద ఆశలుంటే ఇప్పటికైనా వదులుకో! నాకర్థంకాని దల్లా ఒకటే! ఇంత చిన్నదానివి నీకింతధైర్యం ఎట్లావచ్చిందా అని!'

ఆపిల్ల అతననుకున్నట్టు ప్రవర్తించలేదు. మొహానికి చీర అడ్డంపెట్టుకుని ఏడవటం మొదలుపెట్టింది. అంతటితో అతనిధైర్యం యావత్తూ అంతరించింది. పైన ఒక్కపొర ఘనీభవించి చూడటాని కతని మనస్సు పాషాణమల్లే ఉందికాని అతని మనస్సులోపల జావగా ఉంది. ఆపిల్ల ఏడుపు పైపొరను కొట్టేసింది. అత నామెకు సమీపించి మెల్లిగా "చూడు" అన్నాడు ప్రయోజనం లేకపోయింది. ఇంకోసారి కొంచెం గట్టిగా

"చూడు!" అన్నాడు. ఊహుఁ! అతను బలవంతంగా ఆమె మొహంమీదినించి రెండుచేతులూ తీసేశాడు. ఆకళ్ళూ, మూతీ, గడ్డం, ముక్కూ అంత సమీపంలో చూసేటప్పటి కతనికి మతిపోయి ఆ దొండపండంటి మూతిని కాస్తా ముద్దుపెట్టుకున్నాడు.

పెద్దమనిషి చెయ్యవలసినపనికాదు. ఆపిల్ల భోగం దయినా, ఆమె అనుమతిలేకుండా, తన్ను నివారించ లేని స్థితిలో ఉండగా అటువంటి పనిచెయ్యటం చాలా నింద్యమైన సంగతి. ఆ వివేచన అంతా మించిపోయిన తరవాత వచ్చింది. అదేకాదు ఇంకా చాలావిషయాలు తెలిసొచ్చినై. మొదటిసంగతి అత నంతవరకు ఆపిల్ల విషయంలో ఒక్కసారైనా పెద్దమనిషితరహాగా ప్రవర్తించలేదు. మరోసంగతి ఆపిల్లచర్య కింకో కారణం ఉండికూడా ఉండవచ్చును. అప్పుడే ఆపిల్లను బలాత్కారంగా ముద్దుపెట్టుకున్న మొహంతో ఆలోచిస్తే తన చర్యలో ఆపిల్లచర్య నూరోవంతు అనుమానాస్పదంగా లేదు.

ఆ పిల్ల లేచి ఎడంగా పోయింది. అతని కామెవంక చూడటానికి ధైర్యంలేకపోయింది. కాని మొండితనం చేసి ఆమెవంక చూశాడు.

"ఆ గొలుసు లాగితే బండి ఆగుతుంది. లాగు!" అన్నాడు. ఆమె అతనివంక బోనులో సింహంవంక చూస్తున్నట్టుచూస్తూ నిలబడ్డది.

అతను మొహం చేతుల్లో పెట్టుకుని "నాకు మతి చెడిపోయింది. నేను వెనకటి ప్రసాదరావును కాను!" అని గొణుక్కున్నాడు. అయిదునిమిషాలసేపిద్దరూ కదల్లేదు. ఆ పిల్ల మెల్లిగావచ్చి అతని భుజంమీద మెల్లిగా చెయ్యివేసి "మీరేమీ పశ్చాత్తాప పడక్కర్లేదు. నాకన్న మీకేమోసం ఎక్కువ మీరుచేసిన పని వల్ల. నేను మిమ్మల్ని బుట్టలోవెయ్యటానికి ప్రయత్నం చేస్తున్నాను కనక నాకు కష్టంగా ఉంటుందని మీర నుకోటానికవకాశంలేదు," అంది.

ప్రసాదరావు తలఎత్తి "నేనెట్లాగూ పెద్దమనిషిని కానని నిరూపించుకున్నాను. నువ్వింతవరకు చాలా పెద్దమనిషితరహాగా ప్రవర్తిస్తూవచ్చావు. ఆ ఒక్క మాటతో నన్ను వదిలెయ్యి," అన్నాడు.

ఆపిల్ల క్లుప్తంగా "క్షమించండి!" అంది.

ఆమాటతో అతని కాపిల్లను చూస్తే చాలాగౌరవం కలిగింది. ఇద్దరిపరిచయం ఇంతవరకు వచ్చినతరవాత తన మనస్థితంతా ఆమెకు చెప్పేద్దామనుకున్నాడు. తన భార్య గోలంతా చెప్పాడు. తన మనస్సు విరిగిపోయిం దన్నాడు. లేకపోతే తనట్లా ప్రవర్తించాలిసింది కాద న్నాడు. ఆపిల్ల అంతా ఓపిగ్గావిని తనకథంతా చెప్పింది.

ఆ పిల్లపేరు కాంతం. ఆమె మేనమామ సంఘసం స్కారి. అనేకమంది భోగంవాళ్ళకు పెళ్ళిళ్ళు చేయిం చాడు. ఆపిల్లనాయనే పెంచి చదువు చెప్పించి పెళ్ళికి ప్రయత్నంచేస్తూ చనిపోయినాడు. తరవాత కాంతం తల్లి దగ్గిరకొచ్చింది. తల్లి కూతుర్ని వృత్తిలో దిగమని ప్రోద్బలంచేసింది. కూతురు వినలేదు. తల్లి దొంగెత్తు వేసి పెళ్ళనే వంకపెట్టి ఒక యెద్దు కంటగట్టింది కాం తాన్ని. కాంతం ఆయన్ను పెళ్ళిచేసుకోనంది. భోగం పిల్లలను పెళ్ళిచేసుకునేందుకు రంభలురారని గట్టిగా చెప్పేసింది తల్లి. ఈపని జరిగిన కొద్దిరోజుల కావేశ్య మాతకూడా చచ్చిపోయింది. ఆయెద్దు కాంతం తల్లిదగ్గిర ఉన్న సామానంతా అమ్మి "మా ఊరు ఏలూరు, మా యింటికి పోదాంపద"మని ప్రయాణంచేశాడు. ఏలూ రులో ఒక సందులో బండి ఆపి ఇక్కడే ఇల్లు దిగమ న్నాడు. కాంతం దిగటంతోటే బండి తిరిగి స్టేషను దారిపట్టింది. ఆ యెద్దుకు దిగినబండే అంది ఉంటుంది. కాంతం రైలుకు దారికనుక్కొని స్టేషను చేరేటప్పటికి రైలుపోయి చాలాసేపయింది. కాంతం భోజనంచేసి పన్నెండుగంటలు దాటింది.

ఇదంతా కాంతం చెబుతానన్నప్పు డతను చెప్ప నియ్యకపోవటం మేలే అయింది. అప్పుడైతే అతని కిది కూడా పార్టు ఆఫ్ ది గేమ్ అనిపించేది. ఇప్పు డతని గుండె నీరయిపోయింది.

"బెజవాడలో మరి నీకెవరున్నారు?" అన్నాడు ప్రసాదరావు.

"మా స్నేహితులున్నారు. కొంతకాలంవాళ్ళ అం డపడి ఉంటే తరవాత ఏమవుతుందో! మా మామయ్య

స్నేహితులున్నారు. వాళ్ళ మొహం ఎట్లా చూడను?''

"నువ్వెప్పటికైనా కులవృత్తి చెయ్యవలిసొస్తుందేమో! నీకిష్టం లేదుకాదూ?''

"నిజం చెప్పటంకన్న నిజమే ఎక్కువ. ఇష్టంలేకపోతే లేదని అనుకోటంవల్ల ఒరిగేదుందా?''

"లేదు. నువ్వు చాలా అద్భుతమైనదానివి."

"నేననేదదే! మీరు నిజంగా అట్లా భావిస్తే పైకనరు."

మనిషికి బుద్ధిలేదు. అతనికి కాంతాన్ని మళ్ళీ ముద్దుపెట్టుకోవా లనిపించింది. ఈ అనిపించటమైనా తప్పయి ఉండాలి, అంతకుపూర్వమే కలిగిన అతని పశ్చాత్తాపమయినా అర్థంలేనిదయి ఉండాలి. ఎట్లాగైనా అతనికి బుద్ధిలేనట్టే.

"నన్ను మాట్లాడనివ్వవు! రోజూ నీవంటిదానితో సంచరించటం బహుకష్టం!"

"ఇంత అద్భుతమైన దాన్నయినా?''

ప్రసాదరావు కాంతం రెండుచేతులూ పట్టుకున్నాడు.

"ఎక్కడికీ వెళ్ళవద్దు! నాదగ్గిరే ఉండు, కాంతం!"

"ఎవరికోసం ఉండను?"

"నీకిష్టమైతే నాకోసం."

"మీరు నాతో సుఖపడరు!"

"పడతాను."

"లోకం మిమ్మల్ని చెండుకు తింటుంది."

"నేను లెక్కచెయ్యను."

"చేస్తారు! ఎవరో ఒప్పుకోకపోతే మీరు లెక్కచెయ్యకపోవచ్చు. మీ అమ్మగారే ఉందనుకోండి."

ప్రసాదరావు నిట్టూర్పు విడిచాడు.

"ఆవిడ ఒప్పుకుంటే మీదగ్గిర ఉంటాను. మీ సుఖం కోసంకాదు, నా తిండికోసంకాదు, మీకోసం ఉంటాను. ఆవిడ ఒప్పుకోకపోతే ఉండను."

## 3

బెజవాడలో ఇద్దరూదిగారు. ఒకబండీ ఎక్కారు, ఇద్దరుపోవలిసింది ఒకవైపే. మధ్య కాంతం బండిఆపించి దిగింది. ప్రసాదరావు ఇల్లు గుర్తుపెట్టుకున్నాడు.

ఇంట్లో అడుగుపెడుతూనే తల్లితో చెప్పుదామని అతని ఉద్దేశం. కాని తల్లిమొహంచూడగానే అతనికి ధైర్యం లేకపోయింది. అతనిస్థితి కాలుగాలిన పిల్లల్లే ఉంది. ఉత్తశరీరసంబంధమయిన అందం మరుపుకొస్తుంది. కాంతాన్ని ఎట్లామరిచిపోతాడు? తను కాంతం విషయంలో చూపించిన అన్యాయం, నిర్దయ, మోటుతనం! తన అహంకారం? తనలో ఏంచూసి కాంతం తన్నుబుట్టలో వేసుకోవాలని ప్రయత్నం చేస్తుందిట? కాంతం అన్న ఒక్కొక్కమాట గంట మోగినట్టు చెవిలో మోగుతుండేను. తనన్నమాటలు తలుచుకుంటే ప్రాణం చచ్చిపోతుండె! అవి ఇంకా నాలుగైదుసార్లు జ్ఞాపకం వస్తే మర్నాడు కాంతం మొహంచూసే ధైర్యంకూడా ఉండదు తనకు.

సుశీలతో పోల్చినా, ఎక్కడి కాంతం, ఎక్కడి సుశీల! కాంతాన్నిచూస్తే ఉన్నగౌరవం తనకింకెవర్నీ చూస్తే లేనప్పుడు ఇంకోళ్ళేమనుకుంటారో అనే ఆలోచనెందుకొస్తుంది? కాని తల్లి?—

అతనికి ఒంటిగంటదాకా నిద్రపట్టలేదు. మర్నాడు లేచేటప్పటికప్పుడే బాంబుపేలింది. వెంకాయమ్మగారికప్పుడే రిపోర్టువచ్చింది ప్రసాదరావు భోగందానితో రైలుదిగాడని ఓరూ, బండిలో ఎక్కాడని ఓరూ! వెంకాయమ్మగారు లేవగానే కొడుకును ప్రశ్నించింది. పాచిమొహంతో ఒక్క అబద్ధమైనా ఆడకుండా అతనుతల్లికి చెప్పదగినంతవరకు చెప్పాడు.

వెంకాయమ్మగారు నిర్ఘాంతపోయింది.

"కాంతాన్ని ఇంతప్పుడు చూశానురా, అబ్బాయి! వాళ్ళ రామదాసు మీనాన్నకు స్నేహితుడు. జ్ఞాపకం ఉందా? ఎర్రబొట్టు నిలువుగా పెట్టుకుని, తలగుడ్డ చుట్టుకుని, మీసాలూ అదీనూ! మంచివాడు, పాపం! ఆయన పెళ్ళాంతో ఈ పిల్ల ఒకరోజున పేరంటానికొచ్చింది మనింటికి. దాన్నిమళ్ళీ ఒకసారితీసుకురా," అన్నదావిడ నవ్వుతూ.

"ఇవాళ్ళే తెస్తాను!" అన్నాడు ప్రసాదరావు నిశ్చింతగా.

—కొడవటిగంటి కుటుంబరావు.

# అపరాధిని

ఆకలికి కృశియించిన అంటుడొక్క
కటివలకు సున్న చినిగిన కట్టుబట్ట
జడలుగట్టిన కెంధూళి నిడివిజుట్టు
కూరుకొనిపోయినట్టి కన్‌గ్రుడ్లుగలిగి
దీనదేవత యిటుల మూర్తిభవించె
ననువిధాన అనాథకృశాంగి యోర్తు
మండువేసవిలో తల మాడుచుండ
కాళ్లు వేడిమిబాధకు కనలుచుండ
మండుటెండకు నెమ్మేను మంటలెత్త
అరుగుచుండెను మిట్టమధ్యాహ్నమందు.
అన్నమో రామచంద్రాయటంచు, ఆమె
మూపున పరుండినా డొక్క ముద్దుబిడ్డ
ఒక్క చేతిలో కఱ్ఱ, మఱొక్క చేతి
యందు చినిగిపోయిన జోలె అమరియుండె
ఆమె సొమ్మింతకన్న లేదాయె పృథ్వి
పడుచు తూలుచు దొర్లుచు నడచుచుండె
అన్నమో అన్నమో అంచు అరచుచుండె
మరల యింటింటిగడపల దిరుగుచుండె
గడపలన్నియు క్రమముగ గడచి చనియె
గాని పలుకరించెడివారు కనికరించు
వారు చూచెడివారైన లేరు నిజము
పట్టెడన్నంబు నెవ్వరు పెట్టరైరి
ఒక్క గింజైన జోలిలో నుండదయ్యె
అలసటేకాని యిసుమంత ఫలములేదు
అరచుటేకాని వినెడువారైనలేరు
ఆకలంతకంతకు మండి యధికమాయె
బోరుబోరున నేడ్చెడు ముద్దుబిడ్డ
తనకుశ్రమయు నంతంతకు నినుమడింప
జీవితదురదృష్టమును దూషించుకొనుచు
తిరిగి మార్గము వెంబడి మరలిపోయె
దుఃఖదారిద్ర్యజీవిక దుర్భరమ్ము.

పోయిపోయి యొకానొకభూరుహమ్ము
క్రింద చతికిలబడి జోలె క్రిందబెట్టి
ముద్దుబిడ్డనుగాంచి వాపోవుచుండె.
"పాడుదైవమా! పిడికెడు కూడు లేదు
కట్టుకొనుటకు చింపిరి బట్ట లేదు
అలసటారంగ త్రాగ నీరైన లేదు
పున్నెముల పెన్నిధీ! ననుగన్నతండ్రి!
ఏమినోచితినో కాని యెఱుకపడదు
ఎవరినేడ్పించియుంటినో యెఱుకరాదు
అన్నమునకు నాబిడ్డ అల్లాడుచుండె
కూలిచేసిపెట్టుదమన్న కొంచెమైన
అవయవపటుత్వమేమి లేదాయె తండ్రి!
కనికరించెడివారు లోకాన లేరు
మీరు నాబంధులనువారు లేరు జగతి
లోకమందున నేను నేకాకినయ్య
ఎచటకేగిన నెవరాదరింతురయ్య
ఎవరిఁజూడ నెవరు కరుణింతురయ్య
పాడుబ్రతుకు పుట్టితిని విశ్వంబునందు
ముద్దుబిడ్డను ప్రేముడి బ్రోవుమయ్య
కరుణజూపింపుమా! నను గన్నతండ్రి!"
అంచు దైన్యభాషల పలవించుచుండ
నాలుక పిడచకట్టగ బాలు డపుడు
బోరుబోరున నేడ్చుచు మూర్ఛఁజెంద
అమ్మ 'గాభరా' పడుచు నాఅయ్యయనుచు
లేచి నీటికై దిక్కుల జూచుచుండ
కొలదిదూరాన చెరువొండు గలయజూచి
పిల్లతెమ్మెరల్ చల్లగ వీచునట్లు
చిగురుటాకుల సెజ్జను చేర్చియుంచి
పూలతోటను బిడ్డను బొదివిపెట్టి
అమ్మముదమంది జలమున కరుగుచుండె
తాకరానికులాన నుద్భవము గనుట

నెత్తిదైన భిక్షుకురాలు విస్మరించె.
చెరువుదగ్గఱకేగి హర్షించి తల్లి
ఆత్రమున నీరుగైకొని అరుగుచున్న
శ్రవణములఁజొచ్చె కఠినదుర్భాషలపుడు
"మాలముండ! మాదొరువును మైలచేసి
అదుగబెదురు లేకెచ్చటి కరుగుచుంటి
వేమి! ఆగుమాగు మట నీకెంతపొగరు?"
అనిమేషాన స్మరియించె నంటరాని
కులము తనదాట పాపమా నెలఁత, యంత,
ఆక్షణంబున నాగి పాపాత్ము నెదుట
నిశ్చలంబుగ భిక్షుకి నిలిచియుండె
కఠినహృదయుం డనాథపై కఱ్ఱనెత్తె
ఒక్కదెబ్బ క్షామ్యత్పాత్ర ముక్కలయ్యె
తలపగిలి బొటబొటని రక్తంబుపారె
బొబ్బరించి భిక్షుకురాలు మూర్ఛజెందె.

—పరుచూరి వెంకటసుబ్బయ్య.




## సాతాని జియ్యరు

కోడితో మేలుకొని
    తానమాడి నుదుట
దిరుమణియుఁ దిరు
    చూర్ణముఁదీర్చిదిద్ది
యొక్క కేలను
    దంబుఱ నొక్క కేలఁ
జిఱుతలంబూని
    నున్నని శిరముపైని
తొలగకుండ నక్షయ
    పాత్ర నిలిపి మేలు
కొలుపులంబాడి
    వీథివీథులను దిరిగి
యనుపదమ్మును
    'రంగరంగా' యటంచుఁ
గడపగడపకునేగి
    భిక్షమ్ముఁ గొనుచుఁ
జేరవచ్చెను సాతాని
    జియ్యరదుగొ.

—'తొలకరి' నుండి.

# శూరఖడ్గము

నెపోలియన్ చక్రవర్తి జర్మనీదేశమును జయించి, ఆస్ట్రియాదేశమును స్వాధీనపరచుకొనుటకై సేనాసమేతముగా 'స్కోన్‌బ్రన్' నగరమందొక రాజభవనమున మకాముచేసియుండెను. ఆస్ట్రియారాజుతో సంధికై రాయబారములు నడుచుచుండెను. రాయబారముల అంతు తేలనందున చక్రవర్తికి ఆత్రము హెచ్చుగానుండెను. ఈ అవస్థలో రాజభవనమందొకమూల చక్రవర్తి ఒంటరిగా దీర్ఘాలోచనాపరుడై కూర్చుండెను.

* * *

నూనూగుమీసాల నవయువకుడొకడు నెపోలియన్ విడిసియున్న భవనములోపలికి నదురు బెదురు లేకుండా చొచ్చుకొనిపోవుచుండెను. అతని వయస్సు సుమారు పదునెనిమిది సంవత్సరములుండవచ్చును. పహారాజవానులాయువకుని అటకాయించిరి.

ప. జ:—నీ వెవ్వడవు? ఎచటికిపోవలెనని నీయుద్దేశము?

యువ:—(నిర్లక్ష్యముగా) నాకు మీతో పనిలేదు. నేనెవ్వడనైతే మీకేమి? నేను నెపోలియన్ చక్రవర్తి దగ్గరకు పోతున్నాను. అక్కడికెడితే అన్నిసంగతులు మీకే తెలుస్తాయి.

పహారాజవానులు ఆ యువకుని అరెస్టుచేసి సోదా చేశారు. అతనిదగ్గర పొడుగుపాటి శూరఖడ్గము, ఒక యువతీమణిచిత్రము దొరికినవి. జవానులాతని చక్రవర్తిదగ్గరకు తీసుకొనిపోయారు. నెపోలియన్ అతని ముఖమును తేరిపారిచూచాడు. యౌవనలాలిత్యము, కార్యదీక్ష ఆయువకునియందు మూర్తీభవించియున్నటుల చక్రవర్తి గుర్తించాడు.

* * *

చక్రవర్తి:—యువకుడా! నీవెవ్వరవు? నీపేరేమి?

యువకుడు:—(అతిమర్యాదగా) నేనొక జర్మనుయువకుడను. నా పేరు ఫ్రెడరిక్ స్టాప్స్. నా తండ్రి నైరోలిస్‌పట్టణమందొక మతప్రచారకుడు.

చక్ర:—అయితే నీ విక్కడి కెందుకొచ్చావు?

యువ:—ఎందుకా? నీప్రాణాన్ని తీయడానికి.

చక్ర:—(అదరిపడి)—ఏమిటీ! నాప్రాణాలుతీస్తావా! నీకేమైనా పిచ్చెత్తిందా? లేక వెర్రెత్తిందా? అదీ కాకపోతే ఏమైనాజబ్బా?

యువ:—నాకు పిచ్చిలేదు. వెర్రిలేదు. జబ్బంతకన్నా లేదు. పూర్ణమైన తెలివితేటలతో బుద్ధిపూర్వకంగా నిన్ను చంపడానికే వచ్చాను.

చక్ర:—నన్నెందుకు చంపదలచినావు? నేను నీకేమి అపకారము చేశాను?

యువ:—ఎందుకా? నాదేశాన్ని నాశనం చేస్తున్నావు కనుక. జనాన్ని నాశనంచేసే ఈ యుద్ధాలేమిటి?

చక్ర:—ఏమిటీ. నీదేశాన్ని నాశనంచేస్తున్నానా?

యువ:—ఆ! అవును. నాదేశాన్నే, నాజర్మనీదేశాన్ని, దేశభక్తులగు జర్మనులదేశాన్ని.

చక్ర:—ఓ యౌవనుడా! ఈ బుద్ధి నీకేపుట్టినదా లేక నిన్నెవ్వరైనా ప్రేరేపించినారా?

యువ:—నన్నెవ్వరు ప్రేరేపించలేదు. నాకు పుట్టిన బుద్ధే ఇది. నిన్ను హత్యచేస్తే నాజన్మభూమియైన జర్మనీదేశానికి, యూరోపుఖండానికీ కూడా మహత్తరమైన ఉపకారం చేసినవాడనవుతానని నా అంతరాత్మ చెపుతోంది.

చక్ర:—(నిశ్చేష్టుడై)—నన్నిదివరకెప్పుడైనా చూశావా?

యువ:—ఆ! చూశాను. ఇర్‌ఫర్టుపట్టణంలో. అప్పుడు నీధైర్యసాహసాలకీ, నీ యుద్ధనైపుణ్యానికీ చాలా ఆనందించి నిన్ను ఆరాధిస్తూ ఉండేవాడిని. అప్పట్లో నీ వింక యుద్ధాలు చెయ్యవనుకున్నా.

ఫ్రెడరిక్ సాహసాన్ని నిశ్చయత్వాన్ని చూచి చక్రవర్తి దిగ్భ్రమచెందేడు. ఆయువకు డున్మాదుడేమోనని సంశయం కలిగింది. రాజు తలుచుకుంటే దెబ్బలకేమి కొదువ? చక్రవర్తివద్ద ఉండే ఘనవైద్యులంతా పరీక్ష చేశారు. కాని ఉన్మాదలక్షణాలేమీ కనుపించలేదు.

ఆతడున్మాదుడుకాడని వైద్యులు నిర్ధారణ చేశారు. 'వైద్యమెందుకు? నే నాసంగతి ముందే చెప్పానుగా!' అని ఆయువకుడు రెట్టించాడు. చక్రవర్తి మనస్సు కలవరపడడం ఆరంభించింది. ఆ యువకుని ధైర్యసాహసములు, అచంచలత్వము చక్రవర్తికి ఆశ్చర్యమును కలుగచేశాయి. హంతకులయెడల నెపోలియన్ ఎప్పుడూ దయాదాక్షిణ్యాలుచూపి ఎరగడు, కాని ఫ్రెడరిక్ యౌవనము, ధీరత్వము ఆయనయం దొకగొప్పమార్పును కలుగజేసినాయి. దేశభక్తిప్రేరితుడును, సాహసాంకుడునగు ఆ నవయువకుని ప్రాణములతీయుట కాయన మనసొప్పకుండెను. ఆ యువకునియం దొకవుడ్రుకను పడడు. ఒక కక్షీ లేదు. ఏదేని యొక మహత్తరసిద్ధాంతమును స్థైలపరచుచున్నాడాయనిన అదీ లేదు. ఆ సందర్భములో తనదేశహితమును కోరేటటువంటి యువకుని తుపాకి కెరవేయడం అంటే చక్రవర్తికి పచ్చివెలక్కాయ గొంతుకపడినటులుండెను. ఎంతసేపాలోచించినా ఈ సమస్యకు సమాధానంరాలేదు. ఆ అవస్థలో సీజరు చక్రవర్తి హత్యకుకారకుడైన బ్రూటస్ నెపోలియన్ కండ్లఎదుట స్వప్నప్రాయముగా కనబడినాడు. ఆనాటి బ్రూటసే నేడు ఫ్రెడరిక్ రూపంలో జర్మనీదేశంలో అవతరించాడా అనే భ్రమ కలిగింది. ఇంతలో ఒక్కసారిగా నెపోలియన్‌యందున్న సహజధైర్యం ప్రకోపించింది. అనామకుడైన ఎవడో ఒక యువకుని బెదరింపులకు అదరడం ఎందుకని మనస్సును చిక్కబట్టుకున్నాడు. ఏలాగైనా ఆ యువకుని ప్రాణమును కాపాడవలెనని ఆతనితో సంభాషణ మొదలుపెట్టాడు.

చక్ర:—ఓ యువకుడా! నిన్నెవ్వరో ఈ పాడుపనికి ప్రేరేపించినటులు కనబడుతుంది. ఈ హంతకకార్యమువలన నువ్వు, నీకుటుంబంకూడా నాశనమైపోతారు. హంతకులను సామాన్యంగా నే నెప్పుడూ క్షమించను. కాని నీయౌవనకోమలత్వం, నీధైర్యం చూచి నా మనస్సు కరిగింది. క్షమాపణవేడుకో, నీప్రాణాన్ని రక్షిస్తాను. కాస్తంత పశ్చాత్తాపమును సూచిస్తే చాలు. నేను క్షమిస్తాను.

యువ:—ఓహో! క్షమాపణా! ఎందులకా క్షమాపణా? నీదయాదాక్షిణ్యములు నాకక్కరలేదు. నా కణుమాత్రమైనా పశ్చాత్తాపం కలగడంలేదు. కాని నాప్రయత్నం విఫలమైనందుకుమాత్రం చాలా విచారపడుతున్నాను!

చక్రవర్తి తోకత్రొక్కిన త్రాచులాగున ఉగ్రుడైపోయాడు. "ఛీ, రాక్షసీ! మహాద్రోహము తలపెట్టికూడా నీకు పశ్చాత్తాపము కలుగుటలేదా? సరే" అని హుంకరించాడు.

"ద్రోహమా? నిన్ను చంపితే ద్రోహమా? కాదు. కాదు! ముమ్మాటికి కాదు! అపరాధమేమియులేదు సరిగదా బ్రహ్మాండమైన ప్రజాసేవకూడాను." అని ఠీవిగా, నిష్కర్షగా ఫ్రెడరిక్ జవాబిచ్చాడు.

నెపోలియన్ ఆ యువకునివద్ద దొరికిన యువతి చిత్రాన్ని చేతబట్టి తదేకదీక్షతో చాలాసేపు పరీక్షించి "హూం! హూం! ఈ బొమ్మ ఎవరిది?" అని అడిగాడు.

"నేను ప్రేమించుచున్న యువతి."

"నీదారుణకృత్యాన్ని ఆమె అంగీకరిస్తుందా?"

"ఆహా! పని పూర్తికాలేదని విచారిస్తుంది కూడాను. నాకన్న ఆమెకే నీవంటే పరమసహ్యం."

ఈ సంభాషణ చక్రవర్తికి మరింత సంకటము కలిగించింది. గోరుచుట్టుమీద రోకటిపోటయింది. అయినా ఆచిత్రంలోని యువతీమణి సౌందర్యాన్నిచూచి ఆనందిస్తూ అదివరలో కలిగిన ఆగ్రహాన్ని శాంతపరిచాడు. 'ఆ యువకునికి నామీద ద్వేషముంటే ఉండుగాక! నే నాతని క్షమించకూడదా?' అని తనలో తానే ప్రశ్నించుకున్నాడు. క్షమిస్తేనే మంచిదని నిశ్చయించుకున్నాడు. చిత్రాన్ని చేత్తోపట్టుకుని "ఓ యౌవనుడా! నిన్ను నేను క్షమించినటులైతే ఈ యువతి చాలా సంతోషిస్తుందనుకుంటాను! ఏమంటావు?" అని అడిగాడు.

ఫ్రెడరిక్ ఆశ్చర్యముతోనూ, సంభ్రమముతోనూ చక్రవర్తికేసి తేరిపారిచూశాడు.

"ఓహో! అయితే చివరకు నిన్ను నేను చంపగలనన్నమాట" అని సంతోషముతో జవాబిచ్చాడు.

నెపోలియన్‌కు కోపం, విసుగు వచ్చింది. 'నీ కర్మం నీదే పో' అని ఫ్రెడరిక్‌ను తన ఎదుటినుండి పంపేశాడు.

* * *

ఎదుటలేకపోయినా ఫ్రెడరిక్ మూర్తి నెపోలియన్‌కు ప్రత్యక్షమగుచునే యుండెను. ఏరాజకార్యాని కుపక్రమించినా ఆ యువకుని ధీరవర్తనమే ఆతని స్మృతికి వస్తూవచ్చింది. ఎంత ప్రయత్నించినా మరపు అసంభవమైపోయింది. చక్రవర్తి ఆత్మపరీక్ష చేసుకున్నాడు. ఆ యువకుడు తనపాలిటి హెచ్చరిక దేవతేమోనని సంశయించడం ప్రారంభించాడు. అపశకునసంబంధమగు నేదో యొక అనుమాన మాతని బాధించుచుండెను. ఆ యువకుని ప్రాణమునుకాపాడు నుద్దేశ్యముతో మరల వైద్యపరీక్ష చేయించెను. కాని రోగచిహ్నమావంతయైన కనుపించలేదు పశ్చాత్తాప మసలేలేదు. క్షమాపణకన్న చచ్చిపోతే మేలని ఆ యువకుడు భీష్మించియుండెను.

* * *

యూరోపుఖండము నంతటిని గజగజ లాడించిన నెపోలియన్ సామ్రాట్ ప్రాణముల తీయుటకై ప్రయత్నించినందులకు ఫ్రెడరిక్‌స్టాప్సునకు మరణదండన విధింపబడెను. మరునాటి ఉదయమున రాజభవనమున ఆస్ట్రియాసంధిపత్రముపై సంతకములు చేయబడెను. వేరొకచోట ఫిరంగిఎదుట ఫ్రెడరిక్ నిలబడియున్నాడు. అతనిచేతులను సంకెళ్లు బంధించినవి. అధీర యువకుని ముఖమునం దణుమాత్రమైన విచారచిహ్నము కనుబడుట లేదు. ఫిరంగి 'ఢాం'మని బ్రహ్మాండము బ్రద్దలగునట్లు శబ్దముచేసినది. కాని ఆయువకుని జయధ్వానము ఫిరంగిశబ్దమును ముంచివేసినది. "నిరంకుశత్వ మంతమగుగాక !" అను ఆయువకుని నోటినుండి వెలువడిన శబ్దము మిన్ను ముట్టినది.

* * *

నెపోలియన్ చక్రవర్తి దిగ్విజయయాత్ర ముగిసినది. ఫ్రెడరిక్‌స్టాప్సుదగ్గరనుండి గ్రహింపబడిన శూరఖడ్గము ప్యారిస్ రాజభవనము నలంకరించినది. నెపోలియన్ జీవించినంతకాలము 'నిరంకుశత్వ మంతమగుగాక' యను మాట లాతనిచెవులలో గింగురుమనుచునేయుండెను.

* * *

నిరంకుశత్వ మంతమైనది. ఫ్రెడరిక్ కోరిక సిద్ధించినది. యూరోపులోని సామ్రాజ్యములను గడగడ లాడించిన 'పురుష' ఇరువదిసంవత్సరములలో సెంటుహెలీనా దీవియందు బ్రిటిష్‌వారి బందీయై నికృష్టజీవనము గడిపి నిర్భాగ్యుడై మరణించెను.

—శ్రీ ద్వివేడి లింగరాజు.



# సర్ థోమస్ లిప్టన్

[పుట్టుదరిద్రుడు. తేయాకువర్తకముచేసి తనకు ముప్పదివత్సరములు వచ్చు సరికి కోటీశ్వరుడైనాడు.]

లిప్టన్ నామము చెవినిపడినతోడనే మనకు అన్ని దుకాణములందును అమ్మబడు ఎఱుపు, పసుపు, ఆకుపచ్చరంగుల తేయాకుడబ్బాలు కళ్ళకుకట్టినట్లు అగపడును. ప్రపంచమునందలి మూలమూలలకు వ్యాపించిన ఈ తేయాకు డబ్బాలతో విడువని సంబంధముగల ఈ లిప్టన్ ఎవరు? లిప్టన్ మార్కు తేయాకు నుపయోగించు పలువురకు లిప్టన్ ప్రపంచమునందలి కోటీశ్వరులగు వణిక్పుంగవులలో నొకడని తెలిసినను ఆతడు తొలుత కూటికిలేని పేదవాడనిగాని, స్వయంకృషిచే నాతడింతవాడైనాడనిగాని తెలియదు. లిప్టన్ చరిత్ర నిజముగా విచిత్రమైనది. నూరుపౌనులు అప్పుతెచ్చి షాపుపెట్టి పదిసంవత్సరములలో కోటీశ్వరుడైన ఈతని చరిత్ర నవలవలె చదువనైయున్నది.

లిప్టన్ తలిదండ్రులు ఐరిష్ దేశీయులు. ఆ దంపతులు స్వదేశమున గడవక పొట్టలుపట్టుకొని 1846-వ సంవత్సరమున స్కాట్లండుదేశపు పట్టణమగు గ్లాస్గోకు వచ్చి వలసనెలకొనిరి. నానాకష్టములు పడుచు దినములు వెళ్ళబుచ్చుచుండ వారికి 1850-వ సంవత్సరమున ఒకకొడుకుపుట్టెను. ఆతని నామము థోమస్ జాన్స్టన్ లిప్టన్. ఆతడే మనప్రస్తుతకథానాయకుడు.

కడుపునిండ తిండికే నోచని ఆ బాలునకు విద్యాసౌకర్యము లెట్లు కలుగును? పాఠశాలలోనున్న పదిరోజులలో నాతడు తోడివిద్యార్థులనుండి నేర్చుకొనినది అమెరికాదేశపు రాజధానీనగరమగు న్యూయార్కు పట్టణమున రోడ్లు బంగారముతో వేయబడియుండునని. తొమ్మిదివత్సరములు వచ్చుసరికి - తోడిబాలురు పాఠశాలలో విద్యాసముపార్జనము చేయుచుండ - లిప్టన్ వారమునకు అరక్రౌను జీతముతో ఒక కంపెనీనుండి మఱియొకకంపెనీకి వార్తలు, లేఖలుకొనిపోవు జవాను వృత్తిలో కుదిరియుండెను.

అయితే తన దురదృష్టపరిస్థితులనుగూర్చి లిప్టన్ ఆ సమయమున ఎప్పుడును నిరుత్సాహముపొందలేదు. భావికాలమున తానెట్లో గొప్పవాడను కాగలనను భావము ఆతనికుండెను. తా నత్యంతపూజ్యభావముతో తిలకించు తనతల్లితో నాతడు ఇప్పటికి డెబ్బదియేండ్లకు పూర్వము - అనగా లిప్టన్ కు పండ్రెండేండ్లప్రాయమున - ఇట్లనెను: 'అమ్మా! నేను పెద్దవాడనైనపుడు నీకు కట్టుటకు పట్టుబట్టలను, ఉండుటకు ఒక పెద్ద ఇంటిని, నీ ఆజ్ఞలు నెరవేర్చుటకు సేవకులను సమకూర్పగలను.'' పండ్రెండేండ్ల బాలుని ఈవెడతొక్కు పల్కులకు ఆతని తల్లి ఒకటిరెండు రెప్పపాట్లకాలముమాత్రమే సంతోషించెను. కాని అంతలో తమ అప్పటి దరిద్రస్థితి జ్ఞప్తికిరాగా తిరిగి ఆ మెముఖము చింతాముద్రితమయ్యెను. ఆ బాలుని వాక్యములు అచిరకాలముననే నిజముకానుండుట అప్పు డాతల్లి నమ్మినదా?

పదునొకండవ వత్సరమున లిప్టన్ ఇటికల ఆవముల యజమానివద్ద పనికి కుదిరెను. జీతము మునుపటికంటె ఒకక్రౌను ఆరుపెన్నీలు అధికము. కొంచెము అనుభవము కలుగగానే తనకాపనియందు హెచ్చుజీతము రావలసియున్నదని ఆతడు తలంచెను. కనీసము ఒక షిల్లింగు అయినను ఎక్కువచేయవలసినదిగా ఆతడు యజమానిని కోరెను. యజమాని జీతము హెచ్చుచేయుటకు అంగీకరింపలేదు. అపుడు లిప్టన్ దృష్టి అమెరికాపైకి ప్రసరించెను.

ఇప్పటి కాతనికి పదునాఱవ వత్సరము. పాఠశాలలో తోడి విద్యార్థులవలన న్యూయార్కులో రోడ్లు బంగారముతో వేయబడియుండునను కట్టుకథలను వినియున్నాడుగదా! వలసపోవువారిని గొనిపోవు ఒక ఓడమీద



సర్ థామస్ లిప్టన్

నెక్కి ఆతడాబంగారుభూమికి ప్రయాణమయ్యెను. ఓడలో తోడిప్రయాణికులకు వారివారి ఇండ్లకు ఉత్తరములువ్రాయుటయందును, అస్వస్థులైనవారికి పరిచర్య చేయుటయందును పర్యాప్తుడై ఆతడు వారి ప్రేమను సంపాదించెను. తోడిప్రయాణికులతో నాతడు న్యూయార్కునందలి కాసెల్ గార్డెనునందు దిగెను. తోడనే ఆతనికి దూరపుకొండలు నునుపు అను సామెత సార్థకమైనదనుట తెలియవచ్చెను. కాని ఆతడు నిరుత్సాహపడలేదు.

న్యూయార్కు పట్టణము. ఆకాశమంటు మేడలు. ప్రజలు త్వరజీవనులు. అడావుడి, చప్పుడు. స్వశక్తియందు నమ్మకము, పనులు చేయుటయందు చొఱవగల లిప్టన్ జేబులో అప్పటికి వ్రేళ్ళపై లెక్కింపగల కొన్ని షిల్లింగులుమాత్రమే ఉండెను. ఆతని భావి కార్యక్రమమున కంతకును అవియే ఆధారము. వానిని ఖర్చు పెట్టకుండ ఆ మహాపట్టణములో భోజనము, బస సమకూర్చుకొనుట యెట్లు?

ఆతడు మిక్కిలి చవకగా తిండిపెట్టు వాషింగ్టన్ స్ట్రీటునందలి ఒక బోర్డింగు హోటలునకు పోయెను. ఆ హోటలు యజమానుని చూచెను. అనంతరకాలమున ఆతనిని కోటికి పడగఎత్తించిన బుద్ధిబల మాతనికిప్పట్టున ఒక చక్కని ఉపాయమును సూచించెను. హోటలు యజమానునితో నిట్లు చెప్పెను: "ఇప్పుడే స్కాట్లండునుంచి ఈదేశమునకువచ్చిన కొందఱు ప్రయాణికులతో నాకు మంచి పరిచయముగలదు. వారు నేను చెప్పినమాట విందురు. వారిలో పది పన్నెండుగురిచే మీహోటలులో కాతా పెట్టించినచో పనిదొరుకువఱకు నాకు మీ హోటలులో ఉచితభోజనము పెట్టించుచు బస యిత్తురా?" హోటలు యజమానుడు ఈ ప్రశ్నవైచిన యువకుని తేరిపారచూచెను; చిఱచిఱలాడుచు 'సరే' అని అఱచెను.

భోజనవిషయమున, బసవిషయమున ఆతడు తన షిల్లింగులను వెచ్చింప నవసరములేదు. తనతో వచ్చిన వారిలో పదముగ్గురు ప్రయాణికులు ఆ హోటలునందు నివసించునటుల ఆతడు చేయగలిగెను. తాను 'ధర్మపిండము' గుడుచుచుండెను. పనిదొరుకుట ఇంత సుకరముకాలేదు. విరామమెఱుగని దీక్షతో ఆతడు పనికొఱకు అన్వేషించుచుండెను. వీధుల మూలలయందు వార్తాపత్రికల నమ్ముటకు మొదలిడెను. కాని ఇది స్థిరమైనవృత్తికాదు. ఈపనికాదని వేఱొకటి. వర్జీనియాలో, న్యూ ఆర్లీన్సులో పని చేసెను. ఎక్కడ ఉన్నను ఏపనిచేయుచున్నను ఆతడు మిక్కిలి పొదుపుగా జీవించుచుండెను. కూడబెట్ట గలిగినచో చిన్నానాణెమును కూడ నాతడు కూడబెట్టుచుండెను. దక్షిణ కారొలినాయందలి వరిచేలలో పనిచేయుటకు కూలివాండ్రువలయునని ఎవరో చెప్పగా న్యూయార్కునుండి అచటకు కూలివాండ్రను పంపు ఏజెంటువద్దకుపోయి మాటలాడి అందుచేరెను. దక్షిణ కారొలినా పరిస్థితులెట్టివో ఆతనికి తెలియదు. రెండు రోజులు రైలుప్రయాణముచేసి అత డాప్రదేశము చేరినపుడు అది ఆపభూమియగుట తెలిసికొని ఆతడు పొందినదిగులు మనము సులభముగా ఊహించుకొనవచ్చును. కాని ఆతడు పుయిలోడలేదు. పనిదొరికినది;

## కంటి చూపు

మెలకువనుఁబరుండి మిలుకు, మిలుకుచూచు
కనుముడిచి మదినెంచి నఱ్ఱగవిసి చూచు
ఓష్ఠము మునుపంటఁగొరకి యోరజూచు
పైట సవరించి సిగ్గులఁ జాటిచూచు
సందుగొందులఁడాగి కఱసన్నఁ జూచు
ఎదురయినఁ జూచు వెనువెంట బెదరిచూచు
ప్రక్కను నిలచి క్రీగంటఁ బలుచఁజూచు
తొలగిపోవుచు నొకసారి తొంగిచూచు
తరలిపోవుచు భ్రమదోడఁ దిరిగిచూచు
విడచిపోలేక నావంక వెఱ్ఱిఁజూచు
కంటదడివెట్టి హృదయంబుఁ గలచిచూచు
వెఱ్ఱిచూపుల నిన్నెట్లు విడచి నిలతు.

—మిత్తింటి నరసింహమూర్తి, బి.యల్.

నిస్పైనజీతము వచ్చుచున్నది. అగుటచే నాతడచటి భరింపరాని వేడిని భరించెను; అచటి వాతావరణము నందలి వ్యతిక్రమములకు ఓర్చెను. కాటుతో జ్వరమును ప్రసాదించిపోవు రాత్రింబవళ్ళు వీరవిహారములు సల్పు అచటి దోమలతో సరిపెట్టుకొనెను. వారమునకు ఆరురోజులు పని; అయినను విశేషముగా మిగుల్చుకొనుటకు పెద్ద జీతముకాదు. మూడేండ్లు కాలక్షేపము చేసెను. ఈ దినములలో ఆతని ఆరోగ్యము పూర్తిగా చెడెను. అచటి డాక్టరు ఆతని యజమానులతో కొద్దిదినములలో లిప్టన్ శవమును చూచుట వారి కోరికయేని ఆతని నింకను పనిలో ఉండనీయవచ్చునని చెప్పెను. అందుమీద యజమానులాతనిని పనినుండి తొలగించిరి. తిరిగి యాతడు న్యూయార్కు చేరుకొనెను. జీవముగల అస్థిపంజరమనిమాత్రము చెప్పవచ్చు స్థితిలోనున్న అతని కిప్పటివయస్సు పందొమ్మిదివత్సరములు. జేబులో కొద్ది డాలరు నాణెములుమాత్రము గలగల లాడుచుండెను.

కారొలినా ఆవభూములలో నాత డారోగ్యము చెఱచుకొనినను విశేషమైన లోకానుభవమును సంపాదించుకొనెను. మానవప్రకృతిని బాగుగా ఆకళించెను. ఇతరులకై శ్రమపడుటకంటె తనకై కష్టపడుట జయశిఖరమందుటకు మార్గమని అతడు గ్రహించెను. గృహమునుండి ఆకలిచిచ్చును తొలగించు ప్రయత్నమున వాడి వత్తలగుచుండు తనతల్లి ముఖమండలము ఆతనికి పొడగట్టెను. తోడనే యాతడు గ్లాస్గోకు పయనమకట్టెను. చెమటఓడ్చి కూడబెట్టిన నూరుడాలర్లధనము; తనపై నిరంతరము ప్రేమనువర్షించు తనతల్లి ఉపయోగమునకై ఒక ఊగెడు పడకకుర్చీ, ఆమెరొట్టెలు చేసికొనుటకై ఒక బస్తాడుపిండి. వీనితో ఆతడు ఓడ నెక్కెను.

ప్రయాణావసరమున సముద్రపుగాలి ఆతనికి మంచి పనిచేసెను. తిరిగి ఆతడు వెనుకటి ఆరోగ్యమును పొందెను. శక్తి, ఉత్సాహములతో ఉత్తరంగితుడగుచు నాతడు మూడేండ్లకు తిరిగి మాతృవదనమును గాంచెను. తాను గ్లాస్గోలో దుకాణము పెట్టదలచితిననియు, అందుకుగాను నూరుపౌనులు అప్పీయవలసినదనియు నాతడు బంధువుల నడిగెను. ఆతడు - చూడవచ్చిన - పందొమ్మిదివత్సరములవాడు. బంధువులన్ననో ఏమంత ధనికులుగారు. అయినను అతనిశక్తియందుగల నమ్మకముచే వారు అతడు కోరినధనమును ఎట్లో కష్టపడి తెచ్చియిచ్చిరి.

ఆధనముతో నాతడు గ్లాస్గోయందలి స్టాబ్‌క్రాసు వీథియందు ఒక చిన్ని తేయాకు దుకాణమును తెఱచెను. దానిని అందముగాను శుభ్రముగాను ఉంచెను. 'మాచుటకు దుకాణము ఆకర్షణీయముగనుంచుట వ్యాపారాభివృద్ధికి పునాది' అని ఆతడు తఱుచు అనుచుండువాడు. 'దుకాణములోనికి వస్తువులుకొనుటకు వచ్చు కాతాదారులవిషయమున మనముచూపు గౌరవాదరములమీదగూడ వ్యాపారాభివృద్ధి చాలవఱకు ఆధారపడియుండునని ఆతడు చెప్పుచుండువాడు. తన దుకాణమున కాతడు లిప్టన్‌మార్కెట్టు అని పేరిడెను. అమ్మెడువస్తువులు తేయాకు, కాఫీవిత్తులు, ఉప్పువేసి పొగలోకట్టిన పందిమాంసము (బేకన్) మొదలగు పలు సరుకులు.

దుకాణములో ఆతడుగాక ఇక పనివారెవరు? ఒక పిల్లవాడును, ఒక నల్లపిల్లియు. దుకాణము పెట్టిన క్రొత్తలో రాత్రులయందు ఆతడు దుకాణమునకు వెనుకను నిద్రించువాడు. ప్రకటించి వ్యాపారాభివృద్ధి చేయుటయందు అతనికి గొప్ప నమ్మకముండెను. హాస్యవర్ధకముగా ప్రకటించుటయందు ఆతనికి ఇష్టముమెండు. అట్టి ప్రకటనలు జనులదృష్టిని విశేషముగ ఆకర్షించుట లిప్టను అనుభవము. వ్యాపారము ప్రారంభించిన క్రొత్తలో లిప్టన్ వార్తాపత్రికలలో ప్రకటనలు వేయజాలకుండెను. కావున నాతడు కరపత్రముల నచ్చువేయించి స్వయముగా రోడ్లమీద వచ్చుచుపోవుచుండు జనులకు పంచిపెట్టెడివాడు. ఆ దినములలో అన్ని పనులు అతడే చేసికొనువాడు. ఇతరులనుపెట్టి పని చేయించుకొనుపాటిస్థితి ఇంకను ఆతనికి కలుగలేదు. కాని అచిరకాలముననే అతడు వార్తాపత్రికలయందు ప్రకటింపదొరకొనెను. వార్తాపత్రికలో ఆతని మొదటి ప్రకటనకు ఏడుషిల్లింగుల ఆరుపెన్నీలు చార్జి అయినదనియు, తాను క్రొత్తగా కొని అమ్మజూపిన 'ఉప్పు

వేసి పొగలోకట్టిన పందిమాంసము' మొదలగువాని శ్రేష్ఠత్వమును అది వర్ణించినదనియు ఆతనికి బాగుగా జ్ఞాపకముండెను.

తన దుకాణపుప్రదర్శనగవాక్షమునందు తానమ్మెడు వస్తువులనుగూర్చిన హాస్యరసాత్మకములగు కార్టూనులను ప్రకటించుట కాతడు ఆ తొలిదినములలో పూనుకొనెను. ఆతని ప్రకటనరీతులు కొన్ని ముచ్చటగానుండును. దుకాణములో ఆతడు రెండు అద్దములనుంచెను. ఒకదానియందు బక్కచిక్కిన ఆహారపుష్టిలేని మానవచిత్రము ప్రతిబింబించుచుండెను. రెండవదానియందు ఆహారపుష్టిగల లెస్సగా బలసిన విగ్రహము ప్రతిబింబించుచుండెను. చిక్కిన విగ్రహము లిప్టనుషాపులోనికి పోవుచుండినట్లును, బలసిన విగ్రహము షాపునుండి బయటకు వచ్చుచుండినట్లును ప్రదర్శింపబడెను.

ఆతని ప్రకటనరీతులలో విచిత్రమైనది మఱియొకటి. చమురుగ్రక్కునట్లు కొవ్వుపట్టి బలిసిన రెండు పందులపైన—మన దేశపు గంగెద్దుమీదనువలె—గుడ్డలువైచి ఆగుడ్డలమీద 'లిప్టన్‌గారి అనాథశిశువులు' అను అర్థమువచ్చు పదములువ్రాసి, ఆపందుల మెడలలో గులాబిరంగు రిబ్బనులు వ్రేలాడవైచి గ్లాస్గోయందలి జనాకీర్ణములగు వీథులవెంబడిని పొటలవర్ణపు దుస్తులు తొడిగిన ఇద్దఱు ఐరిష్ దేశీయులచే త్రిప్పించువాడు. గుఱ్ఱుగుఱ్ఱుమనుచు, కీచుకీచు మనుచు ఆపందులు వీథులవెంబడిని తిరుగాడుచుండగా గ్లాస్గో ప్రజలు విరగబడి చూచువారు. ఒకొక్కప్పుడు ఈపందుల నడుమ మూడవమనిషి ఒకడుండువాడు. ఆతని చేతిలో ఒకజెండా. ఆజెండాపై 'మేము లిప్టన్‌మార్కెట్టునకు బోవుచున్నాము. మీరుకూడ రండు' అను వాక్యములుండునవి. జనులు కూడవచ్చువారు. ఎల్లవేళల లిప్టన్ దుకాణము ఖాతాదారులతో నెట్టుకొని యుండునది.

ఈక్రొత్తమాదిరి ప్రకటనలతీరు లిప్టన్ అమెరికానుండి గ్రహించినది. కాని ఈక్రొత్త ప్రకటనలను గ్లాస్గో ప్రజలలో కొందఱు ఈసడింపక పోలేదు. అయిననేమి? ప్రజాదృష్టి నాకర్షింపవలయునను లిప్టన్ వాంఛ పూర్తిగ నెఱవేఱెను. ఒకనాడు లిప్టన్ పందులలో నొకటి ట్రాములైనుకు అడ్డముగాపడెను. ట్రాము ఆగిపోయెను. పంది ఓపట్టున ఇవతలకురాలేదు. చుట్టును జనులు మూగిరి, ఈవిషయము వార్తాపత్రికలకు ఎక్కెను. లిప్టన్ దుకాణమునకు కావలసినంత ప్రచారము కలిగెను. వ్యాపార మభివృద్ధి చెందెను. దుకాణము ఆరంభించుటకు తాను గొనివచ్చిన నూరు పౌనుల అప్పును తీర్చివైచెను; గ్లాస్గో పట్టణమందలి పెద్ద వీధిలో పెద్దదుకాణమొకటి స్థాపించెను.

“వ్యాపారనిర్వహణమున నా ఆదర్శములు రెండు. ఒకటి కొనుటగాని, అమ్ముటగాని రొక్కపూర్వకముగానే చేయుట—కొనుటలోగాని, అమ్ముటలోగాని మధ్యస్థునిపై ఆధారపడకుండుట. మధ్యస్థునిపై ఆధారపడకుండుటకై ఐర్లాండుదేశమున నాకొఱకు వెన్న, గ్రుడ్లు మొదలైనవికొనుటకు ఏజెంటును నియమించితిని. ఒకసారి ఈ యేజెంటు నన్ను విషమస్థితిలో బెట్టెను. నాస్థితికిమించి సరుకును కొనుగోలుచేసెను. బిల్లువచ్చుసరికి ఇచ్చుటకు నాకడ డబ్బులేకుండెను. అప్పటి నా ఆస్తిలో విలువయైనది ఒక వెండిగడియారము మాత్రముండెను. దానిని గొనిపోయి తాకట్టుపెట్టితిని. ముప్పది షిల్లింగులు వచ్చెను. ఒడంబడిక నిలుపుకొనుటకు ఆ సొమ్ము బొటాబొటీగా సరిపోయెను. అయితే అచిరకాలముననే నేనాగడియారమును విడిపించుకొనగలిగితిని.” అని లిప్టన్ అప్పటి తన పరిస్థితులనుగూర్చి ఒకసారి చెప్పెను.

గల్లాపెట్టెదగ్గర కూర్చుండి పనిచేయుటకు ఆతడు చాల యిష్టపడువాడు. తన ఖాతాదారుల విషయములను బాగుగా తెలిసికొని వారివారి జన్మస్థలములను దర్యాప్తుచేసి వారివారి ప్రాంతీయభాషామర్యాదలతో స్కాటిష్‌భాషలోగాని, ఐరిష్‌భాషలోగాని ముచ్చటించువాడు. ఆ తొలిదినములలో లిప్టన్‌కు తన ఖాతాదారులతో—సాధారణముగ దుకాణదారునకు ఆతని ఖాతాదారులకును ఉండని—సన్నిహితపరిచయముండెను. ప్రతి ఖాతాదారును లిప్టన్ ఉపయోగించు భాషను బట్టి తన ప్రాంతములనుండి ఆతడు వచ్చినట్లు తలంచు

చుండెను. నిరపాయకరమగు మోసముతో కూడిన ఈ ఉపాయము లిప్టన్ జయమున కెంతయో కారణమయ్యెను.

కష్టపడి పనిచేయుటచేతను, సరసమైన ధరలకు విక్రయించుటచేతను అతని వ్యాపారము దినదినాభివృద్ధిగాంచెను. ఒక్క సంవత్సరములో అతడు తన రెండు షాపులలోను సరకులమ్ముటకు చేరియొక పని వానిని బెట్టి తన పూర్తికాలమును ప్రకటనలకై వినియోగింపగలిగెను. యువకుడు లిప్టన్ తనపథమును తాలుతనే నిర్ణయించుకొనెను. సాధారణమైన జయముతో నాతడు తృప్తిపడదలచియుండలేదు. లోకమునందలి వణిక్పుంగవులలో తానొకడు కావలయునని అతని సంకల్పము. పలువత్సరములు అహర్నిశలు కష్టపడి అతడు సంకల్పసిద్ధుడాయెను. గ్లాస్గోలో ప్రథమమున పెట్టిన ఆతని చిన్నిదుకాణము తరువాత వెలసిన పలు దుకాణములకు మాతృకయయ్యెను. పలుతావులయందలి లిప్టన్ దుకాణములలో అమ్మబడు పలురకముల సరకులను తయారుచేయుటకు లిప్టన్ ఫ్యాక్టరీలు నిర్మించెను; సింహళద్వీపమున తేయాకుతోటలు కొనెను; ఇంగ్లండు దేశమున పండ్లతోటలు విలిచెను. రోడ్లమీద లిప్టన్ మోటారువాన్లు; పలురకముల ఆహారపదార్థములతో నిండిచెక్కుప్రూటైన లిప్టన్ ఓడలు సముద్రముమీద. లిప్టన్ దుకాణమునకు కావలసిన పందిమాంసమును ఐర్లండు దేశమంతయు కలసి సరఫరా చేయజాలకపోయెను; అమెరికాదేశమునుండిగూడ విశేషముగ పందిమాంసము లిప్టన్ మార్కెట్టునకు సప్లయి అగుచుండెను. అమెరికాదేశమున చికాగోనగరమునందు లిప్టన్ నిర్మించిన పందిమాంసపు ఫ్యాక్టరీయందు మాంసము తయారుచేయుటకై ఒక్కనాడు మూడువేలపందులు చంపబడెననుటచే అతని వ్యాపారవిస్తృతిని సరిపోల్చుకొనవచ్చు

అమెరికాదేశపు రైల్వేలయందు అతనికి పెక్కుగుడ్సుబండ్లుండెను. అతని తేయాకు పాకెజీపెట్టెలపై నుండు సీసపుసీళ్ళు తొలగింపబడినపిమ్మట అమ్ముట వలన ఏటేట ఐదువేలపౌనుల ఆదాయమువచ్చుచుండెననుటచే లిప్టన్ వ్యాపారపరిమితిని సులభముగ ఊహించుకొనవచ్చును. లిప్టన్ మార్కెట్టుకుచేర్చి స్వకీయమైన ముద్రణాలయము, సబ్బుల కర్మాగారము, కాగితముల మిల్లు, సీసాలకు తయారుచేయు కార్ఖానా యుండెను. మొదటి షాపుపెట్టిన పదునొకండువత్సరములకు అనగా లిప్టన్ కు ముప్పదియేండ్లువచ్చుసరికి అతడు కోటీశ్వరుడయ్యెను.

కోటీశ్వరుడనైతినని ఆతడు గర్వపడలేదు. చిన్ననాటి తనపేదతనమునుగూర్చి ముచ్చటించుట చిన్నతనముగ నాతడెన్నడును తలంపలేదు. 1897-వ సంవత్సరమున విక్టోరియామహారాణిగారి డైమండు జూబిలీ మహోత్సవసందర్భమున నాతడు లండన్ పట్టణములోని బీదలకు అన్నదానమునకై ఇరువదియైదువేలపౌనులు ధర్మముచేసెను. హిందూదేశములో మహామారివ్యాపించినపుడు వ్యాధిగ్రస్థుల సహాయార్థమై యాతడిట్టిగొప్ప మొత్తమునే యిచ్చియుండెను. స్పెయిను అమెరికాదేశములకు జరిగిన యుద్ధసమయమున నాతడు అమెరికను రెడ్ క్రాసుసొసైటీవారికి గొప్ప ధనసహాయము చేసెను. 1898-వ సంవత్సరమున విక్టోరియామహారాజ్ఞి ఆయనకు 'సర్' బిరుదమిచ్చెను; 1902-వ సంవత్సరమున ఆతనికి బారనెట్టుహోదా ఈయబడెను. ఒకప్పుడు కూటిపేదగానుండిన అతడిపుడు మేటిధనవంతుడై రారాజులతో మైత్రిగలిగి విఖ్యాతచరిత్రుడాయెను.

తన్నుపెంచి పెద్దవానినిగాచేసిన తల్లిదండ్రులనుగూర్చి ఆతడెల్లవేళలగర్వపడువాడు. తనతల్లి గృహమును దాయిాలసంఘమునకు ఇచ్చివేయుచు నాతడు 'నా కీప్రపంచమున ఒక్కపిల్లిగుకూడ మిగులకపోయినను ఈ యింటిని విడనాడుటకు నేను అంగీకరింపను' అని చెప్పెను. తన తలిదండ్రుల ఛాయాపటములు వెంటలేనిది ఆతడు కాలు బయలుపెట్టువాడు కాడు. తనతల్లి ఉపయోగించిన బైబిలు ఆతడు రాత్రులయందు తనపక్కమీదపెట్టుకొనిగాని నిద్రించువాడు కాడు. బాల్యమున తనతల్లికి చేసిన వాగ్దానము నాతడు నెఱవేర్చుకొనగలిగెను. ఉండుటకు దివ్యభవనమును, కట్టుటకు పట్టుబట్టలను, షికారువెడలుటకు బండిని, ఆజ్ఞలు నెరవేర్చుటకు సేవకులనుఇచ్చి తల్లికి ఆతడు అనంతసంతోషము గూర్చెను. దుకాణము పెట్టినక్రొ

త్తిలో లిప్టన్‌కు తల్లి ఉపదేశకురాలు. ఆమె అనుమతినందనిది ఆత డేమియు చేయువాడుకాడు. ఆమె వాక్కు ఆతనికి వేదవాక్కు. సర్ థోమస్ లిప్టన్ భోజనశాలయందు ప్రవేశించుటతోడనే ప్రథమమున కనుపించునవి, లెస్సగా చిత్రితములైన ఆతని తలిదండ్రుల విగ్రహములు. జీవితమున తన కింతటి ఔన్నత్యమును గూర్చిన తల్లి సాహచర్యమును మరణానంతరమునగూడ నాతడు విడువలేదు. తనతలిదండ్రులను పాతిపెట్టిన మాళిగయందే తన శవమునుగూడ పాతిపెట్టవలసినదిగా నాత డాజ్ఞాపించెను. ఆతని జీవితమున శక్తి, ఉత్సాహములను గల్గించినది ఆతనితల్లి.

లిప్టన్ కాలము వృథబుచ్చి యెఱుగడు. ఎనుబది వత్సరముల వృద్ధుడైనపుడుకూడ బ్రహ్మాండమంతటి తన వ్యాపారమును తన ఒడ్డిలోనే ఉంచుకొని కార్యనిర్వాహణ మొనర్చుచుండువాడు. ఆతనివదన మెల్లవేళల మందహాసాంచితమై యుండునది. ఆ మందహాసము జనవశీకరణసమర్థమైయుండెను. ఆతని నీలికన్నుల మనోహర చలనము, ఆతని హాస్యప్రియత్వము తుదివఱకుండెను. తుదివఱకు ఆతడు ఆడంబరరహితుడైయుండెను. సాధారణమైనవి, శుచియైనవి అగు వస్తువులనే ఆతడు ప్రేమించెను. సముద్రతరంగస్పర్శ, సూర్యాతపప్రసారము, మలయమారుతసేవనము చిన్ననాటివలెనే పెద్దనాడుకూడ నాతడు ప్రేమించెను. కలిగిన జయముచే నాతడు చెడిపోలేదు. వ్యాపారపు తొలిదినములనాటి తనకష్టములు, గ్లాస్గోవీధులలో తిరిగిన ఆనాటి తనపందులు, తన క్షేమాభివృద్ధులకు కారణభూతురాలైన మాతృదేవి వీనినిగూర్చి ఆతడు తఱచు చెప్పుటకు ముచ్చటపడువాడు.

వివాహవిషయమునమాత్రము లిప్టన్ సంకల్పసిద్ధుడు కాలేకపోయెను. వ్యాపారము క్రమాభివృద్ధినందుచున్న దినములలో నాతని కొకపడుచుతో పరిచయము కలిగెను. వివాహము, గృహము, సంతానము—ఈ వాంఛలతో ఆతడు వ్యాపారాభివృద్ధివిషయమై మఱింత శ్రద్ధవహించెను. కాని ఆతడు వివాహమాడదలచిన పడుచు మద్యపానదురభ్యాసమునకులోనై లిప్టన్ ప్రేమను గోలుపోయెను. అంతతో ఆతని వివాహవాంఛయు తుదముట్టెను. ఆ జన్మము ఆతడు అవివాహితుడుగనే యుండిపోయెను. మద్య మిట్లు తలపెట్టిన వివాహమును తారుమారుచేయుటచేతనో, మఱియెందుచేతనో లిప్టన్ మద్యమనిన భయపడువాడు. జీవితకాలమున ఆతడు మద్యమును రుచిచూచియైన ఎఱుగడు. అల్పాహారపువిందులసమయమున తోడివారు అన్యథా తలంపకుండుటకై తన పానపాత్రలో మద్యముయొక్క రంగుతో సరిపోవు ఇతరపానీయములు తెచ్చుటకుగాను సేవకులకు లంచమిచ్చువాడట. ఆతడు జీవితమున ఎట్టి దుబారాఖర్చును లేక పొదుపుగా నుండువాడు. చుట్టగాని, సిగరెట్టుగాని కాల్చి ఎఱుగడు. ఒక్కసారి తప్ప మఱియెప్పుడును జీవితకాలమున నాతడు పందెమొడ్డియుండలేదు.

తన పనివారలయెడ నాతడు మిక్కిలి ప్రేమతో వర్తించువాడు. వివిధములైన ఆతని కర్మాగారములందు 'సమ్మె' అనుపదము ఒక్కసారికూడ ఉచ్చరింపబడలేదు. సంగీతము, ఉద్యానవనకృషి ఆతని అభిమానవిద్యలు. పది సంవత్సరముల పిన్నటనాటనుండియు నాతడు వీణావాదనమున అభినివేశమును చూపువాడు. ప్రాతఃకాలమున నిద్రలేచి తన యుద్యానవనమున విహరించుటకై తప్పక వెళ్ళుచుండువాడు. కార్యాధిక్యముచే దీరుబడిలేని దినములలోగూడ నాతడు ఒకగంట ముందుగలేచి ఉద్యానవనపుపనులనుచేయుచు స్వచ్ఛవాయువులలో సంచరించిగాని కార్యాలయమునకు పోవువాడుకాడు. దినమునకు ఏడుగంటలు నిద్రించువాడు. ఉదయమున పెందలకడనే పడకనుండి లేచువాడు. ఆజన్మము ఇట్టి నియమము నవలంబించియుండుటచేతనే అతడు జీవితాంతమువఱకు ఆరోగ్యవద్దేహుడైయుండెను.

1931-వ సంవత్సరము సెప్టెంబరు తుదివారములో నాతనికి జబ్బుచేసెను. నిద్రించుచుండగా హృదయస్పందన మాగిపోవుటచే నాతడు అక్టోబరు ౧-వ తేదీని మరణించెను. అప్పుడచట నలుగురు డాక్టరులు, పలువురుమిత్రులు ఉండిరి.

# గ్రంథాలయోద్యమము

## ప్రేక్షకులు రాని పెద్దగ్రంథాలయము

1933 నవంబరు 7-వ తేదీని శ్రీ జార్జి చక్రవర్తి బ్లూమ్సుబరీ యందలి మాలెట్ ప్లేసులోని జాతీయ కేంద్రగ్రంథాలయము వారి నూతనమందిరప్రారంభోత్సవము గావించెను. ఈ గ్రంథాలయము ప్రపంచమునందలి అసాధారణసంస్థలలో నొకటి. ఇందలి బీరువాలు పెద్దపెద్ద గ్రంథసంపుటములతో పిక్కటిల్లియున్నవి; కేటలాగు దాఖలా ఏబదిలక్షల పుస్తకములు - అయినను ఈ గ్రంథాలయమునకు ఒక్క ప్రేక్షకుడు కూడరాడు; గ్రంథాలయసేవకులను ఒక్కడు కూడ చూడడు; గ్రంథాలయము ఎక్కడున్నదో కూడ పలువురకు తెలియదు. ఈ గ్రంథాలయమునుండి పుస్తకములు కొనిపోవుట అంతయు తపాలుద్వారానే జరుపబడును. బ్రిటీషుదీవులయందంతటను వెదజల్లబడియున్న చందాదారులకు పార్సెలుల ద్వారా దినదినము పలుసంపుటములు పంపబడుచుండును. ప్రారంభోత్సవము జరుపుచు ఈ గ్రంథాలయమును చక్రవర్తి జాతీయ విశ్వవిద్యాలయమని పేర్కొనియున్నాడు. ఇది ఉచితగ్రంథభాండాగారము. కార్నిజి ట్రస్టువారీగ్రంథాలయమునకు ఈ నూతన మందిరము నిర్మించియిచ్చిరి. బ్రిటీషు దీవులయందలి ప్రతివ్యక్తియు తనకు అందుబాటులోనున్న పుస్తకభాండాగారము ద్వారా ఇందుండి తన కేవిషయమును గూర్చిన పుస్తకము కావలసినను పొందవచ్చును. స్థానికగ్రంథాలయమున వలసిన పుస్తకము లేనిచో ఆపుస్తకమునకై ఈకేంద్రగ్రంథాలయమునకు వ్రాయబడును. ఇచట స్టాకులో ఆ పుస్తకము లేనిచో 'సారస్వత పరిశోధక శాఖద్వారా దరియాప్తు చేయబడి అది తెప్పింపబడును. ఈకేంద్రగ్రంథాలయము నంటియున్న 'సారస్వతపరిశోధకశాఖ' బ్రిటీషు దీవులయందలి నూటముప్పది పెద్ద పెద్ద గ్రంథాలయములతో సంబంధము కలిగియున్నది ; దాని అందుబాటున ఏబది లక్షల గ్రంథసంపుటములు గలవు. కేంద్ర గ్రంథాలయమున ఒక్కనవల కూడ లేదు. ఉన్న గ్రంథములసంఖ్య ఒకలక్ష. నూతన మందిరమున మఱి పదిలక్షల గ్రంథ సంపుటములకు తావుగలదు. కల్నల్ లక్సు మూర్ న్యూకొంబ్ గ్రంథాలయపు ప్రధాన కార్యనిర్వాహకుడును, పాలకుడును. దినమునకు సగటున ఈ గ్రంథాలయమునకు రిఫరెన్సు పుస్తకములకై నాలుగువందల దరఖాస్తులు వచ్చుచుండును. 1932-వ సంవత్సరమున దరఖాస్తుదారులకు 61,630 పుస్తకములు పంపబడెను; అసంఖ్యాకములగు విజ్ఞప్తులకు సమాధానము లీయబడెను. లైకొనబడిన పుస్తకములలో పెక్కు అమూల్యములైనవి. పుస్తకములు పోయిన కేసులు బొత్తిగా లేవని చెప్పవచ్చును. తాను పుస్తకములు కొనివచ్చు భాండాగారమునకు కేంద్రగ్రంథాలయమును, ఇటనుండి గ్రంథములను కొనిపోవు గ్రంథాలయము కేంద్రగ్రంథాలయమునకును పుస్తకముల జా

గ్రత్త విషయమున బాధ్యతవహించి యుండును. ఈ కేంద్రగ్రంథాలయపు రవానా గది (డిస్పాచ్ రూమ్) చూడ ముచ్చటగ నుండును. అచట పనిచేయువారందఱును పడతులు. గోధుమవర్ణపు పాకింగు కాగితములు నిలువు ఎత్తున; పెద్ద పెద్ద దారపు ఉండలు. ఆపడతుల కోమలహస్తములు దినమంతయు పార్శెళ్ళుకట్టుటతో కాయలు కాయుచుండును. ఈ పార్శెళ్ళ పంపుటకు అగు తపాలవ్యయము విశేషమైనదే. కాని దానినంతను గ్రంథగ్రాహకులే భరింతురు. పరిశోధకశాఖ, రవానాశాఖ గాక ఈ కేంద్రగ్రంథాలయమున రిఫరెన్సుశాఖ యొకటి గలదు. ఈశాఖయందు సామ్రాజ్యమునందున్న అన్ని గ్రంథముల కేటలాగు తయారుచేసి యుంచబడుచున్నది. దినదినమును ఈ కేటలాగు పెరుగుచునే యుండును. ఈ కేంద్రగ్రంథభాండాగారము 1916 లో విద్యార్థుల కేంద్రగ్రంథాలయముగా స్థాపింపబడినది. అప్పుడది రెండు చిన్నగదులలో పట్టజాలియుండెను. డాక్టరు ఆర్బర్టు మాన్సు బ్రిడ్జి దీనిస్థాపకుడు. కార్నీజిఫండువారిచ్చుచువచ్చిన విరాళములసాయమున ఇది బాగుగా అభివృద్ధి నందెను. 1927 లో పబ్లికులైబ్రెరీకమిటీవారు దేశమునందలి గ్రంథాలయముల నన్నిటిని ఏకసంస్థ యాజమాన్యముక్రిందకు గొనిరా తీర్మానించిరి. ఏటేట కార్నీజిట్రస్టువారు నాలుగువేల పౌనులను, ప్రభుత్వమువారు మూడువేల పౌనులను ఈ గ్రంథాలయమునకు గ్రాంటు నిత్తురు. ఉదారులగు ధనవంతులు కూడ విశేషముగ విరాళము లిచ్చి ఈ గ్రంథాలయమును పోషించుచుందురు. (హిందు)

—ఎడ్యుకేషనల్ అండ్ లిటరరీ సప్లిమెంటు.

# గ్రంథాలయాధికారి

గ్రంథాలయానికి ముఖ్యమైన అంగాలు మూడు. అందు లైబ్రేరియన్ ప్రథముడు. కొందరు కేవల గ్రంథ, ధన సంపాదనతో గ్రంథాలయస్థాపన పూర్తియైనదని తలంతురు. కాని యదార్థంగా కొంతమంది అభిమానులు కొన్నిరోజులు కష్టించి కొన్ని పుస్తకాలు, కొంతడబ్బు సంపాదించగలరు గాని ఆ పుస్తకములను సద్వినియోగపఱచి సరియైన ఫలితమును పొందజేయుగల స్వచ్ఛందసేవకుడు కావాలంటే సామాన్యమైన విషయంకాదు. లైబ్రేరియన్ అంటే అచ్చంగా పుస్తకాలు ఇచ్చి పుచ్చుకొనేవాడు అనుటతో పూర్తికాదు ఆపదం యొక్క అర్థం. అతను దేశాభిమానంతో, భాషాభిమానంతో, స్వార్థవిరహితంగా, పరులక్షేమాభిలాషతో పనిచేయవలసి ఉంటుంది. సహనగుణముయొక్క విలువను బాగుగా గ్రహించి ఉండాలి. పాఠకుల నాకర్షించగల తేజస్సు కలిగియుండాలి వదనంలో. తేనెలొలుకు పలుకులతో సగౌరవంగా తనయం దభిమానంగలవారినిగా చేసుకోవాలి పాఠకుల్ని. లైబ్రేరియన్ కుండవలసిన లక్షణాలలో ఇవిగాక గ్రంథపఠనం ముఖ్యమైన విషయం. గ్రంథాలయంలో ఉన్న ప్రతి పుస్తకంలోను యావద్విషయాన్ని గ్రహించి ఉండాలతను. పాఠకుడు ఒక పుస్తకాన్నడిగితే ఆపుస్తకం లేదనో చిరిగిందనో సమాధానంచెప్పి పాఠకుల్ని నిరుత్సాహ పర్చక, అదేవిషయం గలిగిన మరో పుస్తకం పేరుచెప్పి ఆపుస్తకాన్ని చదివించాలి పాఠకుడిచేత. గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచాలతను.

—చావలి కోటీశ్వరరావు.

# మణిమాల

## జార్జిచక్రవర్తిగారి జమాఖర్చులు

"దేశీయాదాయమునుండి జార్జిచక్రవర్తిగారికి సివిల్ లిస్టు కింద 420,000 పౌనులు ఏడాదికీయబడును. 1931 కి పూర్వము ఇంతకంటె 50,000 పౌనులు హెచ్చు ఈయబడుచుండెను. ఆ సంవత్సరమున ఆర్థిక మాంద్యము నుపలక్షించి చక్రవర్తిగారే సదరు మొత్తమును విడనాడుటకు తీర్మానించుకొనిరి. 420,000 పౌనులు పెద్ద మొత్తముగానే కనిపించును. కాని రాజుగారి ఖర్చులకు ఈ మొత్త మెంతమాత్రమును చాలదు. లాంకాస్టరు డచీనుండి రాజుగారికి స్వంతముగా 60,000 పౌనులు రాబడిగలదు. దీనివలననే వారు తమ జమాఖర్చులను సరిపెట్టుకొనగలుగుచున్నారు. రాజుగారి నివాసమందిరములగు బకింగుహామ్ పేలెస్‌నందును, శాండ్రింగుహామ్‌నందును మితవ్యయ విధానము నెలకొనియున్నది. రాజగృహమునందలి ఉద్యోగుల జీతబత్తెములఖర్చు ఏడాదికి 130,000 పౌనులు; రాజగృహవ్యయములు ఏడాదికి 200,000 పౌనులు. రాజగృహవ్యయములలో ఆహారము, దీపములు మొదలగునవి హెచ్చుసొమ్మును కబళించుచున్నవి. పశుశాలల పరిరక్షణము, మోటారులజాగ్రత్త, విండర్సువిహారోద్యానవనమువంటి ఉద్యానవనముల కృషి ఇవికూడ హెచ్చుమొత్తముల ఖర్చుకు కారణములగుచున్నవి. స్పెషలుట్రెయినులో ప్రయాణము చేయునపుడు రాజుగారు రైలుకంపెనీకి పూర్తి చార్జి సీయవలసియుందురు. వివిధములైన రాజగృహముల మరమ్మతులు, ఇన్సూరెన్సుప్రీమియములు వీనివలన సాలుకు సుమారు 20,000 పౌనుల ఖర్చు, రాజుగారి గుప్తదానములకు ఏటేట 100 000 పౌనులు ప్రత్యేకింపబడును. రాజగృహమునందలి ఉద్యోగములకు విశ్రాంతివేతనములుగలవు. ఒకేకాన్పున ముగ్గురుబిడ్డలను కను తల్లులకిచ్చు విరాళములు మొదలైనవిగలవు. చక్రవర్తిగారివలన ఏటేట ఎలవెన్సులు తీసికొనిజీవించు కందారాజులు దాదాపు రెండువందలమందిగలరు."

—స్టూ ఆర్టు డ్రె డన్.

* * *

## ముస్సోలినీగారికి ముసలితనమనిన గిట్టదు

"ఇటలీదేశపు నిరంకుశాధికారి ముస్సోలినీకి డాబుదర్పము హెచ్చు. తన జన్మదినమునే ఆతడు ద్వేషించును. తాను వృద్ధుడగుచుండుటను జ్ఞప్తికి తెచ్చును గావున తనజన్మదినముల నాతడు ద్వేషించును. ఒకప్పుడు యౌవనమే ఆతని వ్యాపారమైయుండెను. ఆవ్యాపారము సడలిపోవుట ఇపు డాతనికి సరిపడుటలేదు. వృద్ధుడుగా నాతనిని పేర్కొనుటకు ఇటలీదేశపు వార్తాపత్రికలకు హక్కులేదు. వయస్సునుగూర్చి నిర్ధరింపవలసివచ్చినపుడు ఆతడు 'ముసలివాడనగుటకు నాకు తీరికలేదు' అని చెప్పును. ముసలివాడగుటకు తనకు తీరిక లేదని ఆతడు చెప్పును గాక - ఆతనితల బట్టకట్టుచున్నది: ఆతనికణతలమీదివెంట్రుకలు నెరయుచున్నవి. ప్రాయశః, ఆతడు వృద్ధుడగువఱకును జీవించియుండడేమో! ఏమన ఆతడు దినమునకు పదిగంటలు పనిచేయును. వేసవిలో నదులయందు ఈదును; సాధారణముగ అడ్డుతడకలుదాటుచు ఆతడు గుఱ్ఱపుస్వారిచేయును; మోటారు సైకిలుపైనెక్కి వాహ్యాళివెడలును; తనకారులను ఎల్లవేళల శరవేగమున పోనిచ్చును. అమెరికను అధ్యక్షుడు రూజువెల్టు అందఱితోడను ఆంతర్యమున మెలగునని అమెరికనుపత్రికలు చెప్పుచున్నవి. ముస్సోలినీ విషయ మట్లుగాదు. ముస్సోలినీకి ఆంతరంగిక మిత్రులులేరు. ఆతడెవరిని విశ్వసింపడని చెప్పబడుచున్నది. సొసైటీతో ఆతడు కలసిమెలసియుండడు, ప్రతిదినము ఆతనిని దర్శించువారుకూడ ఆతనితో ముక్తసరిగనే ముచ్చటింపవలసియుందురు."

—డెయిలీ ఎక్సుప్రెస్.

* * *

## బడితోటలు

ఉదకమండలమునందలి గవర్నమెంటు బొటానిక్ గార్డెన్సు క్యూరేటరు యఫ్. హెచ్. బుచ్చర్ గారు ఇట్లు వ్రాయుచున్నారు: "జీవనాధారములకు ప్రధానముగా వ్యవసాయముపై ఆధారపడియుండు ఈ హిందూదేశమున ఉద్యానవనకృషివిషయమై చూపబడవలసినంతశ్రద్ధ చూపబడుటలేదని చెప్పవచ్చును. హిందూదేశమున పలువురివృత్తి వ్యవసాయమే. కాగా ఉద్యానవనకృషివిషయమున ఈ ఉదాసీనతయేమి? దారితీసి చూపువారు విశేషముగ లేకపోవుటయే ఈ ఉదాసీనతకు కారణమని నానమ్మకము. ఈ ఉదాసీనతనుబాపి ఉద్యానవనకృషివిషయమున ఉత్సాహమును కలిగించుటకు మనము ప్రాథమికపాఠశాలల నాశ్రయింపవలయును. బడితోటలవిషయమై ఇప్పుడిప్పుడు కొంతశ్రద్ధ చూపబడుచున్నందులకు ఆనందింపవలసినదే. గ్రామసీమలయందలి పిల్లలకు పిన్నటనాటనే ఈ బడితోటలమూలమున తోటపనులయందు అనుభవమును, అభినివేశమును కలిగించుచో పెద్దతనమునవారు మంచికర్షకులుకాగలరు. తోటపనులయందు పిల్లలకు కలిగించు అనుభవమును, అభినివేశమును ప్రకృతిపరిశీలనతో మేళవింపు నొందింపబడునేని మంచి కార్యకారిగానుండును. తమ బడులలోని ఈ చిన్ని తోటలను చూచి పిల్లలు తమయింటి ఆవరణయందును పూలమొక్కలు మొదలైనవి పెంచుటకు మొదలిడి దొడ్లను శుభ్రముచేసి వానికి క్రొత్త అందమును కలిగింతురు. అప్పుడప్పుడు పుష్పప్రదర్శనములుకూడ ఏర్పఱచుచుండుట మంచిది. ఈ ప్రదర్శనములు తోటపనియందలి వారి ఉత్సాహమును ఇనుమడించును. తోటపని అతిప్రాచీనమైన, ఆనందకరమైన, ఉత్తేజకరమైన పని. శ్రద్ధవహించుచో దానిని లాభకరమైనదానిగ కూడ చేయవచ్చును. కావున పాఠశాలాధికారులు తమ పాఠశాలావరణలయందు తోటలను పెంచువిషయమై శ్రద్ధపెట్టుదురుగాక!"

—గార్డెనింగు రెవ్యూ.

* * *

## లాభకరమైన దీర్ఘాయువు

"పలువత్సరములు ఇండియాప్రభుత్వమువారినుండి పెన్షనుసొమ్ము తీసికొనువారినిగూర్చి ఈ నడుమ విచారించుచుంటిని. నిరుడు సెప్టెంబరుమాసమున మిస్ఫ్రాన్సెస్ కారొలైన్ బేకరు మరణము పత్రికలలో ప్రచురింపబడినది. ఈస్టిండియాకంపెనీవారు ఆమెకు 1839-వ సంవత్సరమున పెన్షను ఈయనారంభించిరి. ఆమె 93 ఏండ్లు పెన్షనుతీసికొని తనకు 101-వ ఏట మొన్న మరణించినది. ఆమెతండ్రి మద్రాసుసేనలో సైనికుడుగనుండి మైసూరురాష్ట్రమునందలి టుంకూరులో కలరాతగిలి 1839 నవంబరు 30-వ తేదీని చనిపోయెను. అప్పుడాతని కూతురగు కారొలైన్ బేకరుకు కంపెనీవారు పెన్షను గ్రాంటుచేసిరి. 93 సంవత్సరములు పెన్షనుతీసికొనినవారు మఱియెవ్వరును లేరని చెప్పవచ్చును. కాలముచేత ఇది అద్వితీయమైనదికాగా పుచ్చుకొనిన మొత్తముచే మఱియొకరిది అద్వితీయమగుచున్నది. పీటర్ఆబర్ (1777-1866) అనువాడు తన పదునాఱవఏట ఇండియాహౌస్‌లో ఉద్యోగస్థుడుగా చేరి 1829 మొదలు 1836 వఱకు కార్యదర్శియై రిటైరు ఆయెను. ఏబదియేండ్లు పనిచేసి ఆతడు 1836 లో పింఛను తీసికొనెను. ఏడాదికి రెండువేలపౌనులు పెన్షను. ముప్పదిసంవత్సరములు గైకొనెను. ఆతనికిముట్టిన పెన్షను మొత్తము అఱువదివేలపౌనులు. ఇంత పెద్దమొత్తమును పెన్షనుగాగొనినవాడు మఱియొకడులేడు. సర్జన్ హెచ్. బి. హింటన్ 29 ఏండ్లు పనిచేసినతరువాత 1868 మార్చిలో పింఛను పుచ్చుకొనెను. ఆతడు తన 103-వ ఏట 1916 మే మాసమున మరణించెను. నలుబది ఎనిమిది ఏండ్లు పెన్షను పుచ్చుకొనెను. ఐ. సి. యస్. ఉద్యోగులలో—హెన్రీబీవరిడ్జి 1892 లో రిటైరై 92-వ ఏట నవంబరు 1929 లో చనిపోయెను; ఆర్. డబ్ల్యు. లాడ్విక్ 1877 లో రిటైరై తన 98-వ ఏట 1929 లో మరణించెను; విలియమ్ మాక్‌పే 1879 లో రిటైరై 1930 అక్టోబరు 26-వ తేదీని తన 92-వ ఏట గతించెను; డబ్ల్యు. హెచ్. హెండర్సన్ ఏబదిమూడు వత్సరములు పెన్షనుతీసికొని మూడుమాసములు తక్కు—

వగా నూరేండ్లు బ్రతికి 1928-వ సంవత్సరము ఫిబ్రవరి 9-వ తేదీని మరణించెను." —స్టేట్సుమెన్.

* * *

## ఇవాన్ బునిన్

"ఈ సంవత్సరపు నోబెల్ వాఙ్మయ బహుమానము నందిన కవిగ్రామణి పవిత్రనామము ఇవాన్ బునిన్. ఇతడు రష్యన్ దేశీయుడు. కవి, నవలాకారుడునై ఇతడు నేటి రష్యన్ సారస్వతమును పరిపుష్టినొందించుచున్నాడు. వారొనెజ్ అను ప్రదేశమున నొక ప్రభు కుటుంబమునందు ఈతడు 1870-వ సంవత్సరము అక్టోబరు 10-వ తేదీని జననమొందెను. ఈతని మొదటి పద్యకావ్యము 1880 లో ప్రచురింపబడెను. రష్యాదేశపు సారస్వతబహుమానములలో తొలుతటిది అని చెప్పదగిన పుష్కిన్ బహుమానము ఈతని పద్యములకీయబడెను. ఆంగ్లసారస్వతమునుండి లాంగుఫెల్లో 'హియావాథా'; బైరన్ 'మాన్‌ఫ్రెడ్', 'కెయిన్'; టెనిసన్ 'లేడీగొడివా' ఈతడు రష్యన్ భాషలోనికి అనువదించెను. 1909 లో ఈతడు రష్యన్ సాహిత్య పరిషత్తుకు సభ్యుడుగా ఎన్నుకొనబడెను. బునిన్ కవితయందు భావములకంటె వర్ణనలు మనోహరములై యుండును. ప్రకృతివర్ణన, మానవస్వభావవర్ణన అతి నిశితముగా ఒనర్పబడియుండును. గద్య రచయితగా ఈతడింతకంటెను గొప్ప ప్రతిష్ఠనందియున్నాడు. చిన్న కథలు, కథలు, నవలలు ఈతడు పెక్కు రచించెను. 'దివిలేజ్', 'ఎ జెంటిల్‌మాన్ ఫ్రమ్ శాన్ ఫ్రాంసిస్కో', 'సుఖోడల్', 'యాన్ ఈవెనింగు ఇందిస్ప్రింగు' అనునవి ఈతడు రచించిన కొన్ని కథాగ్రంథముల నామములు. ఇందు మొదటి రెండు గ్రంథములును ఆంగ్లభాషలోనికి అనువాదితములై యున్నవి. ఈతనిని సారస్వతవిమర్శకులు తఱుచుగా రష్యాదేశపు 'ఫ్లాబర్టు' అందురు. ఈతని వచనశైలి దోషరహితమై, మనోజ్ఞమై యుండును." —బుక్ బులెటిన్.

* * *

## డాక్టరుల ఫీజులు

"ఈనడుమ నేపాళరాకుమారికి నాలుకమీది వ్రణమును చికిత్సచేయుటకు ఇండియాకు పోయిన లండను డాక్టరు సౌటరుగారికి విమానపుఖర్చులకే రెండువేల పౌనులు ఈయబడెనని ప్రచురింపబడెను. సౌటరుగారి వంటి సుప్రసిద్ధభిషగ్వరుల విషయమునగూడ ఈ ప్రయాణపుబత్తెము హెచ్చుగనే కనిపించును. కాని చరిత్రకు తెలిసిన డాక్టరుఫీజు మొత్తములలో ఇది ఏమంత పెద్ద మొత్తముగాదు. పదునెనిమిదవ శతాబ్దిలో డాక్టరు థోమస్ డిమ్స్‌డేల్ గారికి రష్యాకు వెళ్ళి రష్యాప్రభ్వి కేథరైన్ సెకండుకును, ఆమె కుమారునకును టీకాలు వేసినందుకు పదివేలపౌనులఫీజు, ఏడాదికి అయిదువందలపౌనుల పెన్షను, ఒకచిన్న జమీందారీ ఈయబడెను. ముప్పదియేండ్లకు పూర్వము హిందూదేశమునందలి రాంపూర్ నవాబునకువచ్చిన కీళ్ళవాతము కుదిర్చినందుకు ఒక ఇంగ్లీషుసర్జనుకు పండ్రెండువేల పౌనులు ఈయబడెను. జర్మనుచక్రవర్తి ఫ్రెడరిక్‌కు వృద్ధాప్యమున పరిచర్య చేసినందుకు సర్ మోరెల్ మెకంజీ అను డాక్టరు పదమూడువేల పౌనులను బడసెను. జేగౌల్డు అనునాతడు హెలెన్ అను తన కూతురి తీవ్రరోగమును కుదిర్చిన వైద్యునకు పదునెనిమిదివేలపౌనుల చెక్కు నిచ్చెను. ధనికుడగు నొక రోగికి కుంటితనమును కుదిర్చినందులకై బ్రిస్టలు నందలి డాక్టరు గేల్ (ఈతడు అంధుడు)నకు ఏబదివేల పౌనులు ఒసంగబడెను. చరిత్రకు తెలిసిన డాక్టరుల ఫీజులలో ఇదియే పెద్దమొత్తమని నిస్సందేహముగ చెప్పవచ్చును." —మాంచెస్టర్ గార్డియన్.

### 'ఆంధ్రభూమి' ఫిబ్రవరి సంచికలో

౧. 'పెంపుడు కుక్కలు' (వినోదవ్యాసము.)
—తాత కృష్ణమూర్తి గారు, బి.ఏ., యల్.టి.

౨. 'సూరిసిద్ధాంతము' (ఆలోచనరేపు కథావ్యాసము.)
—కొడవటిగంటి కుటుంబరావుగారు.

3. 'జాన్ డి రాక్‌ఫెల్లరు' చరిత్ర.

పుట్టుదరిద్రుడు. కిరసనాయిలు మొదలగు నూనెల వర్తకముచేసి లోకమందలి ధనికులలో రెండవస్థానమాక్రమించుచున్నవాని విచిత్రచరిత్ర.

# సంక్రాంతి

సీ. అప్పగింజలఋణమంతయుఁ దీఱఁగా గరిసెలునిండఁగాఁ గాఁపుమురియు
అల్లుండ్రఁబిల్చి చేనయినంతవఱకు కట్టి మామయుఁ జల్పు సన్మానములను
పితృదేవతలకుఁ దృప్తిగను గూష్మాండదానములతోఁ బిండప్రదానములుజరగు
మఱిఁ బురోహితులకు నిరుకత్ష్యములు నిండి పోవు స్వయంపాకములు లభించు

గీ. రకరకాలపొంగళ్ల తెలుఁగుల సూర్య, నారగింపించు నియతి చెన్నారి "పొంగ"
లనెడి పేరొంది మకరసంక్రాంతి కాంతి, కాంతమై భారతక్షితిం గ్రాలు మిగుల.

మ. బలి పాతాళమునందునుండియుఁ బరాస్వాధీనమై యున్న యీ
యిలనుంజూచెడి కోర్కినాసతికినై శ్రీశుం దగన్ వేఁడి య
ట్టులయీసంక్రమణంపు నాలుగదు నాళ్లు గాంచు నీభూమి నం
దుల కేకా? బలిపూజ లీదినములం దోరంబుగా నొప్పెడిన్.

ఉ. ఎద్దులకాలకున్ మిగుల నింపుసొంపుసు గల్గునట్లుగన్
ముద్దుసు గొల్సురంగులను బుట్టములన్ ధరియింపఁజేసి, పె
ద్దుల పందియంబులిడి యుల్లసనంబు భజింతురెల్ల వా
ర్యద్దశఁ జూపుదున్ మకరసంక్రమణంబున దేశమంతటన్.

ఉ. చెమ్మట యోడ్చి వర్షమునఁ జెందినపాటునఁ బండినట్టి ధా
న్యమ్ముల నెల్లవండియును నా ఫలమిచ్చిన ముఖ్యదాత కా
తమ్ములతేవికిన్ శశికిఁ దద్దయు భక్తిని నప్పనంబు ని
చ్చుమ్మొయిఁ జేయువా ర్మకరసంక్రమణంబున నెల్ల రీభువిన్.

శా. ఆసంక్రాంతికిఁ దొంటిరోజునను శేషాహీనుడున్ ధాత్రివా
మాసీనంబును శీర్షదక్షిణగ భాగాసీనముం జేయుటన్
వాసిన్ "భోగి" యుటంచు దానికి నిలన్ నామంబు చెన్నొందె ని
ట్లాసారంబుగ నొప్పు సంక్రమణదివ్యస్ముఖ్యతల్ మిక్కిలిన్.

సీ. భూభారభరణయుగ్భోగిభోగాభోగవిన్యాసముఖ్యతావిశ్రుతిగని
హరిభక్తమణిబలీంద్రాగమనంబున నఖిలపావనత నింపారనొంది
నూత్నధాన్యాంబరానూనభోగప్రదానప్రకారంబుల నలువునిడియు
ఎల్లచోటులు శుద్ధి నెనయుటంజేసి యారోగ్యాభివృద్ధికిఁ బ్రోదినిడుచుఁ

గీ. బాఁడిపంటల కతములై పరఁగుపసుల, కనువువెంచెడి మేలి యభ్యసనమిడుచు
మకరసంక్రాంతి చాలన్ హిమకరసూర్య, పూజలం గడున్ భూమికిన్ బొల్పునిచ్చు.

—దోమా వేంకటస్వామి గుప్త.
(విద్వాన్, కవిభూషణ, శతావధాని).

# విడ్డూరములు

### సంగీతముపాడు కిటికీలు.

ఉత్తర హిందూదేశమునందలి జయపూర్ మహారాజాగారికి తమ రాజధానీనగరమగు జయపూర్‌నందొకవిలాసమందిరము గలదు. దానికి 'మారుత మందిరము' అని పేరు. ప్రపంచమునందలి విలాసమందిరములో దీనితో దొరయుపాటిది మఱియొకటి లేదు. మందిరమంతయు చలువరాళ్ళతో కట్టబడినది. అది కట్టుటకు 10 000 000 పౌనులు సెలవైనవి. అందు నివసించువారికి సుఖానందములు గూర్పగల సకలసౌకర్యములు అందు గలవు. ఆమందిరమున 3,462 కిటికీలుగలవు. ప్రతి కిటికీకిని ఒక సంగీతయంత్రము కూర్చబడి యున్నది. కిటికీలనుండి గాలి వీచుచుండగా ఆయంత్రములు శ్రావ్యముగ సంగీతమును పాడుచుండును.

### పురుషసంపర్కము లేకుండ గర్భోత్పత్తి.

పశ్చిమవర్జీనియాకు చెందిన డాక్టర్ ఎరల్ ఇ. డడ్డింగు అనువాడు-డెబ్బదిరెండేండ్ల వయస్సుగల వృద్ధ సంస్కారి - ఇట్లు ప్రకటించెను : "ఇరువదియెనిమిది ఏండ్ల వయస్సుగల నాభార్య కొలదికాలములో ప్రసవింపనున్నది. ఆమె ముంజేతులయందు రసాయనికి పదార్థములు (కెమికల్సు) ఇంజెక్టుచేయుట చేతనే ఆమె ఈ గర్భమును ధరించినది." కెమికలుపిల్లలను గనుటను గూర్చిన ఈ ప్రకటన శాస్త్రజ్ఞులలోను, భిషగ్వరులలోను తీవ్రమైన జిజ్ఞాస కలిగించెను.

### చెట్లకొమ్మలమీద రైలుబండి నడచుట.

కాలిఫోర్నియాలో నొకచోట చెట్లకొమ్మలమీద నుంచి రైలు నడచుచున్నది. ఆదేశమున సముద్రతీరము నందలి ఒక కొండలోయకు అడ్డముగా రైలుబాట నిర్మింపవలసి వచ్చెను. అచ్చట ఇనుముతో గాని, రాతితో గాని వంతెన నిర్మించుట వ్యయమూలకము కావున ఆలోయలో దట్టముగాను పొడుగుగాను ఎదిగియున్న చెట్ల ఆధారమున రైలువంతెన నిర్మించుటకు తీర్మానింపబడెను. రైలుగట్టుకు సమమైన ఎత్తులో ఆచెట్ల పై కొమ్మలన్నియు కొట్టివేయబడి రైలుపట్టాలకు అడుగున ఉండు అడ్డకఱ్ఱలు ఆకొమ్మలపై అమర్చబడి రైలుపట్టాలు సాగింపబడెను. రైళ్ళు చక్కగ సాగిపోవుచున్నవి. ఈవిడ్డూరపువంతెన ఇంతవఱకు తృప్తికరముగనే పనిచేయుచున్నది.

### మాటలాడెడు పుస్తకము.

చికాగోనగరమునందలి విద్యాప్రదర్శనములో నొక వింతపుస్తకము ప్రదర్శింపబడినది. ఆపుస్తకము మాటలాడగలదు. ఆపుస్తకమున ఆదేశపుప్రభుత్వమువారు విద్యావ్యాప్తి ఎట్లు గావించుచున్నారో వివరింపబడినది. పుటలనుకూడ మనము త్రిప్పనవసరములేదు. పుటలోని విషయము అయినతోడనే ఆపుస్తకము దానికదియే ఆపుటను త్రిప్పివైచి రెండవపుటలోని విషయములను చెప్ప నారంభించును. వినుట యొక్కటియే మనము చేయవలసినపని. ఈపుస్తకనిర్మాణము మాటలాడెడు ఫిలుముల (టాకీల) నిర్మాణమును బోలియున్నది.

### చేతనెత్తురు.

నెబ్రాస్కాయందలి ఓమాహాకు చెందిన డాక్టరు జాన్. ఇ. సమ్మర్సు అనునతడు చేతనెత్తురును గూర్చి తాను గావించిన పరిశోధనలను ప్రచురింపగా శాస్త్రవేత్తలు వానిని మంచి అభిరుచితో పఠించిరి. ఈ చేతనెత్తురు డాక్టరు సమ్మర్సు స్వయముగా కనుగొనినది కాదు. ఇండో చీనాదేశీయులు అనుపూర్వికముగా నెత్తిగి ఉపయోగించుచుండునదే. ఒకజాతి మొక్కయొక్క చిన్ని మొలకల రససారమే ఈచేతనెత్తురు. డాక్టరు సమ్మర్సు ఈమొలకలనుండి పరిశుభ్రమైన రసమును దింపగలుగు విధానమును కనుగొనెను. ఈ చేతనెత్తురు ఇంజెక్టుచేయుటచే అపాయస్థితిలో నున్న పలువురి ప్రాణములు పరిరక్షింపబడియుండుటను అతను నిదర్శనపూర్వకముగా నిరూపించి యున్నాడు.

## శిరోరేఖ

### ఉత్పత్తిస్థానము ౨.

జీవరేఖతో కలసి ఈరేఖ సాధారణముగ కనిపించుచుండును (చి ౧. నెం. 2) ఇట్టివారు ఆత్మశక్తి నెఱుగనేరరు. ఇట్లు ఉద్భవించి చంద్రుని దిగువస్థానమునకు సాగుపో (చి ౧. నెం. 2-5) ఆత్మశక్తియందలి అవిశ్వాసము కడకాలమువఱకుండును. వీరు ప్రాయక్షముగా కవులు, చిత్రకారులు అయియుందురు. కాని ధైర్యము లేకపోవుటచే తమచే వ్రాయబడిన చిత్రములు, పుస్తకములు విలువ కలవి కావని బహిరంగపఱుపకుండురు. ఈ రేఖ అరచేతి నడిమిభాగమువఱకును వంగి ఆ పిమ్మట కొడవలి (చి ౧. నెం. 2-7) వలె నుండినవారు వ్యాధిబాధితులై, ఏకాంతవాసులై, ఆత్మహత్యచే జీవితమును తుదముట్టించుకొన ప్రయత్నింపవచ్చును. పై విధముగనే ఉత్పత్తియై కుజుని లోస్థానమునకు (చి ౧. నెం. 2-4) పోవుచున్న ఈ రేఖ ఆ వ్యక్తియొక్క ఆత్మశక్తి యందలి అవిశ్వాసమును పోఁద్రోలును. ఇట్లుండి ఈరేఖ ఎంత నిడివిగనున్న అంతటి మనోద్రఢిమను సూచించును. ఈ రేఖ ఏమాత్రమును వంపులేక తిన్నని గీటువలె పోవుచున్నచో ఆవ్యక్తి ఒక ఆదర్శమును గొని దానికై తన జీవమును ధారపోయును. పైవిధముగనే ప్రారంభమై (చి ౧. నెం. 2-4) నందువలెనే యుండి రేఖ చిగురున దిగువకు పలవ (ఫోర్కు) నిర్మాణమై యుండుచో (చి ౧. నెం. 2-4-4 ఎ) అట్టివారు చంచలులై, ఏదైన ఒక విషయమును గూర్చి లాభనష్టములను దీర్ఘముగా చింతించువారై యుందురు. అట్టివారు వారికి ప్రథమమున ఏది ఉచితమైన నడవడిగ తోచునో అట్లుచేయుటయే ఉచితమని కైరో ఉపదేశించుచున్నాడు.




చిత్రము ౧.



స్త్రీలు ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.



# మహిళాలోకము

## నేటి ఇటలీదేశపు స్త్రీలు

### ఫాసిస్టిజము: స్త్రీలు

ఇటలీదేశమున ఫాసిస్టిజముపద్ధతి 1919 లో ప్రారంభమయ్యెను. ప్రారంభమునుండియు నాపద్ధతి పురుషధర్మముల అభివృద్ధిపైచూపిన శ్రద్ధ విశేషమైయుండెను. ఫాసిస్టిజముక్రింద స్త్రీలు ఎట్లుండినదియు తఱుచు వినబడదు. ఫాసిస్టిజము ప్రబలక పూర్వమే ఇటలీదేశపు స్త్రీలకు ఆదేశపు రాజ్యాంగమున హెచ్చుసంబంధము లేకుండెను. ఫాసిస్టిజము ప్రబలినతరువాత వారికి రాజకీయములతోగల సంబంధము మఱింత తగ్గిపోయిన దనవచ్చును. స్త్రీజనోద్యమము ఫాసిస్టిజమువలన ఇటలీదేశమున అనేకవిషయములందు వెనుబాటునుండి ప్రాక్తనపరిస్థితులకు మరలెననుట నిజము.

### రాజ్యాంగమున స్థానము లేదు

రాజ్యాంగవిషయములందు ప్రవేశించుటకు ఇతరదేశపుస్త్రీలవలె ఇటలీదేశపుస్త్రీలు విశేషమైన అభిరుచి నెప్పుడును చూపియుండలేదు. అయినను బెనిటోముస్సోలినీగారు మంత్రిత్వము వహించినపిమ్మట ఇతరదేశములందువలె ఇటలీదేశపుస్త్రీలకును పురుషులతో సమముగా ఓటింగు మొదలగు రాజకీయములగు హక్కులను ప్రసాదింప ప్రయత్నపడినట్లు చూపట్టెను. అతడు స్త్రీలకు మునిసిపలు ఎన్నికలలో ఓటింగు హక్కు నొసంగెను. అన్ని ఎన్నికల ఓటింగుహక్కు స్త్రీలకిచ్చుట కిది బోణీ అని అపుడు అందఱును భావించిరి. కాని మునిసిపలు ఎన్నికలలో స్త్రీలు ఓటుచేయవచ్చునను హుకుముజారీయైన కొద్దిరోజులకే మునిసిపలు అధ్యక్షుల నెన్నుకొనుహక్కు తీసివేయబడి ఎన్నుకొనబడిన అధ్యక్షులస్థానముల 'పెడస్టాస్' అనబడు ప్రభుత్వపుతాబేదారులు నియమింపబడిరి. ఈ కారణముచే ఇటలీదేశపుస్త్రీలు తాము నూతనముగా పొందిన ఓటింగుహక్కు ఒక్కసారియైన చెలాయించకుండగనే అది బర్తరఫు ఆయెను. నాటినుండి నేటివఱకు ఇటలీదేశమున స్త్రీలకు ఓటింగుహక్కు అను వాక్యమే వినిపించుటలేదు.

### గృహామే స్త్రీల సర్వస్వము

స్త్రీలకు రాజ్యాంగమున తావులేకుండచేయుట ఫాసిస్టిజముదృష్టిలో సముచితమైనదైయున్నది. పిల్లలను కనిపెంచి పెద్దవారినిజేసి విద్యాబుద్ధులు చెప్పి దేశమున భావిసంతతి పెంపొందించుటకొఱకే స్త్రీలను దేవుడు సృష్టించియుండెనని ఫాసిస్టుల గాఢవిశ్వాసము. సంతానోత్పాదనము, తత్పరిపోషణము వారిదృష్టిలో అతిముఖ్యమైనవృత్తి. ఆవృత్తిలోనుండు వారు ఇతరవృత్తులనుగూర్చి తలపోయుటకు అవకాశముచాలదు. కావున గృహామే స్త్రీయొక్క రాజ్యము. ఆ రాజ్యమునకే ఆమె పూర్తిగ అంకితురాలైయుండుటకు విశేషప్రోత్సాహమొసంగబడవలయును. ఇటాలియనుజాతి ఆరోగ్యవంతమై, తేజస్సంపన్నమై కలకాలము వర్ధిల్లుచుండుటకు స్త్రీలను గృహారాజ్యమునకు అంకితులను చేయుటకంటె మించినసాధనము మఱియొకటిలేదు. ఇట్లని స్త్రీసమస్యాపరిష్కారవిషయమున ఫాసిస్టుల సిద్ధాంతములు.

### ప్రభుత్వము: స్త్రీలయభివృద్ధి

ఈ సిద్ధాంతముల ననుసరించి నేటి ఇటలీదేశపు ప్రభుత్వము స్త్రీల యభివృద్ధివిషయమై విశేషశ్రద్ధను చూపుచున్నది. స్త్రీలను ఆదర్శగృహిణులుగను, ఆద

ర్శమాతలుగను చేయువిషయమున నేటి ఇటలీదేశపు ప్రభుత్వము ముస్సోలినీగారి యాజమాన్యమున ప్రబల ప్రయత్నములు సాగించుచున్నది. ఫాసిస్టు పార్టీవారు ఏర్పఱచిన యువకసంఘములందు స్త్రీలు తాము కన్యలుగా నుండినప్పుడే చేరవలయును. అందు వారికి వారు తమదేశవిషయమున గావింపదగు విధ్యుక్తధర్మములన్నియు విపులముగ బోధింపబడును. కన్యాత్వము వీడి గృహిణులై మాతృత్వమువహించు కాలము ప్రాప్తించగా స్త్రీలకు దేశమంతయూ అలముకొనియున్న ఫాసిస్టుసంఘములు సమయోచితమగు విజ్ఞానమును, సముచితములగు విధులను ప్రబోధించుటయందు దీక్షవహించును. గృహనిర్వాహకత్వమునుగూర్చియు, శిశుపోషణ విధానమునుగూర్చియు వారికి విపులముగ ఉపన్యసింపబడును.

## మాతృత్వముయొక్క ఆధిక్యత

మాతృత్వముయొక్క ఆధిక్యతను, ఆవశ్యకతను నిరూపించి ప్రబోధించుటకు ఫాసిస్టు ప్రభుత్వమువారు ప్రత్యేకదీక్షను వహించుచున్నారు. పూర్వము ఇటలీదేశమున మాతృత్వ మొకదేవతారూపమున కొలువబడుచుండునది. ఆ దేవతనామము 'డియామాటూటా' అని. ఆ దేవతపూజ ఇపుడు తిరిగి ప్రభుత్వమువారి ఆజ్ఞచే పునరుద్ధరింపబడినది. ఆ దేవత విగ్రహములు ఇపుడు ఊరూర నెలకొల్పబడుచున్నవి. పావురమును ఒకచేతియందును, దానిమ్మకొమ్మ నొకచేతియందును పట్టుకొనియుండినటుల ఆదేవతరూపము చిత్రింపబడియుండును. దాంపత్యప్రేమకు పావురమును, సంతానోత్పాదనమునకు దానిమ్మయు చిహ్నములు. ఇటలీయందలి మ్యూజియములలోని స్త్రీల శిలావిగ్రహములలో పెక్కింటి చేతులలోను, భుజములమీదను, శిరస్సులపైనను పది పండ్రెండుగురు శిశువుల నెక్కించుకొనియుండినట్లుగలవు. మాతృత్వవిషయము తో మీ విగ్రహములను నేటి ఇటాలియనుస్త్రీలు అనుకరింపనగునని ఆ దేశపు వార్తాపత్రికలలో వ్యాసములు పుంఖానుపుంఖములుగ ప్రచురింపబడుచున్నవి. ఇతరదేశములందు జన్మనిరోధ మవలంబింపబడుచుండగా ఇటలీదేశమున సంతానోత్పాదనము విశేషముగా ప్రోత్సహింపబడుచున్నది. ఈప్రోత్సాహమునకు ముస్సోలినీగారే మూలపురుషులు. వారి యాజమాన్యమున ఈ నడుమ ఇటలీదేశమున ఒక్కుమ్మడిగా పలువివాహములు జరిగియుండుట వార్తాపత్రికలవలన మనము తెలిసికొనియేయున్నాము.

## ఇటలీదేశపు స్త్రీలు: వ్యాయామక్రీడలు

స్త్రీలను బలమైనసంతానము నుత్పాదించుమాతలుగ చేయు తీవ్రకాంక్షలో ఫాసిస్టు ప్రభుత్వమువారు స్త్రీలకు వ్యాయామక్రీడలు నిర్బంధమొనర్చియున్నారు. మొన్న మొన్నటివఱకు ఇటాలియనుస్త్రీలు వ్యాయామక్రీడలయందు పాల్గొనియెఱుగరు. స్త్రీల సుకుమారమైన అవయవములకు సరిపడు నున్నతమైన వ్యాయామక్రీడలయందుమాత్రమే వారు ప్రవేశించి పాల్గొనునట్లు ఫాసిస్టు ప్రభుత్వమువారు మంచి కట్టుదిట్టములను చేసియున్నారు. టెన్నిసు ఆట, ఈతకొట్టుట, గుఱ్ఱపుస్వారి, వ్యాయామము ఇవి నేటి ఇటాలియను యువతులు నిర్బంధముగా అభ్యసింపవలసియున్నది. బాలికల పాఠశాలలయందు ఇవి నేర్పబడుటకు సౌకర్యములు సంపాదించువిషయమున విశేషమైన శ్రద్ధ కనబఱుపబడుచున్నది.

## ఇతరదేశీయుల అభిప్రాయము

ఇటలీదేశపుస్త్రీల ఈ స్థితి ప్రాక్తన సాంప్రదాయబద్ధమైయున్నదని అమెరికాసంయుక్తరాష్ట్రములు, బ్రిటను మొదలగుదేశములందు తలంపబడుచున్నది. స్త్రీజనోద్యమము విషయమున ఫాసిస్టులకంటెను రోము నగరమునందు క్రైస్తవమతాచార్యుడు పోపు పూర్వాచారముల నెక్కువగ నాదరించి ప్రోత్సహించువాడగుటచేతనే ఇటలీ స్త్రీలలో పూర్వాచారపరాయణత ప్రబలియుండుటకు ముఖ్యకారణమైయుండునని పలువురిచే ఊహింపబడుచున్నది. వ్యాయామక్రీడలవిషయమున ఫాసిస్టులు ఇటాలియనుస్త్రీల కొసంగిన కొద్దిపాటి నూతనస్వాతంత్ర్యమునుగూడ పోపు మహాశయుడు స్పష్టవచనములయందు పలుసారులు నిరసించియున్నాడు.




# శ్రీ జటప్రోలు మహారాణీగారు

వీరి పుత్రరత్నమగు శ్రీరాజా వేంకటజగన్నాథ రావుబహద్దరువారు మైనరులగుటంజేసి శ్రీ మహారాణీ గారే జటప్రోలు సంస్థానమును పాలించుచున్నారు. వీరు రాజ్యపాలనకళానిపుణులని, అనుభవశీయులగు తత్సంస్థానప్రజలకేగాక, దిగంతవిశ్రాంతకీర్తిఁగడింపఁ జాలు ఘనకార్యము లెన్నియో వీరి పరిపాలనమున జరుపఁబడుటంజేసి, తద్విషయము లోకమునకును విదితమై యున్నది.

ఇఁకఁ బరోపకారము వర్ణించుదమన్న సామాన్య విషయముకాదు. కొల్లాపురరాజధాని యందు ప్రజోప కారార్థమై, ప్రజాసౌకర్యార్థమై, విద్యుద్దీపములను, నీటికొళాయిలును నమర్పఁబడినవి. భద్రాచల రామ స్వాములవారి ఆలయముచుట్టు నీటికొళాయిల నమ రింపఁజేసిన విఖ్యాతఘనులు వీరే. సంస్థానమంతయును విద్యామయమును చేయఁదలంచి, అచ్చటచ్చట పెక్కు విద్యాశాఖలు గల్పించుటయేకాక, యనేకమంది విద్యా ర్థులను హైదరాబాదు, చెన్నపురి మొదలగుపట్టణము లకు బంపి, వలసినంత ధనసహాయమిచ్చి విద్యావిధాన మును బ్రోత్సహించుచున్న ఘనులువీరే. నేడు హైదరా బాదుల్లో ఘనమయి వెలయు ఉన్నత బాలికాపాఠశాల, రెడ్డిహాస్టల్ మొదలగునవి వీరిసాహాయ్యమును పొందు చున్నవి.

దైవతారాధనతత్పరులని, భక్తశిఖామణులని సురభి వంశీయుల కనాదినుండివచ్చుచున్న ప్రఖ్యాతవిషయ మగుటంజేసి శ్రీరాణీగారి పట్లను నాఁడునాఁటి కయ్యది వృద్ధియగుచున్నయది. శ్రీరాణీగారికిఁగల తీర్థసేవనా సక్తియు, ధరణీసురభక్తియు, నిత్యపూజానురక్తియు, పైవిషయములకు సాక్ష్యములని చెప్పక చెప్పెడిని.

అధికారసంపత్తి శ్రీవారి గాంభీర్యచిత్తమును మార్ప లేదు. రాజ్యశ్రీ గర్వరేఖ శ్రీవారియుదారగుణమును చలింపలేదు. ఎట్టిమార్పునులేక పతియడుగుందమ్ముల నేగుచు నిరంతరపతిపాదారవిందధ్యానతత్పరత్నయై రాజ్యపాలనమందును, అంతఃపురమర్యాదలయందును, సదాచారసద్గుణశ్రీవిలసితయై, పతిహితబోధ నను సరించి నడచుచు పతిసంకల్పించిన కార్యములన్నియు సంపూర్ణముగ నెరవేర్చుచు శ్రీ రాణీగారు ప్రజా మోదము నందుచున్నారు.

శ్రీరాణీగారి నిశ్చలతత్వమెట్టిదో చెప్పుటకు పై విషయంబులన్నియుఁ బ్రబల నిదర్శనంబులే. అధికా రము వహించుట సామాన్యవిషయముకాదు. అందు రాజ్యాధికారభావము వహించుట కడుంకడుకష్టము. వహించి సర్వజనసమ్మతముగ పరిపాలించుటకును, వివిధ మతస్థులను సమముగజూచి నాదరించుటకును, ప్రజలను గంటికిరెప్పవలె సంరక్షించుటకును, సంస్థానమందు వెల యు శాఖలనన్నిటిని స్వాధీనమునందుంచుకొని తగు పరీ క్షలచేయుటకును,—నెంత పరిజ్ఞానముండవలయునో, యెంత కుశాగ్రబుద్ధియుండవలయునో, బాగుగ పరి శీలించినంత శ్రీవారి నిశ్చలతత్త్వ మిన్ని స్వరూపము లను వహించియున్నదని విస్పష్టమగు.

పరమేశ్వరుఁడు శ్రీ రాణీగారికి సంపూర్ణాయురా రోగ్యశ్రీలను బ్రసాదించి సంరక్షించుగాత.

—వి. రామసుబ్బారాయఁడు, బి.ఏ.




# రాజపాళెయమందలి ఆంధ్రక్షత్రియులు

## (తమిళదేశమందలి రామనాథపురం జిల్లా రాజపాళెయ మందలి ఆంధ్రక్షత్రియకుటుంబముల సంక్షిప్తవివరములు.)

### గ్రామ నిర్మాణము

రాజపాళెయమున బ్రవేశించుటకు పూర్వము మా క్షత్రియకుటుంబములన్నియు నొకచోటయుండక వేరు వేరు తావులందును, వేరువేరు పనులయందును చీలియున్నట్లు చెప్పుకొనబడుచున్నది. ప్రస్తుతపు రాజపాళెయమున కనతిదూరముననుండు, రాజకులరామను గ్రామము వీరి మొదటివలసగానుండెను. సమీపమునందలి మహారణ్యములలోనికి పూర్వులు వేటలకు వెళ్ళుచుండిరట. ఇప్పటి గ్రామసీమ యాకాలమున నరణ్యమునందే చేరియుండెను. కాని చుట్టుప్రక్కల కొన్ని చెఱువులును పురాతనదేవాలయములును దోపిడిగాండ్రగూడెములును మఱియు, దూరదూరమున కొన్ని కుగ్రామములును, ఉండినట్లు తెలియుచున్నది. గ్రామనిర్మాణమున కనుకూలమగు ప్రదేశమగుటచేతను, మధురనుండి కన్యాకుమరికి పోవు రహదారి దగ్గరగా నుండుటచేతను, చుట్టుప్రక్కల కొన్నికమ్మవారి వలస లేర్పడియుండుటచేతను, రాజకులరామమునుండి లేచివచ్చి ప్రస్తుతము 'పాతపాలె' మనబడు ప్రదేశములో శంకుస్థాపన మొనర్చి గ్రామమును నిర్మించుకొనిరి. అప్పటినుండియే దీనికి రాజపాళెయ మనుపేరు వాడుకయైనది. దొంగలయొక్కయు, అడవిమృగములయొక్కయు ఉపద్రవమువలన గ్రామముచుట్టును చిన్నప్రాకారమొకటి కట్టి కోటయని పిలువసాగిరి. ప్రథమమున ప్రవేశించినవారు స్వల్పసంఖ్యాకు లయినను, తమకై ప్రత్యేక గ్రామనిర్మాణమయిన తరువాత, పరిసరములందున్న గ్రామములనుండి, మిగిలినవారును క్రమముగా రాసాగిరి. తమకు కావలసిన యాంధ్రబ్రాహ్మణపురోహితులను, భట్రాజులను పనిపాటలకై కుమ్మరి మొదలగు నితరకులములవారిని తమగ్రామములో నుంచుకొనిరి. అడవులను నరికి పొలములుగామార్చి ఆక్రమించుకొనియుండిరి.

ఈగ్రామనిర్మాణకాలమును నిర్ణయించుటకు తగిన ఆధారములు చిక్కకున్నవి. పైనజెప్పిన దానశాసనములోని భూమి రాజపాళెయ గ్రామనిర్మాణమునకు బిమ్మటనే పొందబడియుండుటచేత, క్రీ. శ. 1650 కి పూర్వమే గ్రామనిర్మాణము జరిగియుండవలయును. తిరుమలనాయకునిక్రింద నుండెడు పాళెయగార్లలో రాజపాళెయపు రాజులు గూడనుండినట్లు టెయిలర్సు హిస్టారికల్ మాన్యుస్క్రిప్టులనుబట్టి తెలియవచ్చుచున్నది. తిరుమలనాయకుడు క్రీ. శ. 1623 లో పరిపాలింప నారంభించెను గాన నితని రాజ్యకాలప్రారంభమునకే అనగా క్రీ. శ 1600 ప్రాంతమునకే మేమీ రాజపాళెయమున నివసించుచుంటిమని తేలుచున్నది. తరముల లెక్కించిచూచిన ప్రథమమున వచ్చినట్లు చెప్పబడువారు 12-వ తరమువా రగుచున్నారు. తరమునకు కనీసము 25 ఏండ్ల చొప్పున జూచినను 300 సంవత్సరములగుచున్నందున పైకాలము సరిగా నుండవచ్చునని యభిప్రాయపడుచున్నాము.

రాజపాళెయమునకు చుట్టునుండు నడవులు చెఱువులు వ్యవసాయయోగ్యములగు భూములు వీరిక్రిందనే యుండుటచేతను, స్థిరముగా నొకగ్రామము ఏర్పడియుండుటచేతను, అంతకుపూర్వమే దూరదూరమున చెదఱియుండినక్షత్రియకుటుంబము లనేకములు రాజపాళెమున నిండిపోయినవి. క్రమముగా జనసంఖ్య

హెచ్చుటచేతను చోటు చాలకందునను సమీపముననే మతియొక గ్రామము కూడ నిర్మింపవలసివచ్చెను. మొదటిగ్రామమునకు దక్షిణమున ఒకమైలుదూరములో మఱియొక ప్రాకారావృతమగు గ్రామమును కట్టికొని "సింగరాజుకోట" యనియు, "మిట్టపాలె" మనియు వ్యవహరించుచుండిరి. ఈ నూతన గ్రామనిర్మాణమునకు కారకులైన గొట్టిముక్కలవారిలో సింగరాజు ప్రధానుడై యుండవచ్చును. వీరికే మహామండలేశ్వరులను బిరుదుండినట్టుల వీరు వ్రాసిన తాళపత్రగ్రంథములవలన దెలియవచ్చుచున్నది. 1737 వఱకు రాజ్యమేలిన విజయరంగ చొక్కనాథ భూపాలునివలన ఈ గొట్టిముక్కల దొరలు చెఱువులు, తోటలుకలిగిన కొంతభూమిని 430 బంగారపుహొన్నులకు కొనియుండిరని వీరివద్దనున్న క్రయశాసనమువలన దెలియుచున్నది. మొదటిగ్రామము కలిగిన 50, 60 సంవత్సరములకొనుకనే ఇది నిర్మింపబడినట్లు చెప్పుకొనబడుచున్నది. క్రమక్రమముగా జనసంఖ్య పెరిగినకొలదియు పై రెండుకోటలకుమధ్య మఱియొక చిన్నగ్రామమును "జగ్గరాజుకోట" యను పేరుతో స్థాపించుకొనిరి. ఈవిధముగ నాంధ్రక్షత్రియులు రాజపాళెమమున 300 సంవత్సరములకు పూర్వమే స్థిరపడిపోయిరి.

## పూర్వులు

వ్యవసాయయోగ్యములగు భూములను అడవులను స్వాధీనపఱచుకొని, నాయకరాజులకు పాళెయగాండ్లుగానుండి, ఆకాలమున దొంగలు దోపిడిగాండ్రు ఊళ్ళను బాధించుచుండగా వారినంపరి దయమగొట్టి తమకు విధ్యుక్తమగు శాంతిస్థాపనను క్షత్రియసహజమగు దుష్టనిగ్రహమును జేసియుండిరి. మండలములందలి చిన్న సంస్థానములలోను జమీన్లలోను ప్రవేశించి సక్రమపరిపాలనయందు తమకుగల సామర్థ్యమును న్యాయబుద్ధిని దయాదాక్షిణ్యాదిసద్గుణముల జూపించి వారిచే నధికముగ గౌరవింపబడుచుండిరి.

మాపూర్వులు సంఘనిర్మాణమునకు చక్కని యేర్పాట్లు గావించియుండిరి. ఊరుచుట్టును చిన్న చిన్న పూదోటలను నిర్మించి సమిష్టి ఉపయోగమునకై అందొకబావియు, మఠమును కట్టించి "నందవనము" లను పేర ధర్మములు గావించియున్నారు.

ఊరిమధ్యమున చతురశ్రమగు విశాలప్రదేశమును ఇండ్లు కట్టక విడిచియుంచి, తమపసువులమందలు విశ్రాంతి దీసికొనుటకును పిల్లలు ఆడుకొనుటకును తదితర గ్రామావసరములకును ఉపయోగించుకొనుచుండిరి. ఊరివారిపశువులు దొంగిలింపబడకుండ పూర్వకాలమున నీ "మందలు" మిక్కిలి యుపయోగపడియుండును.

ఒకొక్కయింటిపేరుమీద ఒకొక్కసావడి కట్టబడి, జ్ఞాతులందరు సమావేశమగుటకును తీఱికకాలమందు విశ్రాంతి దీసికొనుటకును ఉపయోగింపబడుచుండెడివి. ఒకొక్కగ్రామమునకును ఒకొక్కపెద్దసావడిగూడ కట్టబడియున్నది. ఆగ్రామవాసులందరును అప్పుడప్పుడు సమావేశమై సాంఘికమతరాజకీయాదివిషయముల జర్చించుటకును, ఊరిసమష్టి ఉపయోగమునకు గావలసిన పల్లకి, మేనా మొదలగు సామానులనుంచుకొనుటకును, తమ్ముజూడవచ్చు పెద్దల గలసుకొని మర్యాదచేయుటకును ఉపయోగింపబడుచుండెను.

జాతిచీలిపోకుండ జేయుటకుగాను 'గుంపులు' ఏర్పరుపబడినవి. 'గుంపు'నగా సాంఘికసభ. కేవలము వాదవివాదము చేయు సభలవలెగాక అధికారయుతములగు పంచాయతుల వంటివి. సలకట్టుబాట్లను ఆచారములను మార్చుటకుగాని పోట్లాటలు తీర్చుటకుగాని గ్రామపరిపాలనవిషయములోగాని ఈ గుంపులకే పూర్తియైన అధికారముండెడిది. ఇంటికింతయని గుంపుకు పన్నుచెల్లించుచు గుంపువారి తీర్మానములను జరిమానాలను, దండనలను ఒప్పుకొనవలెను ఈవిధముగా మాపూర్వులు తమ సంఘమును నియమములతో బంధించుకొనియుండిరి.

ప్రస్తుత మింతతో నాపి పైమాసమున మాపూర్వులు రచియించిన గ్రంథములనుగూర్చి కొంత తెలిపి నేటి మాపరిస్థితులనుగూర్చి వివరింపగలనని మనవి చేయుచున్నాను.

# ఇన్ష్యూరెన్సు విషయములు

## ఆర్ధిక విధానము : ఇన్సూరెన్సు

### మూలధనము.

పెట్టుబడి విషయములో యిన్సూరెన్సుకు యెక్కువ సంబంధముగలదు. మన కార్ఖానాగారములు, ధాన్యపు కొట్లు, గిడ్డంగులు, మిల్లులు, రైళ్ళు, మోటారులు, మిషనులు, ఉత్పత్తికి కావలసినవస్తువులు, సగముతయారయిన వస్తువులు, పూర్తిగ తయారుకాబడిన వస్తువులు, పాడి పంటలు, ప్రభుత్వపు ఆఫీసులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయములు - వీటిపై చేయబడిన యిన్సూరెన్సును గమనింపుడు. ఇవన్నియు మానవుని నిరంతరకృషివలన పొందబడిన వసతులు. అవి ఎల్లప్పుడు మంచిస్థితిలోనుండుట అవసరము. వీటికన్నియు అపాయములు రావచ్చును. కావున అగ్ని పాలిసీలు, నావికా పాలిసీలు, చోరీపాలిసీలు, యంత్రసంబంధమగు పాలిసీలు, మోటారు, మొదలగు పాలసీలను పొంది వాటి సంరక్షణ గావించుకొనవచ్చును. ఇవి నశించినను వాటి పునరుద్ధరణకు కావలసిన మూలద్రవ్యము పొందవచ్చును. అపాయము యీవిధముగ కొలతయిడుటకు వీలగునట్టి స్థితికి తేబడుచున్నది. అంతేకాదు. ఈ మూలద్రవ్యము కూడబెట్టుటచే పొందబడినది. ధనము కూడబెట్టుటకు కారణములు అనేకములు—తనకును తనకుటుంబమునకును రక్షణ; సాంఘికగౌరవము, అధికారము పొందుట; వడ్డీ పొందుట. ఇట్లు సేకరింపబడు ద్రవ్యము వాటి నిర్మూలమునకు కారణభూతమగు అపాయమునకు గురియగుచో, ధనము సేకరింపవలెనను పట్టుదలయుండదు. తాము లాభముపొందువరకు తమ సంపాదనయంతయు వెచ్చింతురు. ఇన్సూరెన్సు ధనమును సేకరించుటకు సహాయకారి. అందువలననే ప్రభుత్వమువారు యిన్సూరెన్సుకు కట్టుధనముపై రాబడిపన్ను విధింపరు. పూర్తి జీవితము, ఎండోమెంటు భీమాలవలన, తన మరణానంతరము తన ఆప్తులకును, తనకేవుద్యోగమునుండి విరమించు కాలమున తన అవసరమునకును ధనము దొరకును. ఈ విధముగ మూలధనము వృద్ధియగుచున్నది. ఇండస్ట్రియలు పాలిసీలవలన బీదవారు కూడ ద్రవ్యము కూడబెట్టుట తటస్థించుచున్నది. తమ బిడ్డల విద్యాభివృద్ధికో, తమ దినవారపుఖర్చులకో తమ జీవితములోనే ద్రవ్యము సేకరించుటకు వీలున్నది. ఈ భీమాపద్ధతులన్నియు ఆర్థికముగ నమ్మకములైనవి. మూలధనము వృద్ధియగుకొలది దేశస్థితి బాగుపడునుగదా?

> **సుభాషితము**
>
> **౧౬**
>
> "జూదమాడుట అను దుర్గుణమునకు విరుద్ధమైనది పొదుపుచేయుట అను సద్గుణము. పొదుపరియగువానికి పోడిమి అను తన సద్గుణమును లెస్సగ అనుష్ఠించుటకు అవకాశము కల్పించునది జీవితభీమావిధానము. పొదుపు అను మంచిగుణమును ఆచరించుటకు వీలుకల్గించు ఇతర సాధనములగు సేవింగ్సుబ్యాంకు, తాకట్టుపట్టుట, కూడబెట్టుట మొదలగునవి జీవితభీమా విధానముతో సాదృశ్యమునకు నిలువచాలని మోటైన, వ్యర్థమైన పద్ధతులు."
>
> —లాయడ్ జార్జి.

ప్రీమియముల క్రింద వసూలు కాబడు ద్రవ్యములో, క్లెయిములు యితర ఖర్చులు పోను మిగత, గవర్నమెంటుకో, మునిసిపాలిటీలకో, కార్మిక సంస్థలకో అప్పివ్వబడును. రైళ్ళు, రోడ్లు, యిండ్లు, నీటివసతులు, యంత్ర నిర్మాణము, రేవులు, వీటికి యిన్సూరెన్సు ద్రవ్యము యెంత సహాయము చేసియుండునో మనమెట్లు చెప్పగలము? ఈవిధముగ సాంఘిక సేవయేగాక ఆర్థిక సంపత్తికిని యిన్సూరెన్సు సహకారియగుచున్నది.

## వ్యవస్థాపన.

వ్యవస్థాపకుని బాధ్యతలన్నియు యిన్సూరెన్సు వహించజాలదు. ఇన్సూరెన్సుకిచట యెక్కువ సంబంధము లేదు. అతని బాధ్యతలు అనేక విధములు, గణింపతరము కానివి.

ఋణాభీమాయని క్రొత్తగనొక పద్ధతి యేర్పడినది. వస్తువును కొన్న యాతడు తోడనే దానిఖరీదు నిచ్చుటకు వీలుపడనిచో మూడు నెలలు గడువియ్యబడును. నియమిత కాలమున ద్రవ్యమిచ్చుటకు వీలులేనిచో ఆనష్టము రాకుండుటకు అంతవరకొక పాలిసీ తీసుకొనవచ్చును. ఇన్సూరెన్సు: ఋణము అను విషయమును గూర్చి గతమాసపు సంచికలో వ్రాసియేయున్నాను.

## ఇన్సూరెన్సు: మార్కెట్లు.

ఒక వస్తువునకు విలువ కల్గింపవలెనన్న, దాని స్థితిని మార్చి, అది యెచట తక్కువగ ఉపయోగింపబడునో అచటినుండి అది యెక్కువగ కోరబడు చోటికి పంపబడవలెను. మార్కెట్లు ప్రపంచ వ్యాప్తిచెందియున్నవి. ఎక్కువగ కోరబడు ప్రదేశములకు వస్తువులను యెగుమతి చేయుటకు, రైలు రోడ్డు, సముద్రము, వాయుయంత్రములు వీటి సహాయము కావలెను. ఎక్కువ ద్రవ్యము వెచ్చించి, కృషిచే నిర్మింపబడిన వస్తుచయమును రక్షించుటయేగాక, వాటిని గొంపోవు పరికరములు సైతము రక్షింపబడవలెను. ఈపరికరములను ఉపయోగించునప్పుడు యితరుల హక్కులలో జోక్యము కలుగజేసికొని వారికో వారి ఆస్తికో నష్టము కలిగింపవచ్చును. ఈ అపాయములన్నియు యిన్సూరెన్సు కంపెనీలు తీసికొనును.

## ఇన్సూరెన్సు: ఇతర దేశములతో వ్యాపారము.

బ్రిటను దేశము ఇతర దేశములతో ఎక్కువ వ్యాపార సంబంధము కల్గియున్నది. కారణము యిన్సూరెన్సు కంపెనీల, బ్యాంకుల సహాయమే. వీటివలన స్థిరత్వమును, ఋణమును దొరకుచున్నది. ఒకడు మరొక దేశములకు సరకుల నెగుమతి చేయుననుకొందము. ఆసరకులు గమ్యస్థానము చేరనిదే డబ్బురాదు. ఇందులకే మూడు నెలలో పట్టును. అంతవరకు వ్యాపారి మూలధనము పూరకుండవలసినదే. అతని సరకులు సముద్రప్రయాణమునకు సంబంధించిన అపాయములకు లోనగుచుండును. అతను తన బ్యాంకరువద్దకు వెళ్ళి, తన సరకులను గొనువారి పేళ్ళను దెల్పుచు, ఆసరకులపై తీసుకొన్న నావికాభీమా పాలిసీని వారికందిచ్చును. ఆపేళ్ళు తృప్తిని గల్గించుచో బ్యాంకులు తోడనే ఋణమిచ్చివేయును. వ్యాపారి అందువలన ఊరకుండక ఆద్రవ్యమును మరల నూతన వస్తునిర్మాణమునకై వినియోగించును. ఈవిధముగ వ్యాపారము వృద్ధియగుచువచ్చును. వ్యాపారమంతయు ఋణముపై నాధారపడియున్నది. ఈ ఋణమునకు

### సుభాషితము

౧౭

"నీకుగలచింత నీదేహారోగ్యమును గూర్చినదియైనను, నీవృద్ధాప్యమునందలి సుఖశాంతులను గూర్చినదియైనను, నీ మరణానంతరము నీ ఆలుబిడ్డల జీవితాధారమును గూర్చినదియైనను, త్వరలో యౌవనమును పొందనున్న నీకుమారునకు ఆలంబనము ఇచ్చుటనుగూర్చినదియైనను, నేడు రెండుమూడేండ్ల చిన్నారి బిడ్డయగు నీకూతురు వయోగ్యయైనపుడు ఆమె కీయగల పెండ్లికట్నమును గూర్చినదియైనను;— ఇందు యేదైన కానిమ్ము— నీ జీవితమును భీమా చేసికొని యుండుము."

— ఛార్లెసు డికెన్సు.

యిన్సూరెన్సు యొక్క స్థిరరక్షణలేనిచో చక్కగ కొనసాగదు.

బ్రిటను తన ఆహారపదార్థములకు యితర దేశములపై నాధారపడవలెను. తయారయిన వస్తువులను ఎగుమతిచేసియు, యితర దేశములలో తమ పెట్టుబడి నుండి వచ్చువడ్డీతోను, యితరదేశీయుల సామాగ్రుల నొకదేశమునుండి యింకొకదేశమునకు తీసికొని పోవుటవలన వచ్చు లాభములతోను, తన వస్తువులను కొనుచున్నది. బ్రిటీషు యిన్సూరెన్సు కంపెనీలు యితరదేశములలో సంపాదించు లాభములు - యివన్నియు బ్రిటనుయొక్క సంపదను వృద్ధిపరచుచున్నవి. ఈ విధముగ భీమాకును, యెగుమతికిని సంబంధముకలదు.

ధనము విలువ స్థిరత్వము కల్గియుండవలెను. అవి మార్పుచెందుచో యిన్సూరుచేసినవారికి నష్టమగును.

## విభజన.

విభజన. ఇందులో యిన్సూరెన్సుకు స్థానములేదు.

## వినియోగము.

ఆర్థికపరిశ్రమకు తుదిది వినియోగము : మానవులు, యితరులు తయారుచేసిన వస్తువులను, భావినిర్మాణమునకైగాక వుపయోగించుటకు కొనెదము కొన్ని వస్తువులు చాలకాలము ఉపయోగపడును (యిండ్లు మొదలగునవి). కొన్ని శీఘ్రముగ నశించును (ఆహారపదార్థములు).

ఏది యెట్లున్నను, వుపయోగార్హమగు వస్తువులన్నియు ఒకింతకాలము విలువను కల్గియుండును. అవి వాడబడుటకు పూర్వమే ప్రమాదములకు గురియై నశింపవచ్చును. ఇందుల కుదాహరణములు: యిండ్లు, మోటారులు, కుటుంబమునకు కావలసిన యితరసామగ్రి, వస్త్రములు మొదలగునవి. ఇవి త్వరితముగ నశింపకుండుటకై అగ్ని, చోరీ, మోటారుపాలిసీలు తీసుకొనుచున్నాము. అవిగాక, జడివాన, వెల్లువలు, భూకంపము, విమానములు, వీటివల్ల నష్టముగాకుండ యిన్సూరుచేయుచున్నాము. ఈవినియోగమున కిటీవల నూతనవసతు లేర్పడినవి. ఉపయోగించువారికి ఋణమివ్వడము. కొంతకాలమును, శాశ్వతముగను ఉండు వస్తువులను కొనువాడు ద్రవ్యమునంతయు అప్పుడే యివ్వక, ఆవస్తువులను తాననుభవించుచునే, నిర్ణీతకాలము వరకు కొద్దిగ, క్రమముగ అప్పు చెల్లింపవచ్చును. అప్పుతీరు వరకు ఆస్తి విక్రేతదే. గృహనిర్మాణసంఘములు, మోటారు కంపెనీలు యిట్టి వసతుల నిచ్చుచున్నవి. పూర్తి బాకీ తీరువరకు యీవస్తువులు యిన్సూరెన్సుచే రక్షింపబడవలెను. వ్యాపారమునకు సంబంధించిన సాధారణ అపాయములను, ఆవ్యాపారమునకు ప్రత్యేకింపబడిన ఆర్థికసంస్థలే తొలగింపవలెను. కాని స్థిరత్వము గూర్చిన రక్షణ యిన్సూరెన్సుచేసినవారికే పొందును. ఇన్సూరెన్సు వసతులువలననే, వస్తువుల నుపయోగించువారికి ఋణము దొరకుచున్నది. ఇందువలన వ్యాపారము వృద్ధియగును. సాధారణముగ మోటారుకారు కొననేరనివాడు, నెల కింతయని యిచ్చి కొనమన్న సులభముగ కొనగలడుగదా! అతడు పూర్తిగ డబ్బు చెల్లించువరకు యిన్సూరెన్సురక్షణయుండిన నష్టముండదుగదా! ఇందువలన వ్యాపారమును అభివృద్ధి చెందుచున్నది.

ఇన్సూరెన్సు స్థిరత్వము, నమ్మకము నిచ్చుచున్నది. నష్టమునుండి విముక్తియిచ్చు యీనమ్మకము ఆర్థికవిధానమున చాలముఖ్యమైన అంశము. ఆర్థికవిధానమును ప్రతివిషయమునందును యిన్సూరెన్సు బలపరచుచున్నది. పెట్టుబడిదారునికి మూలధనమునకు నష్టమురానీకుండగను; పనివానికి నిరుద్యోగము, రోగము, ప్రమాదముల బ్రతుకుతెరువు చెడకుండగను కాపాడుచున్నది. వ్యాపారమును ఋణముచే (ద్రవ్యసహాయముచే) వృద్ధికి దెచ్చుచున్నది. ధనమును కూడబెట్టు అలవాటును పెంపొందించి, మన జీవితపు స్థితికి ఔన్నత్యము కల్గించుచున్నది. కంపెనీలు అకాలమరణము, అగ్ని, ప్రమాదములవలనకలుగు ఆర్థికములగు ఖర్చును తగ్గించుటకై, రక్షణపరికరములను వాడుకలోనికి దెచ్చుచు, జీవితపాలసీదారులకు ఆరోగ్యవిషయికమయిన సలహానిచ్చుచున్నవి. ఆర్థికవిధానమున యిన్సూరెన్సు యీవిధముగ ఒకభాగమై విరాజిల్లుచున్నది.

—అలూరు రామచంద్రయ్య, బి.ఏ.

# ఆరోగ్యవిజ్ఞానము

దగ్గుట్టలో నూపవలసిన మెలుకువలు

మానవుని ఊపిరితిత్తులలో అతిసున్నితమైన స్పాంజి వంటి టిస్యూలుండును. అట్టి టిస్యూలు ఒకొక్కప్పుడు రేగి ఉద్రిక్తములుకాగా శ్లేష్మము అడ్డుకొనును. ఈ అడ్డుకొనిన శ్లేష్మమును తొలగించి వైచుటకు చేయు ప్రయత్నమున మనము దగ్గుదుము. ఈ దగ్గుట మనము బిగ్గరగాచేసి బలవంతముగా ఆ శ్లేష్మమును వెలిక్రిదోయ ప్రయత్నింతుమేని ఊపిరితిత్తులలోని అతిసున్నితమైన టిస్యూలకు తప్పక హాని కలిగించుకొందుము. కావున దగ్గవలసివచ్చినపుడు సాధ్యమైనంత మెల్లిగ దగ్గుట అభ్యాసము చేసికొనుము. ఇట్లు మెల్లిగనే కళ్లి రేగిపడునట్లు చేయవలయును. ఈరీతి దగ్గగాక గొంతుక ఎండుటచేగూడ దగ్గు రావచ్చును. దీనినే పొడిదగ్గు అని అందుము ఈ పొడిదగ్గు కలిగినపుడు చెఱకుముక్కలను నమలి కొద్దికొద్దిగా రసము మింగుటచేగాని, కలకండ ముక్కను బుగ్గని ఉంచుకొని ఊటమింగుటచేగాని మంచి కార్యకారిగా నుండగలదు. ఇట్లు చేయుటచే ఉమ్మినీరు బాగుగా ఊరి గొంతుకను తడిచేయును. అంతతో పొడిదగ్గు తగ్గిపోయి సుఖము కలుగును.

## ౯. నీరుల్లిపాయలు : కలరా

నీరుల్లిపాయలకు గల సుగుణములలో కలరా రోగమును నిరోధించుటయందు దానికిగల గొప్పశక్తియొకటి. కలరారోగికలయింట పండుకొనువారు తమ పక్కల కింద కొన్ని నీరుల్లిపాయలను వైచికొని పండుకొనుట మంచిది. ఇట్లుచేయుటచే ఆ నీరుల్లిపాయలు కలరా రోగమును కలిగించు క్రిములను దరికి రానీయవు; పరిసరమునందు కలరాక్రిములను నాశనముచేయును. అర్థశతాబ్దికి పూర్వము లండను మహానగరమున కలరా జాడ్యము ప్రబలముగా వ్యాపించినపుడు దాని నరికట్టుటకు విశేషముగా అవలంబింపబడిన సాధనములలో పక్కలక్రింద ఉల్లిపాయలుంచుకొనుట యొకటి. ఈ సాధనము చాలబాగుగ పనిచేసినదని అనుభవజ్ఞులు పలువురు చెప్పియున్నారు. పచ్చివిగాని, బాగుగా ఉడకబెట్టినవిగాని, కొంచముగా ఉడకబెట్టినవిగాని, నీరుల్లిపాయలు క్రిమిసంహారకములని వస్తుగుణసర్వస్వము చెప్పుచున్నది.

## ౯. భోజనసమయమున నీరుత్రాగుట

కొందఱికి భోజనసమయమున ముద్ద నోటిలో పెట్టుకొనుటతోడనే కంఠమునకేదో అడ్డుపడినట్లుండి వెంటనే మంచినీళ్ళుత్రాగవలయునను బుద్ధిపుట్టును. ఇట్లు నీరుత్రాగుటవలన ఏమైన హానికలదా యనినచో అది ఆ మనుష్యుని అలవాటునుబట్టి యుండును. సాధారణముగ భోజనసమయమున మంచినీళ్ళు విస్తరించిత్రాగుట ఆరోగ్యప్రదముకాదని ఆరోగ్యశాస్త్రవేత్తలు చెప్పుదురు. కాని చిన్నతనమునుండియు భోజనసమయమున నీళ్ళుత్రాగుట అలవాటుగలవాని జీర్ణకోశము ఆ పరిస్థితులకు లెస్సగ వాడుకపడును. పలువురు భోజనసమయమున నీళ్ళుతీసికొనకయే యుందురు; అట్టివారు భోజనానంతరము తీసికొందురు. కొంచెము ప్రయత్నించినచో భోజనసమయమున నీరుత్రాగు అలవాటును మాన్పుకొనవచ్చును. భోజనముతోగూడ నీరుత్రాగక తప్పని సరియైనచో ఒకటిరెండు గ్రుక్కలతోడనే తృప్తికలిగించుకొనుట మంచిది. భోజనమునకు పూర్వమును, పిమ్మటను ఆచమనముచేయు బ్రాహ్మణుల పద్ధతి ఆరోగ్యశాస్త్రజ్ఞుల దృష్టిలో మహత్తరమైనది. భోజనమునకు పూర్వముచేయు ఆచమనము ఆహారమార్గమును సరిచేసి ఉమ్మినీరు బాగుగా ఊరుటకు వీలు

కల్గించును. భోజనమునకు పిమ్మటచేయు ఆచమనము తోషణమును కల్గించి జీర్ణకోశమున ఆహారము సరుదు కొనుటకు అనువు కల్పించును. మనము తిను ఆహారములో జలము విశేషముగ కలసి దానిని బొత్తిగా ద్రవపదార్థముగ గావించినచో అది బాగుగా జీర్ణమగుట దుస్తరమగును. జీర్ణకోశము లెస్సగ పనిచేయుటకు అది సమశీతోష్ణస్థితియందుండవలయును. ఆహారముతోబాటు చల్లనినీటితో జీర్ణకోశమును నింపినేమేని దాని సమశీతోష్ణస్థితికి భంగము కలుగగలదు. ఉదయమున లేచినతోడను, రాత్రి పరుండబోవునపుడును, భోజనకాలములకు నడుమను జలపానముచేయు అలవాటు చేసికొనుట మంచి ఆరోగ్యనియమము.

. దోసకాయ విలువ

తొక్కతీసివైచిన దోసకాయ ముక్కలకంటె తొక్కతోనున్న దోసకాయముక్కలు సులభముగ జీర్ణమగునన్నసంగతి మనమెప్పుడును మఱచిపోరాదు. తఱుగుటకుముందు దోసకాయను బాగుగ కడగి ఉపయోగింపవలెను. తొక్కతో ఉపయోగించుటకు కిట్టనివారు తొక్కను సాధ్యమగునంత లేల్చి తీసివేయవలెను. పసుపు పచ్చని తొక్కకును లోని తెల్లని పదార్థమునకును నడుమ దోసకాయలలో ముదుర ఆకుపచ్చరంగు పొరలు ఉండును. ఈ పొరలు దోసకాయ యొక్క రుచిని, పదార్థపు విలువను హెచ్చించును. నిమ్మకాయరసము, ఆలివ్‌నూనె కలిపి తయారుచేసిన దోసకాయముక్కల పచ్చడి జిహ్వకు ఎంతయో రుచిగా నుండుటయేగాక దేహమున కెంతయో పుష్టి నిచ్చును. దోసకాయలు నిలువయుండుటచే గట్టిపడి పోయినచో వానిని రెండుగాకోసి గింజలు తీసివైచి ఉప్పుచేర్చి మఱగబెట్టిననీటిలో కొద్దికాలముంచినచో అవి ఉపయోగార్హములగురీతిని మెత్తపడును. దోసకాయతో పులుసుకూర మొదలగు వ్యంజనములను సుళువుగా చేయవచ్చుననుట పలువురెఱింగినదే. వండబడకుండ పచ్చడిగా చేయదగు కూరగాయలలో దోసకాయ యొకటి. దోసకాయ తొక్కలతో ఒడలు రుద్దుకొనుట ఎంతయుమంచిది. చర్మదోషములను పోకార్చుటలో దోసకాయ సాటిలేనిది. ముఖవర్చస్సును పెంపొందించుటకు చేయబడు లోషనులు, క్రీములు దోసకాయలరసముతోడనే చేయబడుచున్నవని పలువురకు తెలియదు. చర్మమున కెంతయో మేలు చేకూర్చునదగుటచేతనే శాస్త్రజ్ఞులు ముఖసౌందర్యమును పోషించు లోషనులు, క్రీములు చేయుటకు దోసకాయను గైకొనినారు. ఎండచే వాడి వత్తలయిన చర్మమునకు దోసకాయరసము రాచుటవల్ల, దోసకాయ పెచ్చులతో ఒడలుతోముకొనుటవలన మంచి ఉపశాంతి కలుగును వంటసమయమున దినదినము నిప్పు సెగకు పాల్పడి సహజకాంతిని, సౌందర్యమును గోల్పోవు తమ ముంజేతులను స్త్రీలు దోసకాయపెచ్చులతో రుద్దుచు కడుగుకొనుచుండుచో అవి సహజకాంతిని, సౌందర్యమును గోల్పోవక ఎప్పటివకముతో ఒప్పుచుండును.

5. వృద్ధాప్యమున కలుగు మలబద్ధమునకు

వృద్ధాప్యమున కలుగు మలబద్ధమును నివారించుటకు విరేచనౌషధములను ఎంతమాత్రమును వాడరాదు. అవి నీరసపెట్టును. క్రొత్తగా చిలికిన వెన్నను ధారాళముగ భుజించుట వృద్ధాప్యమునకలుగు మలబద్ధమును నివారించుటకు పరమహంసక్రియ. కొవ్వునొసంగు ఆహారములలో అతిసులభముగా జీర్ణమగు పదార్థము వెన్న. క్రొత్తగా చిలికిన వెన్ననుతినుటచే అందుండు శరీరపోషక పదార్థములను నూటికి తొంబదిఎనిమిదిపాళ్లవఱకు మన శరీరము గ్రహింపగలదు. వెన్నలో ఎ. బి. విటమినులు నిండాకలియున్నవి. వెచ్చబెట్టుటచే నేతియందు విటమినులు నశించుచున్నవి. అగుటచేతనే నెయ్యికంటె వెన్న ఆరోగ్యప్రదమనుట. మాంసాహారులు వెన్నను తినుటలో నొకజాగ్రత్తను చూపవలయును. మాంసము తినినవెంటనేగాని మాంసముతోగాని వెన్నను తినరాదు. తినినచో వెన్ననుండి పొందగలుగు పోషకపదార్థములలో కొంచెమైనను వారు పొందజాలరు. నిలువయుండి పులిసిపోయినవెన్న జీర్ణకోశమునకు చాల చెఱుపు చేయును. పరిశుభ్రమైన చన్నీటిలో పడవైచియుంచుటచే వెన్న చెడిపోకుండును. ఏదినమున కాదినము నిలవనీటిని తీసివైచి క్రొత్తనీటిని చేర్చుచుండవలయును.




## ౨౫. శ్రీకృష్ణకవి జీవితము.

తెనుగునందు భారతమును ఒక్క చేతిమీద నడిపిన కీర్తినిగొన్న బ్రహ్మశ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి కవిసార్వభౌముల జీవిత మీగ్రంథమున విపులముగ చెప్పబడినది. ఇది గవర్నమెంటు వీవింగు సూపరింటెండెంటు శ్రీ అనంతపంతుల రామలింగస్వామిగారిచే రచియింపబడినది. విచిత్ర-చరిత్రగల ఆధునికాంధ్రకవిగ్రామణులలో శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారొకరు వారు వ్యవసాయముచేసిరి. పత్రికలను ప్రచురించిరి. ముద్రాశాలను నిర్వహించిరి. రాజాస్థానములవెంట కవితావిహారము సల్పిరి. ప్రథమమున తెనుగునందు దిన పత్రికను నిర్వహించినకీర్తి శ్రీశాస్త్రిగారి కీయక తప్పదు. విధినిర్వహణమున శ్రీవారికిగల దీక్ష ప్రశంసనీయమైనది. "వీరి దినపత్రికయగు 'గౌతమి'ని ప్రకటించుకాలమునందే వీరితండ్రిగారు కాలధర్మము నొందినారు. ఆనాడుదయమున మామూలుప్రకారము పత్రికను ప్రకటించియే తండ్రిగారి శవమును సంస్కారము చేయుటకుంబోయినారు." 'వందేమాతర'మను వార పత్రికను; కళావతి, మానవసేవ, వజ్రాయుధము అను మాసపత్రికలును నిర్వహించి శ్రీశాస్త్రిగారు తెనుగు దేశపు పత్రికాజీవనమున పాల్గొని తమ ప్రజ్ఞాపాండిత్యములను ప్రకటించియున్నారు. ఈకవిగారి సంసార జీవితమున ప్రథమకళత్రవియోగసందర్భమున నడచిన వృత్తాంత మెంతయు దయనీయమై రాతిగుండెను కూడ కలిగింపజాలియున్నది. ఒకుదొడుకులకు లోనైన ఈ కవిజీవితము ఒక నవలవలె చదువనై నేటి సారస్వత సేవకుల పొల్పడు కష్టసుఖముల నన్నిటిని ప్రదర్శించుచున్నది. శ్రీకృష్ణమూర్తిశాస్త్రి గారి జీవితము శ్రీనాధుని జీవితముతో కొంతసాదృశ్యమును పొందియున్నదని చెప్పకతీరదు. అయితే శ్రీనాధుడు వ్యవసాయమును కడ కాలమునను, శ్రీవారు యౌవనకాలమునను వృత్తిగా నైకొనిరి. ఉభయత్ర వ్యవసాయము పాపనవ్యవసాయమే అనిపించెను. శ్రీనాధుని లంకల వ్యవసాయ క్షేత్రమగు బొడ్డుపల్లినుండి తిలలు పెసలు కృష్ణవేణి వెల్లువ కొనిపోగా శ్రీశాస్త్రిగారి లంకల వ్యవసాయ క్షేత్రమగు కాటవరమునుండి పొగాకును మాఘమాసములో నకాలమునవచ్చిన గోదావరివెల్లువ పొట్టబెట్టుకొన్నది. శ్రీనాధుడు, పోతన మొదలగు పూర్వకవుల వలె కాడియు, గంటమునుబట్టి జీవితమున సుఖదుఃఖములను చవిచూచి ఒకప్పుడును కవితాసుందరి పూజ మాత్రము ఏమఱని ఈసారస్వతార్చకుని జీవితచరిత్రమును తెనుగువారి కర్పించిన శ్రీరామలింగస్వామి గారిని కొనియాడుచున్నాము. ఈగ్రంథ మాంధ్రవిశ్వవిద్యాలయమువారి ఆదరణకు పాత్రమై కళాశాలాంధ్ర విద్యార్థుల కరకమలముల నలంకరించుగాక యని కోరెదము. రాయలుసైజున 132 పుటలు. వెల రు. 1-0-0. గ్రంథము ప్రతులు రాజమహేంద్రవరమున లలితా ప్రెస్సు మేనేజరువద్ద వెలకు దొరకును.

## ౨౬. గ్రహతారాదర్పణము.

గుంటూరు జిల్లా వేమూరు కాపురస్థులును, జ్యోతిశ్శాస్త్రమునందలి సిద్ధాంతభాగమున సిద్ధహస్తులును అగు శ్రీ చివుకుల వేంకటరమణశాస్త్రిగారిచే రచియింపబడినది. 1934-వ సంవత్సరము మార్చి 16-వ తేదీతో ప్రారంభమై 1934-వ సంవత్సరము ఏప్రియలు మూడవ తేదీతో అంతమయ్యెడు భావసంవత్సరపు గ్రహతారల గతులను చూపు గ్రంథము. పలువుర సహాయముచేతను; గ్రీనిచ్ యందలి యంత్రాదిసహాయముచేతను తయారు చేయబడు నాటికల్ ఆల్మనక్ పద్ధతివలె ఇందును గ్రహతారలగతులు స్పష్టముచేయబడియున్నవి. యంత్ర సాహాయ్యము లేకనే దీనిని తయారుచేసి హిందూఖ

స్త్రజ్ఞుల ప్రజ్ఞను ప్రకటించిన వెంకటరమణశాస్త్రిగారిని స్తుతింపవలసియున్నది. డెమ్మీసైజున 36 పుటలు. ఏలూరునందలి శ్రీ కప్పా విశ్వపతిశాస్త్రిగారిచే ప్రచురింపబడినది.

## ౭౭. గాంధీగారంటే?

ఆదర్శగ్రంథమాలలో ఈ పుస్తక మారవపుష్పము. లోకోత్తరపురుషుడు గాంధీమహాత్ముడు ఆంధ్రదేశ పర్యటనావసరమున ఆతని జీవితరహస్యములను ప్రజాసామాన్యమునందు ప్రచారమునకు తెచ్చుటకై ఈగ్రంథ ముద్దేశింపబడినది. ఇందు మహాత్ముని జీవితపరమార్గము వర్ణితము. శ్రీరామనాథసుమన్ గారు హిందీభాషయందు రచియించిన గ్రంథమున కిది తెనుగుసేత. అనువాదకులు శ్రీపొట్లూరి నాగభూషణముగారు. క్రౌనుసైజున 20 పుటలు. వెల 0-0-6 మాత్రమే. ప్రకాశకులు: ఆదర్శగ్రంథనిలయము, ఎలమర్రు, కృష్ణాజిల్లా.

## ౭౮. స్వదేశసంస్థానాలు

శ్రీనార్ల వేంకటేశ్వరరావుగా రీగ్రంథమును రచియించిరి కృష్ణాపత్రిక, భారతి మొదలగు పత్రికలయందు ప్రతిభావంతములగు వ్యాసము లు వ్రాయుచు నేటి ఆంధ్రవ్యాసరచయితలలో నొక ఉన్నతస్థానమాక్రమించియున్న శ్రీనార్ల వేంకటేశ్వరరావుగారిని గూర్చి ఆంధ్రలోకమునకు పరిచయముచేయవలసిన ఆవశ్యములేదు. 'అఖిలభారతవర్షవిస్తీర్ణములో మూడవవంతు స్వదేశసంస్థానములు' యావద్భారతసంతతిలో నైదవవంతు సంస్థానప్రజలు' ఇట్టియెడ స్వదేశసంస్థాన సమస్య ప్రాధాన్యము నెవరుకాదనగలరు?' సత్వరస్వరాజ్యప్రాప్తికి స్వదేశసంస్థానము లెట్లు అడ్డుతగులుచున్నవో ఈ సరికి అందఱకును అవగతమైయుండును. అట్టి సమయమున సంస్థానములందలి పరిపాలనలోని వ్యతిక్రమములు, సంస్థానాధీశుల అనుచితచర్యలు వ్యక్తీకరించి ఈ గ్రంథము వాని లోనిబండారమును వెల్లడించుచున్నది. తమకు తాము బాగుపడవు, పైగా స్వరాజ్యప్రాప్తికి అడ్డుతగులుచున్నవి. సంస్థానాధీశ్వరులు వ్యభిచరించి ఒంటిని, వ్యయముచేసి ఇంటిని గుల్లచేసికొనుచున్నవిధ మీగ్రంథమున భావమును ఉట్టిపాతలూపు ఉగ్రశైలిలో వర్ణింపబడినది. 'సంస్థానాధిపులు సమయోచితముగ కాలగతినిగుర్తించుట శ్రేయస్కరము. సామ్యసాంఘికవాదములు ప్రబలుచున్నదినము లివి. ఇట్టియెడ ప్రజాభీష్టమునకు విరుద్ధముగ—నిరంకుశముగ—పరిపాలించుట శ్రేయోదాయకమా?' అని ఈ గ్రంథసందేశము. తెనుగుదేశమునందలి జమీందారులుకూడ ఈ విషయమై దీర్ఘముగ చర్చించి ఆత్మపరీక్షచేసికొనవలసిన అవశ్యకతగలదు. ఈ ఉత్తమగ్రంథము ఆంటిక్ కాగితములమీద సుందరముగ ముద్రింపబడియున్నది. క్రౌనుసైజున 120 పుటలు. వెల 8 అణాలు. ప్రకాశకులు: నార్లవారు, కపుతరంపోస్టు, కృష్ణాజిల్లా.

## ౭౯. బ్యాంకుల్లు అందు మనీమార్కెట్టు

ఆంగ్లభాషలో ప్రచురితమైన గ్రంథము. కలకత్తా విశ్వవిద్యాలయమున ఆర్థిక, వ్యాపారశాఖాధ్యక్షులును, రాష్ట్రేతరాంధ్రప్రముఖులలో నొకరును అగు శ్రీ బసవరసు రామచంద్రరావుగారు (ఎం.ఏ., పి. హెచ్. డి., యల్.టి., యఫ్. ఆర్. ఇ. యస్. లండన్) రచియించినది. కలకత్తా కేంద్రమునకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బాంకర్సువారి సమక్షమున శ్రీవారొసగిన నాలుగు ఉపన్యాసముల సంపుటి ఈ గ్రంథము. మొదటి ఉపన్యాసము ఆదర్శప్రాయమైన మనీమార్కెట్టు: దాని నిర్మాణము అనుదానినిగూర్చి 16-12-30 తేదీని ఒసంగబడినది. రెండవ ఉపన్యాసము 16-1-31 తేదీని నేటి కర్రెన్సీపద్ధతుల సంకోచవ్యాకోచములనుగూర్చి ప్రస్తరింపబడినది. ఇతరమైన మనీమార్కెట్టులనుగూర్చి 30-1-31 తేదీని మూడవ ఉపన్యాసము. ఆదర్శప్రాయమైన మనేటరీ, బ్యాంకింగు స్టాండర్డులనుగూర్చిన 13-2-31 నాటి ఉపన్యాసము నాలగవది. మఱియు అనుబంధమున చేర్చబడిన పలువిషయములు గ్రంథము యొక్క విలువను పెంచుచున్నవి. మొదటి మూడు ఉపన్యాసములును ఆదర్శప్రాయమైన మనీమార్కెట్టును చక్కగ వర్ణించుచు మనీమార్కెట్టుల వైఖరులను వివరించుచున్నవి. ఆర్థికశాస్త్రపరిచయములేనివారుకూడ వీనియందలి విషయములను సులభముగ గ్రహింపగలుగు రీతిని ఇందలి విషయము ప్రదర్శితమైయున్నది. తుది

ఉపన్యాసమున కొన్ని క్రొత్తసూచనలు గావింపబడినవి. విడిగా ఈ ఉపన్యాసమును చదివిన ఏమియు అర్థముకాదు. మొదటి మూడు ఉపన్యాసములను చదివి అందలి విషయములను ఆకళింపునకు తెచ్చికొనిన పిమ్మట ఈ ఉపన్యాసము చదివిన సులభముగ అర్థమై మనీమార్కెట్టునుగూర్చిన అనేక విషమవిషయములు తేటతెల్లమగును. అనుబంధములోని 'ఇండియా గోల్డు స్టాండర్డు నేటి ఆర్థికమాంద్యము' అను ప్రకరణము ముఖ్యముగ చదువదగియున్నది. ఈ ప్రకరణమునకు చివరను రూపాయను పౌనుతో ముడివెట్టుటయందుగల లాభనష్టములు కూడినంత విపులముగ వివరింపబడినవి. గ్రంథము డెమ్మిసైజున 260 పుటలు. వెల రెండు రూపాయిలు. వలయువారు కలకత్తాయందలి లాల్ చంద్ అండ్ సన్సు వారికి వ్రాయునది.

## ౫౦. రాయబారము

వేగుంజుక్క గ్రంథమాలలో నిది నలుబదిమ్మిదవ పుస్తకము. శ్రీయుతులు భాగవతుల నరసింహశర్మగారిచే రచియింపబడినది. భారతోద్యోగపర్వమునందలి శ్రీకృష్ణదౌత్యవృత్తాంతము ఇందు విపులముగ ప్రకరణముల క్రింద విభజింపబడి వివరింపబడినది. శ్రీకృష్ణుని రాజకీయధౌరంధర్యమున కీగ్రంథవిషయము ప్రదర్శనశాల. ఇందలి భారతకాలమునాటి భారతదేశపటము, చిత్రపటములు, కౌరవవంశవృక్షము విషయవివరణమునకెంతయు నుపయోగపడుచు గ్రంథప్రయోజనమును అధికరించుచున్నవి. జాతీయములతోడను, సామెతలతోడను నిండారి ఇందలి వచనశైలి ప్రౌఢగ్రాంథికమై ఒప్పుచున్నది. ఈ గ్రంథము 'నవలవలె హృదయము రంజింపజేసి, కావ్యమువలె జ్ఞానప్రదమై, నేటి రాజకీయలోకమునకు దర్పణమై తుదిముట్ట చదువనిదే విడువనీయని యత్యద్భుతసంఘటనములచే స్తంభీభూతత్వమును, దిగ్భ్రమను బొందించి తన్మయతఁగలిగించి యలరించు నూతనగ్రంథరత్నము. భారతాంతర్గత పురాతన రాజకీయకథావృత్తాంతము గలిగి శ్రీకృష్ణుని దివ్యప్రతిభావిశేషమున శోభిల్లి విశ్వరూపదర్శనమునఁ బవిత్రితమైనది.' నేటి సుబ్బరాయశాస్త్రిగారి 'ధర్మజరాజసూయము'వలె నిదియు భారతవిషయకమగు నొక ఆంధ్రవచనప్రౌఢకావ్యము కాగలదని మా నమ్మకము. పద్యకవితను, గద్యకవితను సమముగ శ్రీ శర్మగారు నడుపగలుగుటకు ఈ కావ్యము నిదర్శనమిచ్చుచున్నది. ఈ గ్రంథమునందలి నలుబదిమూడు ప్రకరణములకును శిరోభూషణముగా వివిధగ్రంథములనుండి ఏర్చికూర్చబడిన పద్యరత్నములు శ్రీనరసింహశర్మగారు బహుగ్రంథద్రష్టలగుట రూపించుచున్నవి. క్రౌనుసైజున 300 పుటలు. వెల రు 1-8-0. దొరకుచోటు: భాగవతుల నరసింహశర్మ, వేగుంజుక్క గ్రంథమాల, బరంపురము, గంజాం జిల్లా.

## ౫౧ డీవేలరా

'నవయుగ' పత్రికాసంపాదకులును, 'దేవీజోన్' రచయితలును అగు శ్రీయుత గద్దె లింగయ్యచౌదరిగారు ఐరిషుస్వాతంత్ర్యవీరుడగు శ్రీడీవేలరాగారి జీవితమును ఈ గ్రంథమున కీర్తించిరి. 'జెకోస్లావికా ప్రజాస్వామికమునకు అధ్యక్షుడై నేడు ప్రపంచరాజకీయరంగమున అనంతకీర్తి గౌరవములనందుచున్న మాసరిక్ వలెనే ఐరిషు ప్రజాస్వామికమునకు అధ్యక్షుడై ప్రపంచరాజకీయరంగమున అనంతకీర్తి గౌరవములనందుచున్న డీవేలరాకూడ తొలుత ఉపాధ్యాయవృత్తియందు తగిలియున్నవాడే. 'డీవేలరా కార్యదీక్ష, ధైర్యసాహసములు, దృఢనిశ్చయము, త్యాగభావము, రాజకీయపరిజ్ఞానము, బుద్ధిబలయుక్తులు, కార్యకుశలతలు ముఖ్యముగ యువకుల కాదర్శప్రాయములు. ప్రపంచప్రశంసలకు పాత్రుడైన డీవేలరాజీవితము పరాధీనదశయందున్న యువకులుదప్పక జదువవలయునను యుద్దేశముతోడనే ఆంధ్రసోదరులకీ చిన్నిపొత్తమును సమర్పించుచున్నాను' అని గ్రంథకర్త తొలిపలుకులో తెలిపెను. డీవేలరానుగూర్చిన నాలుగైదు హిందీపుస్తకములను, విశ్వామిత్ర మొదలగు హిందీపత్రికలను ఆధారముగ గైకొని శ్రీ చౌదరిగారీగ్రంథమును రచియించిరి. ఆపరింపదగిన ఉత్తమగ్రంథము. క్రౌనుసైజున 220 పుటలు. వెల ఒక రూపాయి. ప్రకాశకులు: ఆదర్శగ్రంథమండలి, ఎలమర్రు, కృష్ణాజిల్లా.

# క్రొత్తపత్రికలు

## ౧. గార్డెనింగు రెవ్యూ

ఆంగ్లమాసపత్రిక. వ్యవసాయవిషయములను, ఉద్యానవనకృషి విషయములను చర్చించునది. నవంబరు మాసమున తొలి సంచికయు, డిసెంబరుమాసమున మలి సంచికయు ప్రచురింపబడి యథాకాలమున మా కార్యాలయమలంకరించినవి. ప్రథమసంచికయందు 'ఉద్యానవనకృషితత్త్వము', 'నేల: వృక్షజీవితము' 'తోటలు: కీటకబాధ' అను విజ్ఞానదాయకములగు వ్యాసములు ఆయావిషయములందు అభినివేశముగలవారిచే వ్రాయబడి విలువగలవైయున్నవి. రెండవ సంచికలోని 'వృక్షవైచిత్ర్యము', 'నేల: దానిని క్రమపఱచుట', 'తోటలలో గులాబీలు', 'ఫలవృక్షముల పెంపకము, వాని జాగ్రత్త' అను వ్యాసములు ప్రత్యేకపఠనార్హములై యున్నవి. ఈ సంచికయందలి 'బడితోటలు' అను వ్యాసమును అనువదించి స్థలాంతరమున ముద్రించితిమి. ఉద్యానవనకృషి మానవుని అవయవములకు వలసినంత పరిశ్రమను, అతని మనమునకు నిత్యతృప్తిని ఇచ్చునది. సాముదాయకముగ విచారించినచో దానివ్యాప్తి దేశకళ్యాణమునకు దోహదము చేయునదగుట సులభముగ నిర్ణయింపనగును. అట్టి ఉద్యానవనకృషిని ప్రత్యేకముగ ప్రస్తరించు ఈ పత్రిక ఎంతయు ప్రోత్సాహింపదగినది. శ్రీయుత సి. వి. కృష్ణస్వామిఅయ్యరు ఈ పత్రికాసంపాదకులు. పత్రిక క్రౌనుసైజున మేలితరపు కాగితములపై ముద్రింపబడుచున్నది. సాలు చందా మూడు రూపాయిలు. చిరునామా: ది గార్డెనింగు రెవ్యూ, 17, ముక్కర్ నల్లముత్తువీథి, మదరాసు.

## ౨. ఆదిక్షత్రియపత్రిక

ఇది గాంగవంశ ఆదిక్షత్రియసంఘపక్షమున సాంఘికోత్తేజమునకై ప్రకటింపఁబడు మాసపత్రిక. సంపాదకుడు. డాక్టర్ రాజవైద్య కోలా అప్పలనరసింహదేవు గారు. కార్యస్థానము: రాజమండ్రి. కొంతకాలము ఆగిపోయి తిరిగి ప్రచురణమందుచున్నది గావున దీనిని క్రొత్తపత్రికలలో చేర్చుచున్నాము. వెనుక ప్రచురింపబడునప్పుడు ఈపత్రిక సంపాదకులు తమ సంచికలలో నొకందానియందు అప్పటి తెనుగుమాసపత్రికలలో నొకటియగు ఆంధ్రసర్వస్వమునందలి శ్రీ అరవిల్లి నరసింహాచార్యులుగారి పెద్దాపురదుర్గము అను పద్యవ్యాసమును ఎత్తి ముద్రించుకొనుటలో వ్యాసకర్తనామమును, చేకొనిన పత్రికనామమును జారవిడిచి గ్రంథచౌర్యమునకు పాల్పడియున్నారు. ఈపునర్జన్మమునందైన నట్టిచౌర్యము పొంతపోవక శ్రీదేవుగారు ఈపత్రికను సవ్యముగ నడపి స్వసంఘము నుద్ధరింతురుగాక! సాలు చందా రూ 2-0-0. డబుల్ క్రౌనుసైజు. ఆదిక్షత్రియసంఘప్రముఖులు ఈ పత్రికను సుస్థిరమొనర్తురుగాక అని మనఃపూర్వకముగ వాంఛించెదము.

## ౩. సంస్కారి

ప్రతినెల 5, 20 తేదీలయందు ప్రకటింపబడు పక్షపత్రిక. కార్యస్థానము: ఎలమఱ్ఱు, కృష్ణాజిల్లా. డబుల్ క్రౌనుసైజున 8 పుటలు. విడిసంచిక వెల ఒకకాసీ. జన్మభూమి, రాజహంస, దేవదత్తము అనుకాసీ పత్రికలవలె నిదియు ప్రజాబాహుళ్యమున విశేషప్రచారమునందగలదని ఆశింతుము. 5-12-33 తేదీన వెలువడిన మొదటి సంచికలో ఆంధ్రవిద్యాసాగరులగు కం. వీరేశలింగము పంతులుగారి చిత్రమును; హరిజనసమస్య, రైతులు: శిస్తులు, జపానుసాగులాట, భావసంవత్సరపంచాంగము, ఈనాందార్ల గల్లంతు మొదలగు వ్యాసములుగలవు.

## ౪. ప్రజాసంస్థ

'స్వపరిపాలనము, సహకారము, వ్యవసాయము, గ్రామపునర్నిర్మాణము, మఱియు నితరములగు ప్రజోపయోగకరములగు సమస్తవిషయములను ప్రచురించు మాసపత్రిక. సంపాదకులు: గాదె సింహాచలంపంతులు, ఎం.యల్.సి. కార్యస్థానము గుంటూరు. నవంబరు మాసమున వెలువడిన మొదటిసంపుటపు ఐదవ సంచికలో సహకారసంస్థలు, సహకారభీమా, గుంటూరు జిల్లాలో ప్రాథమికవిద్య మొదలగు వ్యాసములుగలవు. వ్యవసాయశాఖ అను పేరుతో శ్రీకర్లపాలెము కుటుంబశాస్త్రిగారు, బి.ఏ. ఒక పద్యవ్యాసమును వ్రాసియున్నారు. పత్రిక డెమ్మిసైజున ప్రచురింపబడుచున్నది. సాలు చందా ఒకరూపాయి.

# సంపాదకీయ సమాలోచన

## ఉన్నమాట అంటే ఉలుకెక్కువ:—

జవహరలాల్ నెహ్రూపండితుడు హిందూ మహాసభను దూషించాడని హిందూమహాసభానాయకులు అన్నిమూలలనుంచి గగ్గోలు ప్రారంభించారు. కొందరు జవహరలాల్ ఏ మాత్రపుహిందువు హిందూమహాసభను నిరసించడానికన్నారు. కొందరు ఆయనకు హిందూమహాసభనుగురించి ఏ మాత్రము తెలియదు, హిందూమహాసభ మాదిరి స్వార్థత్యాగముకలమాటము మరొకటి లేదు, అందులో ఉన్న దేశసేవాపరాయణులు మరొకసంస్థలో లేరన్నారు. మరికొందరు ఆయన హిందువులప్రతిష్ఠ, జాతీయత, గౌరవము కాపాడలేనిభీరువు, పిరికిపంద, ఆయనకు హిందూమహాసభను దూషించడానికిగల హక్కేది అన్నారు. ఇంతకూ ఆయన అన్నమాట ఏమిటి? హిందూమహాసభ జాతీయత బొత్తిగా నశించిన సంఘము. కులతత్వము వీరిని ఆవరించి వీరి విచక్షణాజ్ఞానాన్ని నాశము చేసింది. మహమ్మదీయులను మించిన సాంఘికవాదులు దీని నిండా ఉన్నారు. వీళ్ళ మెదడులు చాలాకుసందు అని. జవహరలాల్ పండితుడు ఉన్నమాట అంటే వీళ్ళకందరికి ఇంత ఉలుకెందుకో అర్థంకావడంలేదు. మహమ్మదీయులు ఏవో కొన్ని తాత్కాలికలాభాలు ఆశించి జాతీయతకు విరుద్ధమైన కార్యాలుచేస్తూ, జాతీయాశయాలకు విరోధులగుతున్నారు. అందుకే వారు సాంఘికతత్వం రాజకీయంలో ప్రవేశపెట్టారు. వారితోపాటు హిందూ మహాసభవారుగూడా ఢీ అంటే ఢీ అనడం బొత్తిగా సమంజసంగాలేదు. మహమ్మదీయులు ప్రభుత్వంతో చేతులు కల్పినందువల్ల వాళ్ళకు కొన్నిలాభాలు కలిగినవని హిందూ మహాసభవారుకూడా రాబోయే సంస్కరణాలు ఆచరణలో పెట్టదామని నిర్ణయించడం వారి మెదడు కుసందుగా ఉన్నదనడానికి దాఖలా. చాలరోజులనుంచి హిందూమహాసభవారు చేసేప్రయత్నాలన్నీ అంతకంతకు దేశంలో విభేదాలుకలిగే ప్రయత్నాలే. మహమ్మదీయులు చేయడంలేదా అంటే వాళ్ళుచేశారని మనమూ చేస్తే గుడ్డిము గాడిదా ఒకటే అవుతయి. ఆ విషయం గమనించక ఏవేవో తీర్మానలుచేయడం, వాటిని విమర్శిస్తే కుళ్ళికుళ్ళి విచారించడం ఏమాత్రము బాగాలేదు. దక్షిణాదిన ఒక నాయకుడు హిందువులు చాలామంచివాళ్ళు అని మంచిప్రవర్తనకు ఒక సర్టిఫికెట్టు ఇచ్చుకుంటూ వాళ్ళు ఎప్పుడూ విదేశీయులకు సహాయము చేశారని ఉదాహరణలు ఇచ్చాడు. అయితే ఆమాటూకాదనడానికి వీలులేదు. చాలా మంచివాళ్లే. ఆ విదేశీయులు దేశసౌభాగ్యంలో భాగస్వాములు కానంతవరకున్నూ, విదేశీయులు ఉంగరాల చేతులతో మొట్టేవాళ్ళయితేనూ మనవాళ్ళ ప్రవర్తన బాగానే ఉందనాలె. దేశసౌభాగ్యంలో భాగస్వాములయినట్టిన్నీ, స్వదేశీయులయినట్టే హరిజనుల విషయంలో మనవారి మంచితనము ఏమయిందో కొంచెం ఆయన్ను విచారించుకునండి. విదేశీయులకు సహాయంచేశే

టంతటి స్వార్థత్యాగులు హిందువులనడంలో
స్వదేశీయులయినవారికి సహాయముచేయ
రనికూడా ధ్వనిస్తున్నది. మహమ్మదీయులు
కూడా స్వదేశీయులై చాలావందల సంవ
త్సరాలయింది. అయినా జవహరలాల్ పండి
తుడు హిందువులు మంచివారు కాదనడం
లేదే! ఇదివరకున్న మంచితనమే ముందు
కూడా అవలంబించి సాంఘికవిభేదాలలోనికి
దిగక, జాతీయాదర్శము ఏమరవద్దని హిం
దూమహాసభ వారికి ఆయన హితబోధ చేశా
డు. హిందుమహాసభవారు తప్పుదోవల్లో
కాలువేశారని ఇదివరలోనే నూటికి తొంభ
యిమంది హిందువులనుకుంటున్నారు. ఆ
అభిప్రాయాన్నే జవహరలాల్ పండితుడు
నిర్భయంగా వెలిబుచ్చాడు. హిందూమహా
సభానాయకులు తమ హిందూమహాసభా
ప్రయోజకత్వాన్ని సమర్థించుకుంటే బాగుం
టుందిగాని లేనిపోని అర్థములేనిమాటలు
మాట్లాడం పెద్దమనిషి తరహాగాదు జవహ
రలాల్ నెహ్రూగారికి గాంధిమహాత్ముడు
ఇచ్చిన గౌరవమేగాని ఆయన నిజంగా గౌర
వానికి అర్హుడుగాదని ఒకరు. కాంగ్రెసే ఈ
హిందూమహమ్మదీయ విభేదాలను గలిగిం
చింది, ఆమచ్చరూపుమాపడానికే హిందూ
మహాసభ ప్రయత్నిస్తున్నదని ఒకరు. హిం
దూసభానాయకులుమాత్రం స్వయంగా కష్ట
పడి గౌరవం సంపాదించుకున్నవారివలె మా
ట్లాడుతున్నారు. హిందూమహాసభానాయ
కుల కెక్కువ గౌరవం ఉందో, జవహరలాల్
పండితున కెక్కువ గౌరవముందో భారతదే
శానికి తెలుసు. కాంగ్రెసు హిందూమహమ్మ
దీయ విభేదాలను కలిగించిందో, ఆ అవ్య
క్తపుపని హిందూమహాసభేత్యాది కుసందు
బుద్ధిగల సంఘసభలు చేస్తున్నవో ఇంగిత
జ్ఞానంగల మానవులకందరికీ తెలుసు. ఈ
విధంగా మాట్లాడడంవల్ల ఇదివరకేదైనా
గౌరవముంటే ఆ కాస్తకూడా పోగొట్టుకొని
నవారైనారు హిందూసభానాయకులు.

మిల్లుయజమానులస్వలాభాపేక్ష :—

బొంబాయిమిల్లు యజమానులు మోడీ
గారి యాజమాన్యాన లంకాషైరు ప్రతినిధు
లతో ఏర్పాటుచేసుకున్న ఒడంబడిక చూ
స్తే “మన కాయుష్యం మనకారోగ్యం,
మాకు ధనం మీకు ఋణం” అనే సామెత
జ్ఞాపకమొస్తుంది. వారిదృష్టిపథంలో దేశము
యొక్క శ్రేయస్సు ఏమాత్రమూ లేదని
మనకు దీనివల్ల నిర్ధారణ అవుతున్నది దీనిని
బట్టి విచారిస్తే వారిదివరలో కాంగ్రెసుతో
కలియుడంగూడా వారిస్వలాభాపేక్ష పురస్క
రించుకొనేనని కూడా తెలుస్తుంది. కాం
గ్రెసుతో రాజీచేసుకుని ఖద్దరులాంటి ము
తుకగుడ్డ, దానిమాదిరిగా తయారుచేయ
మని చెప్పి స్వదేశీని కాంగ్రెసు ఒప్పుకొ
నేట్టు చేయడంవల్ల వారిగుడ్డకు అమ్మకము
ఎక్కువచేసుకున్నారు. వారిజేబులు నింపు
కున్నారు. స్వదేశీమిల్లుగుడ్డకు చేయూతఇచ్చి
ఖద్దరు పెద్ద దెబ్బతిన్నది. ఈ విషయమైనా
గమనించక ఆ మిల్లు యజమానులు దేశ
ద్రోహకరమైన ఒడంబడిక ఒకటిప్పుడు చేసు
కున్నారు. వారిస్వలాభాపేక్ష ముందర దే
శాన్ని మిల్లు యజమానులు తృణీకరిస్తారని
తెలినప్పుడు వారినీ, వారి లాభాలనూ
వారికే వదలడం మంచిది. వారిజేబులను
నింపవలసిన బాధ్యత ఏభారతీయుని మీద
లేదు. వాళ్ళమేలు వారికే వదలి దేశం
మేలుకోసం తిరిగి ఖద్దరునే దేశీయులంతా
ఆదరించవలెనని ఆంగ్ల దైనిక పత్రిక ఒకటి
ఇచ్చిన సలహా గమనించతగ్గది. ఖద్దరు
ఖరీదు సాధ్యమైనంతవరకు తగ్గించి అంద
గూ తిరిగి ఎప్పటివలెనే ఖద్దరు వాడవలసిన

అవసరం ఇప్పుడు మరీ ఎక్కువగా ఉంది. స్వదేశిమిల్లుగుడ్డ ప్రజలు కొనవచ్చునని కాంగ్రెసు సలహా ఇచ్చినతరువాత మోసపు స్వదేశీగుడ్డ దేశంలో ఎక్కువైంది. స్వదేశీ అనిగాని విదేశీ అనిగాని నిర్ణయించ వీలు లేక స్వదేశీమాదిరిగా ఉండేగుడ్డను స్వార్థపరులైన వర్తకులు అనేకులు స్వదేశీ పేరున విక్రయించడము ఎక్కువైంది. పర్యవసానము.... తెలియని చాలామంది చివరకు విదేశీయే కొన్నారు. వాళ్ళు దాన్ని స్వదేశీ అనుకున్న మాత్రాన దేశానికి రావలసిన నష్టం రాకుండా ఉండదుగదా! అసలు మిల్లు నూలు వస్త్రములనే కొనడం మానివేసితే ఈవిధంగా మోసపోవడానికే వీలుండదు. మిల్లు యజమానులు, ఇతర వర్తకులు స్వార్థముపేక్షించి దేశద్రోహం చేయడానికీ వీలుండదు. ఖద్దరు బీదలపాలిటి కల్పవృక్షమయి విలసిల్లడానికి వీలవుతుంది.

---

## సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సుసొసైటీవారి ప్రథమవార్షిక నివేదిక:—

1932-వ సంవత్సరము ఏప్రియలుమాసమునుండి 1933-వ సంవత్సరము జూనుమాసమువఱకుగల పదునైదుమాసముల ఈ ఇన్సూరెన్సు సొసైటివారి ప్రథమవార్షిక నివేదిక విమర్శనార్థము మాకార్యాలయమునకు పంపబడినది. నివేదితకాలమున సొసైటీవారు కావించిన పనియెంతయు తృప్తికరముగను, ప్రోత్సాహకరముగను ఉండి సొసైటీయొక్క భావిశుభమును, అభివృద్ధిని సూచించుచున్నది. గతవత్సరపు జూను 30-వ తేదీకి 55 సహకారసంఘములును, 550 గురు వ్యక్తులును సభ్యులైయున్నారు. నివేదితకాలమున 6,33,500 రూపాయిల భీమావ్యాపారమును ఈ సొసైటీవారు చేయగలిగియుండిరి. ఇది శుభారంభమై సొసైటీకార్యనిర్వాహకుల కార్యదక్షత్వమును ప్రదర్శించుచున్నది. సొసైటీవారి ప్రధానసంకల్పములలో పేదతరగతుల,మధ్యమతరగతులవారినుంచి చిన్నమొత్తములకు పట్టాలనుగొనుట ప్రత్యేక ప్రశంసనీయమైయున్నది. ఐదువేలకుమించి ఈ సొసైటీయందు పట్టాలీయబడవు. నూరు రూపాయిలకుకూడ పట్టాలీయబడును. ఇట్టి సొసైటీ బీదలపాలిటి పెన్నిధిగానున్నది. నివేదితవత్సరమున సొసైటీవారు సమకూర్చిన ఆరులక్షలకు మించిన భీమావ్యాపారములో నాలుగులక్షలవఱకు చిన్నమొత్తములపట్టాలవలననే సమకూడినదనుటచే సామాన్యజనులకీసొసైటీ ఎట్లు అందుబాటైయున్నదో తెలిసికొనవచ్చును. ఈ సొసైటీవారి ప్రీమియము రేట్లు మిక్కిలితక్కువ. పోస్టలు ఇన్సూరెన్సులో తప్ప ఇతరకంపెనీలయందు ఇంతటి తక్కువ ప్రీమియము రేట్లు లేవని చెప్పవచ్చును. ఈ కంపెనీవారి మఱియొక సంకల్పము సహకారభీమావలని లాభములను సౌత్ ఇండియాయందలి అన్నిజిల్లాలయందును, పరిసరమునగల స్వదేశసంస్థానములందును కలిగించుట. నివేదితకాలమున ఒక్క సౌతు ఆర్కాటుజిల్లాయందు తక్క మిగిలిన అన్ని జిల్లాలయందును మైసూరు, కొచ్చిన్, ట్రావెన్‌కూరు సంస్థానములందును సొసైటీవారు భీమావ్యాపారమును సమకూర్చియుండిరి. ఒక్క తెలుగుజిల్లాలనుండి మూడున్నర లక్షల భీమావ్యాపారము సొసైటీవారు సంపాదింపగలిగిరనుట ఆంధ్రులకు ఆనందమును గూర్చు విషయము. మదరాసు ప్రభుత్వమువారు ఈ సొసయిటీవారి వ్యాపారాభివృద్ధికి

చక్కని చేయూత నొసంగుచున్నారని వినుట కెంతయు సంతోషముగ నున్నది. ఆంధ్రనాయకపుంగవులు శ్రీయుత వేమవరపు రామదాసుపంతులుగారు ఈసొసయిటి అధ్యక్షమహాశయులు. సౌత్ ఇండియాయందు సహకారోద్యమప్రచారమునకు మూలస్తంభములై వారు దేశకళ్యాణమునకు అనంతముగ తోడుపడుచున్నారు. బొంబాయియందును, బెంగాలునందును కో ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసయిటీ లుండుటనుగాంచి తమ కార్యక్షేత్రమగు సౌత్ ఇండియాయందుగూడ నట్టి దొకటి యుండుట వాంఛనీయమనియు, ప్రజోపయోగకరమనియు శ్రీ రామదాసు పంతులుగారు తలంచి ఈసౌత్ ఇండియా కో ఆపరేటివు ఇన్సూరెన్సు సొసయిటీని స్థాపించిరి. కార్యదక్షులుగావున వారు ఒక్క సంవత్సరమునందే ఈ సొసయిటీ భీమావ్యాపారము బొంబాయి, బెంగాలు సొసయిటీలు ఇంతవరకు చేసిన భీమావ్యాపారమును మిగులునట్లు ఒనరింపగలిగిరి. సహకార భీమావ్యాపారమునకు సముచితప్రచారమును గొనివచ్చి ప్రజాక్షేమమునకు ప్రోద్బలమిచ్చుచున్నందులకు శ్రీ పంతులుగారికి సౌత్ ఇండియా యెంతయు ఋణపడియున్నది సొసయిటి కార్యదర్శులగు వి. వేంకటచలముగారు సొసయిటీ క్షేమమునకై చేయుచున్నకృషియు ప్రత్యేక ప్రశంసనీయమైయున్నది. నివేదితవత్సరమున వారుస్వయముగ సొసయిటీకి 52,500 రూపాయిల విలువగల భీమావ్యాపారమును కాన్వాసుచేసి అందుపై ఎట్టి కమీషనుగాని గైకొనక సొసయిటీ క్రమాభివృద్ధికి మంచి పునాదివైచిరి ఆంధ్రసహకారోద్యమ ప్రచారకులు నరసింహదేవర సత్యనారాయణగారు మున్నగువారు ఈసొసయిటీడైరక్టరేటు నందుండి సహకారభీమాప్రచారమున కెంతయు తోడుపడుచున్నారు. ప్రథమవార్షిక నివేదికయందే ఇంతటి విశేషాభివృద్ధినిచూపి సొసయిటీకి సుస్థిరతప్రసాదించిన అధ్యక్షమహాశయులను, కార్యదర్శులను, డైరక్టరులను మేమెంతయు అభినందించుచున్నాము.

**ఆకస్మికసంపాదకుడు శ్రీనాగేశ్వరరావు:—**

ఆంధ్రపత్రిక ప్రధానసహాయసంపాదకులగు శ్రీ చల్లా శేషగిరిరావుగారి కీనడుమ కలిగిన అనారోగ్యమునుగూర్చియు, వారు పునరారోగ్యమును పొందుటకై శ్రీనాగేశ్వరరావుగారు సలిపిన విశేషకృషి, చేసిన అనంతసహాయము ఆంధ్రపత్రికవలన ఆంధ్రలోకము తెలిసికొనియేయున్నది. తమ పత్రికాకార్యాలయమున పనిచేయువారి క్షేమాభివృద్ధులవిషయమై కంటవత్తిడుకొని శ్రీ నాగేశ్వరరావుపంతులుగారుందురనుటకు ఆంధ్రపత్రికసన్మానావసరమున పత్రిక ప్రారంభించినప్పటినుండియు కంపోజిటరుగనున్న ఆతనిని పేర్కొనుటయు, ఇపుడు శ్రీ శేషగిరిరావుగారి విషయమున వారు తీసికొనినశ్రద్ధయు ప్రబల నిదర్శనములు. తమ సహాయసంపాదకుల నిట్లాదరించు సంపాదకులు ఆంధ్రదేశమున నెందరున్నారు? జైలులో కలిగిన కష్టకాలపరిచయమునుగూడ మఱచి బయటకువచ్చినతోడనే ఆసహాయసంపాదకుని ఉద్యోగమునకు ఉద్వాసన చెప్పగలవారును, తనక్రిందితాబేదారు సహాయసంపాదకునిమాట మిగిలినను మౌనముద్రాంకితుడై యుండగలవారును అగు సంపాదకులు శ్రీనాగేశ్వరరావుగారిని చూచియైనను గుణపాఠము నేర్చికొని మెలగి తమ సంపాదకస్థితికి తగిన గౌరవప్రతిష్ఠల నందుదురుగాక! బాధ్యతకు దూరులగుచో వారికి రాగల గౌరవము నామమాత్రముగునని వారు తెలిసికొనవలసియున్నది.